# కథామంజరి

## పది కథల సమాహారం



సెప్టెంబర్ 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

సెప్టెంబర్ 2025

సంపుటి : 6 ♦ సంచిక : 9



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


కథాకీయం ... ... ... ... ... ... i

విశిష్ట అతిథి ... ... ... ... ... ... iii

కథా మార్గదర్శి ... ... ... ... ... ... v

కథా పరిచయం ... ... ... ... ... ... vii

కథాపుస్తక పరిచయం ... ... ... ... ... ... x


## కథలు, వ్యాసాలు


ఆర్ట్ ఆఫ్ లీవింగ్! ... డా. ఎమ్. సుగుణరావు ... ... 1

భేతాళ ప్రశ్న ... సింహాద్రి నాగశిరీష ... ... 8

జీవనవేదం ... లక్ష్మీ గాయత్రి ... ... ... 12

జీవితం నిత్యనూతనం ... రాజా మోహన్ ఇవటూరి ... ... 17

3G 3B ... డా. ఎం. కోటేశ్వర రావు ... ... 23

నాగిరెడ్డన్న! ... వారణాశి భానుమూర్తి రావు ... ... 31

సమయపాలన ... కె.వి. లక్ష్మణరావు ... ... ... 36

కాకి ఆనందం ... పైడిమర్రి రామకృష్ణ ... ... ... 38

నీరెండ నీడ ... వడలి రాధాకృష్ణ ... ... ... 40

తల్లి మనసు ... కె రామలక్ష్మి ... ... ... 46


Cover Page Credits : James Wheeler, Vancouver, Canada

# కథాకీయం

విదేశాల్లో ఉన్నా, పెద్ద పెద్ద పదవులు ఉద్యోగాల్లో ఉన్నా.. ఈ రోజుల్లో కూడా మాతృభాషని, ఆ భాషా సాహిత్యాన్ని గౌరవించే వాళ్ళు ఎక్కువే ఉంటారు. వీరి ముందు సాహితీ(సృష్టి)కారుల సంఖ్య చాలా తక్కువ అని చెప్పాలి. అయితే ఈ సాహితీ సంపదను భుజాల మీద వేసుకుని.. వచ్చే తరాలకి పదిలంగా అప్పచెప్పాలనుకునే మహాను'బోయీలు' బహు తక్కువని ఘంటాపథంగా చెప్పాలి! అలాంటిది.. తెలుగు భాషకి పట్టం కట్టే పండగ ప్రతీ ఏటా చేయాలని తలచి, వలచి... తెలుగు నేలకు సప్తసముద్రాల ఆవల.. ఐదు దశాబ్దాలుగా జరుపుతుండటం చిన్న విషయమేమి కాదు! ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత "వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా" వారిదే!

వంగూరి ఫౌండేషన్ మరియు హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి.. సంయుక్తంగా ఆగష్టు 16, 17 తేదీలలో హ్యూస్టన్ నగరంలో జరిగిన 14వ అమెరికా తెలుగు సాహితీ సదస్సుని నిర్వహించిన తీరు అమోఘం అని చెప్పాలి! అందులో... సహస్ర చంద్ర దర్శన వయసులో.. పదహారేళ్ళ బాలా కుమారుడులా శ్రీ వంగూరి చిట్టెన్‌రాజుగారు, ఆయన వెనుకా ముందు ఆబాలగోపాలం.. ఆడుతూ పాడుతూ భారీ వర్ణ(ణాతీతం)గా, రసరమ్యంగా నడిపించడం.. మాటలకందని ఓ గొప్ప విషయం! విశేషం కూడా!!

ఓ గంట సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించాలంటే.. నెల రోజులు పిల్లిమొగ్గలు, సూర్యనమస్కారాలు చేస్తే గాని.. కార్యం గట్టెక్కడం లేదు. అలా ఆపసోపాలు పడుతూ, వాటిని చెయ్యాలా.. అని ఇంటా బయటా కూడా వినబడటంలో ఆశ్చర్యం లేదు! బారసాల దగ్గర్నుంచి.. పద్మశ్రీ పురస్కారాల వరకు, నడుం కట్టుకుని పని చేసే 'బిల్లు'గేటులు చాలా మంది ఉంటారు. ఎటొచ్చీ.. సాహితీ సమావేశాలనేసరికి మీనమేషాలకి రెక్కలొచ్చి లెక్కల్లోకి వెళ్తాయి! ఈ నేపథ్యానికి మంగళం పాడిన కార్యక్రమం.. 14వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు.

ఏం... చెప్పాలి!

ఏదో... ఒకరిద్దరిని పిలిచి, నాలుగు మాటలు చెప్పించి, మెప్పించొచ్చు! వారి పాండిత్యాన్ని పదిమందికి అందించి ఆనందింపచేయొచ్చు! వీరతాళ్ల మీద మమకారం లేకపోయినా.. సాహితీసంపదని కాపాడతున్నామనే తృప్తి కలగవచ్చు! కాని అలాంటి 'ఒకరిద్దరి'తో సాహిత్యం ముందుకు నడవలేదు. వారితో అంతం కూడా కాకూడదు. భాషా సాహిత్యాన్ని ముందుకు నడిపించడానికి పదుల్లో జనం కావాలి! తలో కలం పట్టుకుని.. సేద్యం చేయాలి. వారందరి భుజాలు తట్టి, ఊరేగింపుగా తెలుగు సాహితీ సంపదను తీసుకువెళ్ళాలి. ఈ తపనే.. అక్కడ ప్రస్ఫుటంగా కనబడింది!

వచ్చిన వాళ్ళందరూ... పద్యం, కవిత, కథ, వ్యాసం, ఇతిహాసాలు, చారిత్రాత్మక విషయాలు.. ఇలా ఏదో ఒక విషయాన్ని లోతుగా అధ్యయనం చేసి, సమర్పించారు. సమర్పణలలో గాఢత కనబడింది. విషయాల పట్ల పట్టు కనబడింది. వాటి వెనుక వారి కృషి, మాతృభాష పట్ల మమకారం కనబడింది. వెరసి.. మన భాషా సంపద 'చిరంజీవే' అనే నమ్మకం కలిగింది!

ఇక.. ఈ రెండు రోజుల సదస్సులో పాల్గొనే అవకాశం వచ్చింది. ఎవరూ కొత్తగా పరిచయం అయినట్టు అనిపించలేదు. తెలుగు నేల వదిలి అమెరికా వచ్చినట్లు అనిపించలేదు. ఆవకాయ అన్నానికి దూరమయినట్టు అనిపించలేదు. అచ్చమైన తెలుగు నేల మధ్య నిలబడినట్టుంది! మరో మాట చెప్పాలంటే.. చక్కెర కలిపిన చిక్కని పాల పెరుగు తోడు వంటి.. తెలుగు నా చుట్టూ కనబడింది, వినబడింది! బయట కూడా ఎవరు మాట్లాడుకున్నా.. సాహిత్య విషయాలే వారి మధ్య చోటు చేసుకోవడం గొప్ప విషయంగా చెప్పాలి. కథకులతో ముచ్చట్లతో పాటు.. 'కథామంజరి' గురించి మాటాడే అవకాశం కూడా వచ్చింది!

ఏటేటా తెలుగు సాహితీ సదస్సులు దేశవిదేశాల్లో నిర్వహిస్తూ, తెలుగు సాహిత్య ప్రగతికి పాటు పడుతున్న.. వంగూరీ ఫౌండేషన్, హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి వారికీ, ఇలాంటి కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తున్న రథసారథులు శ్రీ చిట్టెన్‌రాజు గారు, శ్రీకాంత్‌రెడ్డి గారు, శ్రీ శాయి రాచకొండ గారు, ఇతర కార్యవర్గసభ్యులకు అభినందనలు!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**శ్రీ వడలి రాధాకృష్ణ గారు**

మానవ సంబంధాలలోని సహజత్వాన్ని చూపుతూ, జీవన సంఘర్షణలను ప్రతిబింబించే కథలు చదువుతున్నప్పుడు.. పాఠకులు అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతారు. కథలో తానో భాగమైనట్టు భావిస్తారు. రచయిత వ్యక్తపరిచే ఆవేదన... ఆ పాఠకులలో కూడా కలుగుతుంది. అలాంటి రచనలు అందించే రచయితలలో ఓ విశిష్టమైన గుర్తింపు తెచ్చుకున్న రచయిత శ్రీ వడలి రాధాకృష్ణ గారు!

“చిన్నప్పట్నుంచీ కథలు, కవితలు చదవడం అలవాటున్నా.. నిత్యం చూస్తున్న జీవనపోరాటాలు, వెనుకబాటుతనం, పక్కవారిని చులకనగా చూడటం.. వంటి ఎన్నో విషయాలు నాలో ఆవేదనను కలిగిస్తాయి. అవే నన్ను కలం పట్టుకునేటట్టు చేసాయి!” అంటూ నిజాయితీగా తన సాహితీ ప్రస్థానం గురించి చెప్పే రాధాకృష్ణ గారికి మధురాంతకం, కొడవటిగంటి, రావిశాస్త్రి వంటి వారి రచనలు చాలా స్పూర్తిని కలిగించినా, మునిపల్లె రాజుగారంటే చాలా ఇష్టం అని చెప్తారు.

శ్రీ రాధాకృష్ణ గారి కథలు.. చాలా సరళమైన శైలిలో ఆరంభం నుంచే పాఠకుల్ని కట్టి పడేస్తాయి. వారి రచనలో ఏ కథ చదివినా.. కథాకాలం నాటి సామాజిక పరిస్థితులు, ప్రజల జీవనాలు కనబడతాయి. కథాపరంగా కనబడే వాతావరణం, సంస్కృతి, సమస్యలు.. మనసును తాకేలా కథారచన సాగుతుంది. నైతిక విలువలు, మానవ సంబంధాలకు అత్యంత ప్రాముఖ్యత ఇచ్చే రాధాకృష్ణగారు దేశంలోని ఇతర ప్రాంతాల్లో పర్యటిస్తున్నప్పుడు.. అక్కడి వ్యక్తులు పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, అవగాహన చేసుకుని.. కథా రచనలు చేస్తారు. ప్రతీ రచన వెనుక సాధన కనబడుతుంది. సమస్యల పట్ల ఆవేదన.. రచయితగా సమాజం పట్ల తన బాధ్యత.. రాధాకృష్ణ గారి రచనలకు కనబడి, చదివిస్తాయి.

ఏడు వందలకు పైగా కథలు, నాలుగు వందల కవితలు వ్రాసిన రాధాకృష్ణ గారు.. 1963 సెప్టెంబరు 5 వ తేదిన జన్మించారు. భారత పూర్వ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినం కూడా అదే తేదీన కావడంతో.. వీరికీ ఆ పేరు పెట్టారు. బిట్స్ పిలానిలో ఎమ్.టెక్. చేసిన రాధాకృష్ణ గారు ఎమ్.ఎ., ఎమ్.బి.ఎ. కూడా చేసి, చీరాలలో ఐటిసి కంపెనీలో ప్రొసెసింగ్ మేనేజర్ గా విధులు నిర్వహించారు. రాధాకృష్ణ గారి.. జీవనది, గూటిపడవ, చీకటి పున్నమి, మంచినీటి సముద్రం, దోసిలి సందిట.. వంటి కథాసంకలనాలు, ఇతర కవితా సంకలనాలు చాలా ఆదరణ పొందాయి. రాధాకృష్ణ గారి సంపాదకత్వంలో.. కథాపురి, నాలుగు నాలుగులు పదహారు, ఐదు కలాలు–ఐదేసి కథలు.. వంటి కథా సంపుటాలు విడుదలైనాయి. ఎన్నో సాహితీ సంస్థలు.. రాధాకృష్ణగారి సాహితీ కృషికి గుర్తింపుగా సాహితీమిత్ర, కవిమిత్ర, కళావిరించి, కథకరత్న.. వంటి బిరుదులను ప్రదానం చేసాయి. ఇక వీరికి లభించిన బహుమతులు, సాహితీ పురస్కారాలు గురించి వ్రాస్తే ఓ చిన్న గ్రంథమే అవుతుంది. వీరి రచనలపై పలువురు పరిశోధనలు చేసి పి.హెచ్.డి. లు కూడా పొందారు.

వర్తమానంలో ఉన్న కథాసాహిత్య పరిస్థితుల గురించి చెప్తూ.. "ఇప్పుడిప్పుడే యువరక్తం కథాసాహిత్యంలోకి ప్రవేశిస్తోంది. ఇది శుభసూచకం.. అయితే వారు ఎక్కువగా చదవాలి. గతకాలపు సాహితీ ప్రక్రియలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ప్రస్తుత పరిస్థితులను రాయగలగాలి. మనుషుల ఆలోచనల సరళి, సమాజంలో వస్తున్న మార్పులను గమనించి, సృజనాత్మకంగా తమ రచనలలో చూపగలగాలి. అప్పుడే నేటి కథ నిలబడుతుంది!" అంటారు.

సాహితీరంగంలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు సంపాదించుకున్న శ్రీ వడలి రాధాకృష్ణ గారు.. కథామంజరి ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసి, వెంటనే ఓ కథ వ్రాసి పంపినందుకు మా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం. వారి కలం నుంచి మరో ఇన్ని కథలు, కవితలు తెలుగు సాహితీలోకాన్ని అలరించగలవని ఆశిస్తున్నాం.

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

**కీ. శే. కె. రామలక్ష్మి**

'స్త్రీవాద రచయిత్రులు' అని చాలామందికి పేరు ఉంది. ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ పదం ఎక్కువగా వినబడుతుంది. కాని ఉన్న వాస్తవ విషయాలనూ, కష్టసుఖాలనూ, అన్యాయాలనూ.. నిక్కచ్చిగా, సూటిగా తమ రచనలలో చూపించడం ఏ రచయితైనా చేయవలసిన పనే! ఆ విషయం ఎలా వున్నా... స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తెలుగు సాహిత్యంలో ఓ 'వైబ్రంట్ రైటర్స్'' అని ఇంగ్లీషులో అంటారు గాని, తెలుగులో చైతన్యవంతమైన రచనలు అందించిన తొలి తరం రచయిత్రులలో మొదటి వరుసలో ఉన్న రచయిత్రి శ్రీమతి కె. రామలక్ష్మి గారు! సాహిత్యం పట్ల అంతగా పరిచయం లేనివారికి సైతం.. రామలక్ష్మి గారిని పరిచయం చేయవలసిన పనేంలేదు. జగమెరిగిన గొప్ప రచయిత్రి, అభ్యుదయవాది, నిర్మొహమాటంగా ఏ విషయాన్నైనా శషబిషలు లేకుండా సూటిగా చెప్పగలిగే మానవతావాదిగా తెలుగువారికి తెలుసు! నమ్మిన సిద్ధాంతాల విషయంలో రాజీలేని జీవనం గడిపిన రామలక్ష్మి గారు.. ఇంటా బయట కూడా సాహిత్య జీవనమే గడిపారు.

డిసెంబర్ 31, 1930 న అప్పటి తూర్పు గోదావరి జిల్లా కోటనందూరులో జన్మించారు. బి.ఎ. చదువుకుని స్త్రీ సంక్షేమ సంస్థలో కొద్దికాలం పనిచేసి, తర్వాత 'స్వతంత్ర' పత్రికలో ఉపసంపాదకులుగా చేరారు. తన ఇరవై ఒకటో ఏట రచనా వ్యాసంగంలో అడుగుపెట్టి, ఇరవైనాలుగో ఏటనే తొలి కథాసంపుటిని వెలువరించారు. ఆధునిక తెలుగు సాహిత్యాన్నే కాదు, ప్రాచీన సాహిత్యాన్ని, ఆంగ్ల సాహిత్యాన్ని బాగా చదివి ఆకళింపు చేసుకున్న రచయిత్రి రామలక్ష్మి గారు! వందల్లో కథలు, పదుల్లో నవలలు వ్రాసిన రామలక్ష్మి గారు.. ఎన్నో విషయాల మీద చాలా వ్యాసాలు కూడా వ్రాసారు. ఆంధ్రపత్రిక వారపత్రికలో ప్రశ్నలు–జవాబుల శీర్షికను చాలా సంవత్సరాలు నిర్వహించారు. ఇలా వివిధ ప్రక్రియలలో రామలక్ష్మి గారి కలం కనబడేది. నిక్కచ్చిగా మనసులో ఉన్న మాటను చెప్పడమే కాదు, రాతల్లో కూడా కనబడేవి. ప్రముఖుల మీద అభిప్రాయాన్ని కూడా మొహమాట పడకుండా వాళ్ళలో ఉన్న చెడుని నిర్భయంగా చెప్పేవారు. అదే పదునుతో, ఆ రోజుల్లో వ్రాసిన పార్వతీ కృష్ణమూర్తి కథలు చాలా ప్రాచుర్యం పొందాయి.

యువత, ప్రేమ, పెళ్ళి, పిల్లలు, పెంపకం, కలహాలు.. ఇలా యువతను ఆకర్షించే విధంగా ఆ కథలను హాస్య ప్రధానంగా వ్రాసినా.. ఎంతో గొప్ప సందేశాన్ని ఇచ్చాయి. నిజానికి రామలక్ష్మి గారి ఏ రచన చూసినా హాస్యంతో పాటు వ్యంగ్యం కూడా కనబడుతుంది. ఆ వ్యంగ్యం గాని, హేళనగాని సహేతుకంగానే ఉంటుంది కాని పని పెట్టుకుని రాసినట్టు ఉండదు. తన మొదటి కథాసంపుటి "విడదీసిన రైలుబళ్లు" కి ముందుమాట వ్రాసిన ఆరుద్ర గారితో వివాహమయింది. రిజిష్టర్డ్ మ్యారేజ్ కి సాక్షి సంతకాలు.. శ్రీశ్రీగారు, ప్రముఖ దర్శకుడు హెచ్.ఎం. రెడ్డిగారు చేసారు. వివాహం అనంతరం.. రామలక్ష్మిగారికి

అటు ప్రముఖ సాహితీవేత్తలతోనూ, ఇటు సినీ ప్రముఖులతోనూ సత్సంబంధాలు ఏర్పడ్డాయి. రామలక్ష్మి గారు “జీవన జ్యోతి” సినిమాకు కథ అందించారు. వీరి ‘తొణికిన స్వప్నం, ఒకే జీవికి స్వేచ్ఛ, అద్దం’ వంటి కథా సంపుటాలు, విడదీసే రైలుబళ్ళు, తొణికిన స్వప్నం, కరుణ కథ, ఆడది, ఆశకు సంకెళ్ళు’ వంటి నవలలు చాలా ప్రాచుర్యం పొందాయి.

రామలక్ష్మి, ఆరుద్ర దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ఆరుద్రగారి మరణం తర్వాత.. రామలక్ష్మి గారు కుమార్తె దగ్గర ఉంటూ.. మార్చి 3, 2023 న కనుమూసారు. ఈ మరణంతో మొన్నటి తరం అభ్యుదయ రచయిత్రుల శకం ముగిసిందనే చెప్పాలి. కాని రామలక్ష్మి గారి సాహితీ గుబాళింపులు తెలుగుభాష ఉన్నంతకాలం.. చిరంజీవి గానే ఉంటాయి. వారికి ఘనమైన నివాళులు తెలియచేసుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

# కథా పరిచయం

## కీ. శే. పాలగుమ్మి పద్మరాజు గారి కథ “పడవ ప్రయాణం”

పాలగుమ్మి పద్మరాజుగారు అనగానే గుర్తుకొచ్చేది ‘గాలి వాన’ కథ. 1952లో న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యునల్ వారు నిర్వహించిన ప్రపంచ కథల పోటీలో 23 దేశాల నుండి వచ్చిన 59 కథలలో, పద్మరాజుగారి ఈ కథకు రెండవ బహుమతి లభించింది. ఆయనకు ఆంగ్ల భాషపై, సాహిత్యంపై ఉన్న పట్టు వల్లనే, తన కథను తనే ఆంగ్లంలోకి అనువాదం చేసి పోటీకి పంపారు. తన జీవిత కాలంలో ఆయన అరవై కథలు, ఎనిమిది నవలలు, ముప్పై కవితలు ఇంకా ఎన్నెన్నో నాటికలు, నాటకాలు రచించారు. పాలగుమ్మి పద్మరాజుగారి నవల “బతికిన కాలేజీ” కి ఉడ్‌హౌస్ రచనలు ప్రేరణే అని సులభంగా తెలుస్తుంది. ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కూడా.

‘పడవ ప్రయాణం’ కథ కూడా తెలుగు సాహితీ ప్రపంచంలో ఎంతో ఆదరణ పొందిన కథ. ఈ కథకుడిని, కథను పరిచయం చెయ్యనక్కరలేదు. అయితే అప్పుడప్పుడూ మనం ఈ కథలను తల్చుకోవడం ద్వారా కథలు ఎందుకు గొప్ప కథలవుతాయని మరోసారి పునశ్చరణ చేసుకోవడం అవసరమని నా అభిప్రాయం.

రచయిత తను చేసిన పడవ ప్రయాణంలో ఒక స్త్రీ పురుష జంట యొక్క ప్రవర్తనకు, అక్కడ జరిగిన సంఘటనలకు ఒక సాక్షి. ఆ ఆడమనిషితో తన సందేహాలు తీర్చుకోవడంలో తనది కూడా కథలో పాత్రే అయింది. ఆ పాత్రలో రచయిత పడే అంతర్మథనం.. పాఠకుడికి, ఆ స్త్రీకి మధ్య వారధి.

కథ నిరాశలో మొదలవుతుంది, ‘పొద్దు కుంకిన తరువాత లోకమంతా దిగులుగా ఉంది.’ అంటూ, పడవ టాపు మీద తను వెల్లకిలా పడుకుంటాడు. ఓ గట్టు దగ్గర ఇద్దరు మనుషులు, ఒక ఆడ, ఒక మగ, ఎక్కి వాళ్ళు కూడా పడవ టాపు మీదకొస్తారు. వారిద్దరి సంభాషణలు కళ్ళు మూసుకున్నా తన చెవిని పడుతున్నాయి. పూర్తి నిద్ర కాదది. టాపు మీదకొచ్చే ముందు, సరంగు ప్రశ్నలకు ఆమె ఇచ్చిన సమాధానం.. ‘ఇజానగరం, ఇశాకపట్టణం, ఇద్దరూ కలిసి తిరిగొచ్చారని, ఇప్పుడు మండపాక పోతున్నారని, సరంగులకు ఆమెతో ఉన్న పరిచయం, ఆ ఇద్దరూ ఆ పడవలకు కొత్త కాదనీ’ తెలుస్తుంది.

ఆమె రంగి, వాడి పేరు పద్దాలు. కొద్దో గొప్పో తాగి ఉన్నాడు. గుమాస్తాగారికీ తెలుసు పద్దాలు సంగతి. రంగి బ్రతిమాలి మండపాక దాకానే అని చెప్పి ఆయన్ని కసురుకుంటున్న పద్దాలుని సముదాయించింది. పక్కనే ఇంకొకరు పడుకున్నారని గమనించింది రంగి.

కాసేపు తరవాత రంగి మెల్లగా చుక్కాని వైపు కదిలింది. చుక్కాని కాసే మనిషితో (మరిది అని సంబోధిస్తూ) మాట కలిపి, అతనికి నిద్దరొస్తోందంటే తనే చుక్కానిని తీసుకుంది పాటలు పాడుకుంటూ.

కాసేపటిలో పడవలో గొడవ మొదలైంది. పడవ ఆగింది. గట్టుమీద రంగిని ఇద్దరు పట్టుకుని ఉన్నారు. “ఆ దొంగనాకొడుకు పారిపోయాడు. సరుకు ఎత్తుకుపోయాడు. ఈ లంజ ఎక్కడో గట్టుకు తార్చింది పడవని, సుక్కాని పట్టుకుంది లంజ” అంటున్నాడు గుమాస్తా.

ఎక్కడ దింపుకు పోయాడే అంటే, నిజం మాత్రం చెప్పదు. పోలీసులకప్పగించడమే మంచిదని నిర్ణయమైంది. పడవ కదిలింది మళ్ళీ. రంగిని టాపు మీదకు ఎక్కించారు. రంగితో సంభాషణ మొదలైంది. ఆమె పద్దాలుకి పెళ్ళాం కాదు. లేవదీసుకొచ్చాడు. పెళ్ళాం వేరు. పోనీ సరిగ్గా చూసుకుంటాడా అంటే, ఒకసారి రంగిని గుడిసెలో పెట్టి నిప్పంటించాడు. కాలిన గడోటి వీపుమీద పడింది. మచ్చ ఇంకా పోలేదు. ఇప్పుడు తీసుకెళ్ళిన సరుకుని పెళ్ళాని కోసమే కానీ, రంగి కోసం కాదు. మరి ఇంకా రంగికి వాడితో ఎందుకు?

ఆమె సమాధానం "అయ్యగోరూ! వాడు మారాజండి. అల్లంటి మడిసి లేడండి మల్లీని. వాడు కంటబడితే అన్నీ మరిచిపోయి కరిగిపోతాను. ఎంత జాలిగా మాట్లాడటాడని!"

పద్దాలు తాగి రంగిని కొడుతూంటే వదిలి వెళ్ళాలనిపిస్తుంది. "అయినా అంతటి మనిషి లేడండి. ఉత్తప్పుడు ఎన్నలా కరిగిపోతాడు." అదీ రంగి మాట.

ఆడొచ్చి గోలెడితే తను దొంగతనాల్లోకి దిగుతుంది. సొమ్ము తన దగ్గర లేదు కదా, అంచేత పోలీసులు నాలుగు ఇచ్చుకున్నా, ఓరోజులో వదిలేస్తారు. వాడినా పట్టుకోలేరు.. ఎందుకంటే ఈపాటికి అన్నీ అమ్మేసుంటాడు.

పద్దాలు కోసం ఆమె ఏ పని చెయ్యాలన్నా సిద్ధంగా ఉంది. ఆమె అతణ్ణి ఉన్నవాడిని ఉన్నట్లుగా అంగీకరించింది. రచయిత మాటల్లో అదొక ఆదర్శమూ కాదు, భక్తి కాదు, ప్రేమా కాదు. ఎన్నో చిత్రమైన సంకీర్ణ భావాలతో, ఈసులతో, అనురాగాలతో ఎన్నిటితోనో కలిసిన స్త్రీ హృదయం. తన మగవాడి కోసం ఆమె నిరంతరం తపిస్తుంది. కానీ అతడు నిర్దుష్టంగా, నీతిగా నడుచుకోవాలని ఆమెకు పట్టింపు లేదు.

ఆమె బతుకు బరువేమో అనిపించినా తనబతుకే బరువేమో అంతకంటే అంటారు రచయిత. స్త్రీ ప్రేమలో ఉండే ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకోలేని కష్టమా? ఆమె చేతిలో ఒక రూపాయ పెట్టి పడవ దిగి గబగబా వెళ్ళిపోతాడు.

ఈ కథలో రచయిత మొదలుపెట్టిన దగ్గర నుండి చెప్పిన వర్ణనలతో కూడిన అంశాలెన్నో కూడా స్త్రీ సంబంధితమవడం కాకతాళీయం కాదు.

గాలి చురుకుగా ఉందట మెత్తని స్త్రీ స్పర్శ లాగా. విశాలమైన స్త్రీత్వం ఆ రాత్రిలో నిండుగా అలంకరించుకుని వుందట.

రంగి, పద్దాలు పక్కనే పడుకున్న మనిషికి ఆ చీకటి కౌగిలిలో అనాది నుంచీ మగవాణ్ణి లాలించి పోషించిన స్త్రీత్వపు కథలు జ్ఞాపకమొచ్చాయిట.


పద్మరాజుగారు రాసే ప్రతి కథలోనూ ఒక విశేషమైన మానవ నైజాన్ని చూపించే ప్రత్యేకత కనిపిస్తుంది. 'గాలివాన' కథలో ఒక ముష్టి ఎత్తుకునే స్త్రీకున్న వ్యక్తిత్వాన్ని, ఒక శ్రోత్రీయత, బడుగు మనుషులంటే చులకన భావం కలిగి, తానొక నాగరీకుడననుకునే అహంకారాన్ని, పక్క పక్క నుంచో పెట్టి, విపత్కర పరిస్థితుల్లో కూడా తనకు ఊరట ఇచ్చిన ఆ ఆడమనిషి వ్యక్తిత్వం ముందు భేషజాలు, అహంకారాలు ఏ మూలకి అన్న భావం వ్యక్తీకరించబడింది. 'పడవ ప్రయాణం' లో కూడా మరో స్త్రీమూర్తి. తను ప్రేమించిన మనిషిలో దుర్మార్గత్వం చూడదు. తనను హింసిస్తున్నాడనీ పట్టించుకోదు.

అతడు తనను పెళ్ళి చేసుకోడు సరికదా, ఇంకో అమ్మాయితో ఉంటున్నాడని తెలిసినా ఆమెకక్కరలేదు. దొంగతనంలో అతనికి సాయం చేసి, వాడి బదులు తను దొరికిపోయి పోలీసులకు అప్పగించబడినా, ఆ దొంగ సరుకు ఆ రెండో అమ్మాయికి ఇస్తాడని తెలిసినా ఖాతరు లేదు. ఎప్పుడో ఒకప్పుడు తన దగ్గరకు వస్తాడని ధైర్యం. ఏం చూసుకుని? అలాంటి ప్రేమ ఒక్క స్త్రీకే చెల్లా?

సంభాషణాలలో నలిగే యాస ఎబ్బెట్టుగా అనిపించదు. కథ చదువుతూన్నంత కాలం, పాఠకుడు కూడా ఆ పడవ ప్రయాణం చేస్తున్న అనుభూతి కలుగుతుంది. ఆ పాత్రల్లో లీనమైపోతాం. పద్మరాజుగారు రాసిన కథలలో 'గాలివాన' ఒక ఎత్తైతే 'పడవ ప్రయాణం' మరో ఎత్తు!

***పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్***

# కథాపుస్తక పరిచయం




## మనిషి లోపలి నీడ

ఈ సంవత్సరం రావిశాస్త్రి అవార్డు గ్రహీత శ్రీ దాట్ల దేవదానం రాజు గారి 19 కథల సమాహారం. 30.07.2025 తేదీన విడుదలైన ఈ సంకలనం వెల రు. 180/-.

ప్రతులకు

ప్రముఖ పుస్తక షాపులలో,


bit.ly/chayabooks

## ఉడుకుబెల్లం

జగమెరిగిన చేయి తిరిగిన రచయిత శ్రీ చింతకింది శ్రీనివాసరావు గారి పది కథల సంకలనం. వెల రూ. 120/-.

ప్రతులు

అన్నీ పుస్తకాల షాపుల్లో దొరుకుతాయి.




## కూల్డబ్బులు

శ్రీ పట్నాల ఈశ్వరరావుగారి 18 కథలు, 3 సాహితి వ్యాసాలతో విడుదలైన ఈ సంకలనం వెల రూ.100/-.

ప్రతులకు

శ్రీ పట్నాల ఈశ్వరరావు,
ఇంటి నం. 111, ఫేజ్ –2,
కె. ఏ. పి. ఉడా కాలనీ,
**విజయనగరం – 535003**
✆ 9948845337







## నిజమైన స్నేహితులు

బాల కథల పుస్తకాలు బాగా కరువైపోతున్న రోజుల్లో, సుసర్ల సర్వేశ్వరశాస్త్రి గారి 15 బాలకథల సంకలనం రూ. 100/– వెలతో విడుదలైంది.

ప్రతులకు

విశాలాంధ్ర, ప్రజాశక్తి ఇతర పుస్తక విక్రేతలతో పాటు..

శ్రీ సుసర్ల సర్వేశ్వరశాస్త్రి ,
శ్రీ గణపతి నివాస, HIG –28, GF 2,
సెక్టార్ –1, ఎం.వి.పి. కాలనీ,
**విశాఖపట్నం**

# ఆర్ట్ ఆఫ్ లివింగ్

డా. ఎమ్. సుగుణరావు

**జన్మదిన సంచిక 'నేటి యువత' కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

***"నువ్వు ఎమ్.ఎ. చదువుకున్నావు, పైగా ఇంగ్లీషు లిటరేచర్. పెళ్ళయ్యేవరకూ సంగీత కచేరీలు చేసేదానివి. పెళ్ళవ్వగానే వీణను మూలన పడేశావు. వంటింటి కుందేలైపోయావ్. ఏమన్నా అంటే 'ఇవన్నీ నాన్నగారికి ఇష్టం లేదే. నాకు ప్రశాంతంగా సంసారం చేసుకోవడమే ఇష్టం' అనేదానివి. పిల్లల్ని పెంచి పెద్దచేయడంతోనే నీ జీవితమంతా గడిచిపోయింది. ఇప్పుడు నాన్నగారు రిటైర్ అయ్యారు. అయినా పట్టుమని పది నిమిషాలైనా ఆయన నీతో గడుపుతున్నారా?***

'దేవరాజ సేవ్య మోర్దని కీర్ణ లోచనే ఆ... ఆ...

భావ బీజ గణ్యవాహిని నిత్యనూతనే ఆ... ఆ...'

పాట లీలగా మనసుని తాకింది. మంచంమీద నుంచి దిగ్గున లేచింది.

'ఎక్కడనుంచీ ఈ గాంధర్వ గానం?' అనుకుంది అరుంధతి, ఇంకా వదలని నిద్రమత్తులో.

అప్పుడు గుర్తొచ్చింది. 'ఇంట్లోంచే ఆ వీణావాదనం, గానం!

రెండురోజుల క్రితం బెంగుళూరునుంచి వచ్చిన కూతురు ఇందువదన, ఇంటికి రాగానే స్టోర్‌రూమ్‌లో మూలన పడేసిన వీణను బయటకు తీసి, శుభ్రం చేసింది. వదులైన తీగల్ని సవరించింది. వీణసాధన మొదలుపెట్టింది.

ఎంతకాలం అయ్యింది ఇంట్లో వీణ మ్రోగి. మదిలోనే వీణ మ్రోగినట్టు అయ్యింది అనుకుంది.

చాలాకాలం తర్వాత పగలు ఎంత మత్తుగా పడుకుంది. ఆ నిద్రకు కారణం కూతురు వచ్చిన సంతోషం!

గోడ గడియారంలో అయిదు చూపిస్తోంది.




‘అయ్యో! ఆయనకు కాఫీ ఇవ్వాలి’ అనుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళింది. మూడుకప్పుల కాఫీ కలిపి, డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చింది.

అప్పటికే భర్త కేశవరావు, క్లబ్‌కి వెళ్ళడానికి తయారవుతున్నాడు.

కాఫీకప్పు అందుకుంటూ, ''నీ మెయిల్‌కి ఒక అబ్బాయి బయోడేటా, ఫొటోలు పంపాను. అతగాడికి బెంగుళూరులోనే ఉద్యోగం!'' అంటూ గబగబా కాఫీ తాగేసి, బయటకు నడిచాడు.

భర్త తనకెప్పుడూ ఒక రోబోలా కనిపిస్తాడు. కారు కదిలిన చప్పుడైంది.

అతడి ముప్పై ఐదేళ్ళ ఫార్మాకంపెనీ ఉద్యోగంలో తన ఆఫీసు, టూర్లు. ఇంతే... పెళ్ళిచూపుల్లో టై, టక్‌తో దర్శనమిస్తే, సినిమా హీరోలా ఉన్నాడనుకున్నారు, తనూ, తన తల్లిదండ్రులు! అయితే తర్వాత తన వైవాహిక జీవితంలో అతను జీరోగానే మిగిలాడు. పేరుకు భర్త, ఇద్దరు పిల్లలకు తండ్రి. అంతే!

అదంతా గతం. ఇహంలోకి వచ్చి కూతురు పాడుకుంటున్న గదిలోకి నడిచింది. కూతురు మెడ వెనుకనుంచి చేతులు వేసి ముద్దు పెట్టుకుంది.

పాట అయిపోయింది కాబోలు.

''చాలా హాయిగా ఉందమ్మా!'' అంది కూతురు, తల్లి మెడ చుట్టూ చేతులేసి.

''నాన్నగారు నీకో పెళ్ళిసంబంధం చూశారు. ఫోటోలు, బయోడేటా చూపిస్తాను'' అంది అరుంధతి.

తల్లి మాటలు విని, ఏ సమాధానమూ చెప్పకుండా వీణను గదిలో ఒక మూల జాగ్రత్తగా పెట్టి, తల్లి ప్రక్కగా వచ్చి కూర్చుంది.

అరుంధతి ఫొటోలూ, బయోడేటా కూతురుకి చూపిస్తోంది. చూపించిన తర్వాత ఆమె మొహంలోకి చూసింది. ఏ భావమూ లేదు.

''బాగున్నాడు కదా. పైగా మంచి జీతం...'' అంది అరుంధతి.

ఇందువదన ఏమీ సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయింది.

''ఏమిటి? ఏమీ మాట్లాడవు? నచ్చలేదా?'' అంది అరుంధతి రెట్టిస్తూ.

మళ్ళీ నిర్లిప్తంగా ఉండిపోయింది ఇందువదన.

''ఏమిటి ఎవరినైనా ప్రేమించావా?'' అంది అరుంధతి, కూతురి మొహంలోకి చూసి.

తల్లి మాటలకు, అవునన్నట్టుగా తల ఊపి, ''ఒకబ్బాయితో సంవత్సర కాలంగా రిలేషన్షిప్‌లో ఉంటున్నాను'' అంది.

ఆ మాటలకు అరుంధతి షాక్ తగిలినట్టుగా మొహంపెట్టి, ''రిలేషన్షిప్ ఏమిటి?'' అంది.

''అదే సహజీవనం.''

''అంటే?'' మళ్ళీ ప్రశ్నార్థకంగా మొహం పెట్టింది అరుంధతి.

"ఏమీ తెలియనట్లు మాట్లాడతావేంటమ్మా? ఈ కాలంలో మా మిలీనియల్ యూత్‌లో ఇలాంటి రిలేషన్‌షిప్‌లే ఎక్కువ."

''మిలీనియల్ ఏమిటి?'' అంది అరుంధతి.

''మేము మిలీనియల్స్! మీరు మిలీనియల్స్ కాదు కదా'' అంది ఇందువదన.

''అయితే మేం ఎవ్వరం?'' అంది అరుంధతి.

ఇందువదన చెప్పడం ప్రారంభించింది.

''1928 నుంచి 1945 వరకూ సైలెంట్ జనరేషన్. ఆ తర్వాత 1946 నుంచి 1964 వరకూ బేబీ బూమర్స్. 1965 నుంచి 1980 వరకూ జనరేషన్ ఎక్స్. మిలీనియల్స్ అంటే 1981 నుంచి 1996. జనరేషన్ జెడ్ 1997 నుంచి 2011. 2012 నుంచి నేటి వరకు జనరేషన్ ఆల్ఫా'' అంది.

''అయితే ఈ రిలేషన్‌షిప్, పార్టనర్‌షిప్ మీ మిలీనియల్స్ నుంచి మొదలైందా?'' అంది అరుంధతి.

''అవును.''

''ఇంతకీ ఏమైంది?''

''ఏమౌతుందీ... ఇద్దరం ఒకే ఆఫీసు. లంచ్ బ్రేక్‌లో, టీ బ్రేక్‌లో కబుర్లు. అప్పుడప్పుడు ఓ సినిమాకు, ఇంకా షాపింగ్‌కు... అయితే అతగాడు ఎప్పుడూ బెటర్ ఛాయిస్‌కోసం చూస్తూ ఉంటాడు.''

''అంటే?' అర్థం కాన్నట్టు చూసింది అరుంధతి.

''ఐఐటి ఖరగ్‌పూర్, ఐఐఎం అహమ్మదాబాద్‌లో చదివి ఆ తర్వాత విప్రోలో చేరాడు. ఆ తర్వాత మరింత ప్యాకేజీ వస్తుందని వేరే కంపెనీకి మారాడు. ఆ తర్వాత టీసీఎస్, దాని తర్వాత మా కంపెనీలో గ్రూప్ హెడ్.''

''అయితే ఇప్పుడు ప్యాకేజీ బాగుందన్నమాట'' అంది అరుంధతి.

''ఏమో! ఇంకో కంపెనీ మంచి ఆఫర్ ఇస్తే వెళ్ళిపోయే ఉద్దేశ్యం ఉన్నట్టుంది'' అంది ఇందువదన.

''మంచిదే కదా! మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఇంకేమిటి ప్రాబ్లం? వాళ్ళ పెద్దవాళ్ళు, మేమూ కూర్చుని మాట్లాడుకుంటాం'' అంది అరుంధతి.

''కంగారుపడకు, ముందు నేను చెప్పేది విను! అతనికి కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలున్నాయి. వాటినే పట్టుకుని వాదిస్తాడు. తన మాటే నెగ్గాలనుకునే రకం. అలా మా ఇద్దరి మధ్యా ఒక విషయంలో అభిప్రాయభేదం వచ్చింది.''

ఆ మాటలకు అరుంధతి ఆశ్చర్యంగా చూసి, "ఏ విషయం?'' అంది.

''డింక్" అంది ఇందువదన.

"అంటే?" మళ్ళీ ప్రశ్నార్థకంగా మొహం పెట్టింది అరుంధతి.

"డింక్ అంటే తెలియదా అమ్మా నీకు. ఈ మధ్యకాలంలో మా యూత్‌లో తరచుగా వినిపించే పదం. అంటే డబుల్ ఇన్‌కమ్, నో కిడ్స్.''

''అయ్యో! అంత సంపాదిస్తూ కూడా అదేమి ఆలోచన? బహుశా కొంత కాలమేమో! అతని మాటల్లో ఏమైనా పరమార్థముందేమో!'' అంది అరుంధతి.

''ఏమో... అసలు పిల్లలే వద్దు అంటున్నాడు.''

''ఆలూ లేదు, చూలు లేదు... కొడుకు పేరు సోమలింగం'' ఆ మాటలు చెప్పి చిన్నగా నవ్వింది అరుంధతి.

ఇందువదన కూడా తల్లి నవ్వుతో శ్రుతి కలిపింది.

అరుంధతి చెప్పడం మొదలెట్టింది.

''మా కాలంలో పిల్లలు పుట్టకపోతే... వ్రతాలు, నోములు చేసేవారు. గుళ్ళు చుట్టూ ప్రదక్షిణలు, స్వామీజీల్ని, బాబాలను దర్శించడం... ఆ తర్వాతి కాలంలో ఐవిఎఫ్, సంతాన సాఫల్య కేంద్రాల ద్వారా చుట్టూ తిరిగేవారు. మరిప్పుడు ఇదేమిటో ఈ డింక్?'' అంది అరుంధతి.

తల్లి మాటలకు సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయింది ఇందువదన.

''ఇంతకీ ఏమైంది మీ రిలేషన్?''

''బ్రేకప్ అయ్యేలా ఉంది. ఎందుకంటే అతగాడెప్పుడూ బెటర్ ఆప్షన్ కోసం వెళతాడని చెప్పాను కదా. అయితే ఓపెన్‌గానే ఉంటాడు. నాతో రిలేషన్షిప్‌కు రాక మునుపు ఇంకో అమ్మాయితో పరిచయం ఉండేదట. ఆవిడ పొడుగ్గా, సన్నగా ఉండేది.''

''మరైతే... ఆ అమ్మాయితో ఎందుకు బ్రేకప్ అయ్యాడు?'' అంది అరుంధతి, కూతురి మొహంలోకి పరిశీలనగా చూసి.

''తనే చెప్పాడు. తనది ఫొటోజెనిక్ ఫేస్ కాదట.''

''ఓహో... అలా కూడా ఆలోచిస్తాడన్నమాట అతగాడు. అయితే ఇద్దరూ కూర్చుని ప్రశాంతంగా మాట్లాడుకోవచ్చు కదా'' అంది అరుంధతి.

''ఒకదాని తర్వాత ఒకటి ఉద్యోగాలు మారుతున్నవాడు, రిలేషన్‌షిప్‌లో అమ్మాయిల్ని మారుస్తున్నవాడు, నాకన్నా మంచి అమ్మాయి ఎవరైనా తారసపడితే, మాది బ్రేకప్ అవుతుంది కదా. ఎందుకంటే, నువ్వు నాకు మెయిల్‌లో వచ్చిన అబ్బాయి ఫొటోలు, బయోడేటా చూపించావు కదా. ఆ ఫొటోలు ఎవరివో తెలుసా నీకు?'' అంది ఇందువదన.

''ఎవరివి?'' అంది ఆశ్చర్యంగా చూసి.

''ఇంత వరకూ నీతో ముచ్చటించిన, నేను బ్రేకప్ చేసుకోబోతున్న నా పార్ట్‌నర్‌వి.'' అంది క్లుప్తంగా.

''ఓహ్...'' అంటూ ఆశ్చర్యంగా చూసి, ''ఈరోజు ఉదయమే మ్యాట్రిమోనీలో ఆ ప్రపోజల్ వచ్చింది. అంటే నీకు బ్రేకప్ చెప్పబోయే అబ్బాయి, తనకు తెలియకుండానే మళ్ళీ తన బయోడేటాను పంపాడన్నమాట'' అంది అరుంధతి అయోమయంగా.

''అదీ విషయం. ఇప్పుడు నీకు అర్థమైంది కదా, నా బాధేంటో... అయితే ఇంకో ముఖ్య సంగతి నీకు చెబుదామని... మరి నువ్వూ, నాన్నా ఎప్పుడైనా కూర్చుని మాట్లాడుకున్నారా అమ్మా?'' అంది.

ఆ మాటలకు తలొంచుకుంది అరుంధతి.

''నువ్వు ఎమ్.ఎ. చదువుకున్నావు, పైగా ఇంగ్లీషు లిటరేచర్. పెళ్ళయ్యేవరకూ సంగీతకచేరీలు చేసేదానివి. పెళ్ళవ్వగానే వీణని మూలన పడేశావు. వంటింటి కుందేలైపోయావ్. ఏమన్నా అంటే 'ఇవన్నీ నాన్నగారికి ఇష్టం లేదే. నాకు ప్రశాంతంగా సంసారం చేసుకోవడమే ఇష్టం' అనేదానివి. పిల్లల్ని పెంచి పెద్దచేయడంతోనే నీ జీవితమంతా గడిచిపోయింది. ఇప్పుడు నాన్నగారు రిటైర్ అయ్యారు. అయినా పట్టుమని పది నిమిషాలైనా ఆయన నీతో గడుపుతున్నారా? చక్కగా సాయంకాలం పూట భర్తతో కూర్చుని ఒక కప్పు కాఫీ తాగుదామనే నీ చిన్ని కోరిక కూడా తీరదు. దాని గురించి ఆయన్నెప్పుడూ అడగవు. అలాంటి నువ్వు... నన్ను నా పార్టనర్‌తో కలిసి కూర్చుని మాట్లాడమంటున్నావ్. భలేదానివే!'' అంది ఇందువదన.

ఆ మాటలకు అరుంధతి, "గట్టిగా అరవకు, నాన్నగారు వచ్చారు. చాలాసేపైంది వచ్చి, బయట నుంచున్నారు.''

''లోపలకు రాకుండా, బయట నుంచుని ఏం చేస్తున్నారు?'' అంది మెల్లగా ఇందువదన.

''సిగరెట్ తాగుతున్నారు'' అంది అరుంధతి.

ఇందువదన మౌనం వహించింది.

ఇంతలో ఆమె సెల్‌ఫోన్‌లో ఏదో మెసేజ్ చూసి, "ఎవరో బాలస్వామిజీ... ఏదో చెప్తున్నాడు. విందామా?" అంది ఇందువదన.

అంతలో అరుంధతి భర్త మౌనంగా వచ్చి, వారి పక్కన సోఫాలో కూర్చున్నాడు.

సెల్‌ఫోన్‌లోని తనకొచ్చిన యూట్యూబ్ లింక్‌ని టీవీకి కనెక్ట్ చేసింది ఇందువదన.

తెరమీద పాతికేళ్ళ యువకుడు ప్రత్యక్షమయ్యాడు.

''అందరికీ నమస్కారం'' నవ్వుతూ చెప్పాడతను.

ఆ గదిలోని ఆ ముగ్గురి కళ్ళూ టీవీకి అతుక్కుపోయాయి.

''నేను ఈరోజు ఒక కాన్సెప్ట్ గురించి చెప్పబోతున్నాను. ఇది అందరికీ తెలిసిందే. దీని పేరు 'ఆర్ట్ ఆఫ్ లీవింగ్.' లివింగ్ కాదు, లివింగ్ కోసం లీవింగ్. ఏం వదిలేయాలి? ఎందుకు వదిలేయాలి? కాశీలో మనకిష్టమైన వాటిని వదిలేయమని చెబుతూ ఉంటారు. ఈ సందర్భంగా రామాయణంలో ఒక కథ చెప్పబోతున్నాను. ఒక అర్ధరాత్రి పూట వశిష్టులవారి ఆశ్రమానికి వెళ్ళిన రాముడు, తలుపు తట్టాడట. 'ఎవరు? ఏం కావాలి?' అని అడిగారట వశిష్టులవారు. 'నేనే స్వామీ!' అన్నాడట రాముడు. 'నేను అంటే?' వశిష్టుడు తిరిగి ప్రశ్నించాడట. 'అది తెలుసుకోవాలనే వచ్చాను గురువుగారూ' అన్నాడట రాముడు. 'ఎంత విదిలించుకున్నా, ఈ 'నేను' అనే అపరిచితుడు మనల్ని వదలడు. అలా వదిలేయడమే ఆర్ట్ ఆఫ్ లీవింగ్. అప్పుడు లైఫ్ ఈజ్ ఫర్ లివింగ్ అవుతుంది. లైఫ్ ఈజ్ ఫర్ నాట్ లీడింగ్. జీవితమంటే బ్రతకడం కాదు, బ్రతుకు వైయుక్తికం... జీవితం సార్వజనీనం... ఇదే ఆర్ట్ ఆఫ్ లీవింగ్.''

చెప్పడం ముగించిన తర్వాత, చెప్తున్న వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఆ ముగ్గురూ ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు.

ఎవరు దేన్ని వదలాలో, వారికి అర్థమైంది. ఆ ముగ్గురూ మాటాపలుకూ లేకుండా మౌనంగా ఉండిపోయారు.

ఆశ్చర్యానుభూతులతో వారి మనసు నిండిపోయింది.

ఇంతవరకూ ఉపన్యాసమిచ్చిన ఆ వ్యక్తి పాతికేళ్ళ కుర్రవాడు అయిన తమ ఇంటి కుటుంబసభ్యుడే!

ఇందువదనకు తమ్ముడు, అరుంధతి, కేశవరావుల కొడుకు.

ఇప్పటి యువత ఇలా కూడా ఆలోచిస్తుందా అనుకున్న ఆ వృద్ధతరం జంట, 'తన తర్వాత పుట్టిన జనరేషన్ జెడ్ తరంలో కూడా ఈ తాత్వికత, పరిపక్వత ఎలా వచ్చాయి?' అనుకుంటూ ముగ్గురూ విస్మయానికి లోనయ్యారు.

ఆ తర్వాత ఇందువదన ఆ గదిలోనుంచి లేచి, తను వీణ వాయించే గదిలోకి వచ్చి కూర్చుంది. వీణను తీసి వాయించడం మొదలుపెట్టింది.

ఆమె పక్కనే కూర్చున్న అరుంధతి కూడా ఆ వీణావాదనకి అనుగుణంగా పాడటం మొదలెట్టింది.

'భ్రమల మైకాన భ్రమణమే చేసి భ్రమరమౌతుంది కాలమే

అడుగు తడబడక నేర్చుకొను నడక దాటుకొస్తుంది గాలమే

వెలుగు జిలుగుల్లో వెలిగిపోలేక వెలికి వస్తుంది చీకటే

కలుసుకున్నంత కలిసిపోకంటూ మనకు చూపేను బాసటే

జారే జారే నెర్రాళ్లపై ప్రయాణమే జీవితం

పరాకనే తెర దాటితే జయం సదా.'

అలా పాడుతున్న అరుంధతి తన పక్కనే భర్త వచ్చి కూర్చోవడం చూసి ఆశ్చర్యపడింది.

ఆ ఆశ్చర్యంలో ఆనందం కూడా ఉంది.

# భేతాళ ప్రశ్న

సింహాద్రి నాగశిరీష
✆ 9866689326

**జన్మదిన సంచిక 'నేటి యువత' కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

***"కానీ అమ్మా! నిన్ను ఇలాంటి పరిస్థితుల్లో ఎలా ఒంటరిగా వదిలేసి వెళ్ళగలం?" బాధగా అడిగింది భువన.***

***"ఈ ఊరూ నాకు కొత్త కాదు. ఇక్కడి మనుషులూ కొత్త కాదు. ఎలాంటి గాయాన్నైనా మాన్పే శక్తి కాలానికి ఉంది. అలాగే నా ఒంట్లో ఇంకా ఓపిక ఉంది. నాకొచ్చిన ఇబ్బందేమీ లేదు. సెలవుల్లో ఎలాగూ వస్తుంటారుగా... కాబట్టి మీరు నా గురించిన దిగులు వదిలేసి, నిశ్చింతగా వెళ్ళి రండి!"***

ఎప్పుడూ మొబైల్ చేతిలో టకటకలాడిస్తూ... చుట్టూ సమాజంలో ఏం జరిగినా, జరుగుతున్నా మాకు సంబంధమే లేదని ఏమీ పట్టనట్టుగా... బంధాలకు, సంబంధాలకు అర్థాలు మార్చి, నిస్తేజమైన, అచేతనమైన జీవితాలు గడుపుతున్న బోలెడంతమంది మనుషులు... 'కాసేపు మొబైల్ పట్ల విసుగు కలిగో లేదా ఛార్జింగ్ అయిపోయో, లేదా మొబైల్ డేటా, వైఫై గడువు ముగిసిపోయో, మౌనంగా, విసుగ్గా, చిరాగ్గా... ఏమీ ఉబుసుపోక ఎవరైనా ఓ రచయిత అనే భేతాళుడు కాగితంపై, కాలంతో పరిగెడుతూ, కలం సాక్షిగా కథ చెబితే వినాలని ఆశపడ్డారు. అప్పుడు ఆ భేతాళుడు, వాళ్ళని చూసి జాలిపడి, సరేనని కథ చెప్పనారంభించాడు.

ఒకానొక ఊరిలో తల్లి, తండ్రి, కూతురు ఉన్నారు. తల్లిదండ్రులు ఆ బిడ్డకి చక్కని చదువులతో పాటు, సంస్కారాన్ని కూడా జత చేర్చి మరీ పెంచారు. బాగా చదివి ప్రయోజకురాలై, ఓ పెద్ద ఉద్యోగం చేస్తోంది ఆ అమ్మాయి. కూతురికి పెళ్ళిచేయాలని తల్లిదండ్రులు నిర్ణయించుకుని, అదే ప్రస్తావన ఓరోజు కూతురి ముందుకు తీసుకొచ్చారు. వారి ప్రస్తావనకు తన ఉద్దేశం చెప్పింది ఆ అమ్మాయి. ఇంతకీ ఆమె పేరు చెప్పనేలేదు కదూ. ఆ అమ్మాయే భువన.

"మీరొక్క ఫోన్ కాల్ చేస్తే, అన్నీ వదులుకుని మీముందు నిలబడేంత దూరంలో ఉండే అబ్బాయినే నేను పెళ్ళిచేసుకుంటాను. అలా కుదరని పక్షంలో నాకు అసలు పెళ్ళే వద్దు!" నిష్కర్షగా చెప్పింది భువన.

"అలాగని మడిగట్టుకు కూర్చుంటే ఎలా తల్లీ? అయినా ఇప్పుడు ప్రపంచమే ఓ కుగ్రామమై కూర్చుంది. ఎవరు, ఎక్కడ, ఎప్పుడు, ఎలా ఉంటారో తెలియదు. మరీ ఇలా కండిషన్లు పెట్టుకుంటూ పోతే ఎలా?" అన్నాడు తండ్రి రఘురామ్.

"అదంతా నాకు తెలియదు నాన్నా! ఇక ఈ టాపిక్ వదిలేద్దాం. నాకు ట్రైన్ టైమ్ అవుతోంది!" అంటూ సూట్‌కేస్ తెచ్చుకునేందుకు గదిలోకి నడిచింది భువన.

మొత్తానికి ఎలాగో పక్కూరిలోనే ఉంటున్న దూరపు బంధువుల అబ్బాయి వరుణ్‌ని చూసి, అన్ని విధాలుగా అనుకూలంగా ఉండటంతో ఆ సంబంధం ఖాయం చేసేసుకున్నారు.

భార్యాభర్తలిద్దరూ పట్నంలో ఉద్యోగస్థులు కావటంతో, ఎవరికి వీలైనప్పుడల్లా వాళ్ళు ఊరికి వస్తుండేవారు. చూస్తుండగానే రెండేళ్లు గడిచాయి. భువన గర్భం దాల్చింది. దాంతో ఆరునెలలు నిండగానే, స్వగ్రామానికి వచ్చేసింది. ప్రతీవారం క్రమం తప్పకుండా ఊరికి వచ్చేవాడు వరుణ్. ప్రసవానికి కావలసిన అన్ని ఏర్పాట్లూ ముందుగానే చేసేశారు. అనుకున్నట్టుగానే సుఖప్రసవమై, ఆరోగ్యంగా ఉన్న చిన్నారిపాపకి జన్మనిచ్చింది భువన. ఇంతలో అనుకోకుండా వరుణ్ ఆఫీసుపనిమీద ఓ సంవత్సరం పాటు విదేశం వెళ్ళవలసి వచ్చింది. దాంతో భువన ఉద్యోగానికి రిజైన్ చేసేసి, కొంతకాలం తల్లిదండ్రుల వద్దనే పాపను చూసుకుంటూ ఉండాలని నిర్ణయించుకుంది. సంవత్సరం ఆట్టే గడిచిపోయింది. కానీ, వరుణ్ మరో సంవత్సరం



పాటు ఫారిన్‌లోనే ఉండాలని యాజమాన్యం నిర్ణయించింది. ఖాళీగా ఉండే బదులు, పాపను అమ్మానాన్నల దగ్గరే ఉంచి, తను కూడా ఏదైనా ఒక కోర్సు చేయాలనే ఆలోచన వచ్చింది భువనకు. అదేమాట తండ్రితో చెబితే... అవకాశాలు మళ్ళీ మళ్ళీ రావనీ, మనవరాలి బాధ్యత తమదేనని, నిశ్చింతగా చదువుకోమని భరోసా ఇచ్చాడాయన. దాంతో అనుకున్నదే తడవుగా, అన్ని ఏర్పాట్లూ చేసుకుని విదేశాల్లో ఉన్న భర్త దగ్గరకు పయనమయింది భువన. కోర్సు పూర్తికాగానే, అక్కడివారు ఉద్యోగానికి అవకాశం ఇవ్వటంతో, పాపను కూడా తీసుకుని వెళ్ళిపోయారు ఇద్దరూ! పాపకు ఐదారేళ్లు వచ్చేవరకూ అక్కడే పనిచేసి, తిరిగి రావాలన్నది వారి ఆలోచన! అందుకే తోటివాళ్ళంతా ఇల్లు కొనుక్కున్నా వీళ్ళు మాత్రం ఆ ఆలోచన విరమించుకున్నారు. క్రమక్రమంగా అక్కడి స్కూళ్ళలో పిల్లలపట్ల చూపే శ్రద్ధ, నేర్పుతున్న అంశాలు వారిని బాగా ఆకర్షించాయి. అక్కడ ఒక్కసారి భాష, విజ్ఞానం తదితర అంశాలలో పునాది బాగా పడితే, పాపకు భవిష్యత్తు బాగుంటుందని అనిపించి, అక్కడే స్కూల్‌లో పాపను చేర్చారు. సంవత్సరంలో కనీసం రెండుసార్లు తల్లిదండ్రులను చూసేందుకు పాపను తీసుకువచ్చేవారు.

అంతా సవ్యంగా జరుగుతున్న సమయంలో, అనుకోకుండా రఘురామ్‌కి గుండెపోటు వచ్చింది. ఆసుపత్రికి తీసుకెళ్లారు. చాలా తీవ్రస్థాయిలో వచ్చిందని, బ్రతికే అవకాశం తక్కువ అని చెప్పారు డాక్టర్లు. విషయం తెలిసి భువన చాలా కంగారు పడిపోయింది. ఆఫీసులో లీవ్‌కి అప్లై చేసింది. కుదరకపోవటంతో రాజీనామాకు కూడా సిద్ధపడింది. చివరికి యాజమాన్యమే ఓ మెట్టు దిగింది కానీ, ఎలా ప్రయత్నించినా టికెట్స్ మాత్రం దొరకలేదు. పదిరోజుల వరకు టికెట్స్ దొరికే అవకాశమే లేదు. అంతే కాకుండా అక్కడ మంచుతుఫాను ఆరంభమయింది. ఇల్లువదిలి బయటికి రాలేని పరిస్థితి. దానికి తోడు విమానాలు నిలిపివేశారు. ఇక్కడ రఘురామ్ పరిస్థితి బాగా విషమించి, మరణించాడు. కానీ అక్కడ అడుగు కూడా కదల్చలేని పరిస్థితి! అంతలోనే ఈ ఉపద్రవం రావటం, భువనకు ఆఖరిచూపులు కూడా దక్కకపోవటం కళ్ళుమూసి తెరిచేలోపే, అంతా కలలా జరిగిపోయాయి. అన్నీ నెమ్మదించాక భువన స్వదేశానికి చేరుకుంది. కానీ, తానొకటి తలిస్తే, విధి మరోలా ఉంది అన్నట్లు అప్పటికే అంతా అయిపోయింది.

అన్నీ తెలిసినా కూడా, ఎక్కడో ఓ మూల, ఉన్న ఒక్క బిడ్డా కన్నతండ్రిని ఆఖరి చూపు చూడలేకపోయిందే అని తల్లి ఆవేదన. ఇంత విషాదంలో ఒక్కదాన్ని వదిలి వెళ్ళలేనని, కొంతకాలం తనతోపాటు వచ్చి ఉండమని, తర్వాత ఎలాగూ ఇక్కడికే వచ్చేస్తామని తల్లికి ఎంతగానో చెప్పి చూసింది భువన. ససేమిరా అని మొరాయించింది తల్లి. ఇప్పుడిప్పుడే పాప అన్నీ నేర్చుకుంటోంది, ఇంకొక్క ఆరునెలలు పోతే, ఏడాది గడిచిపోతుంది. ఆ తర్వాత ఏదో ఒక ప్రత్యామ్నాయం ఆలోచించవవచ్చని ఆమె ఆలోచన.

కానీ తల్లి మాత్రం ఊరు విడిచి రాననీ, తన గురించి భయపడవలసిన అవసరమే లేదనీ, కూతురికి నచ్చజెప్పింది. భువనకు ఏమీ పాలుపోక సందిగ్ధంలో పడింది.

ఇదంతా గమనించిన తల్లి, "చూడమ్మా! జరగాల్సిన నష్టం ఎలాగూ జరిగింది. దాన్ని పూడ్చలేము. కాబట్టి పసిదాని భవిష్యత్తు కోసం మీరు ఎలా ఆలోచన చేశారో అలాగే కానిద్దాం!" అంది దృఢంగా.

"కానీ అమ్మా! నిన్ను ఇలాంటి పరిస్థితుల్లో ఎలా ఒంటరిగా వదిలేసి వెళ్ళగలం?" బాధగా అడిగింది భువన.

"ఈ ఊరూ నాకు కొత్త కాదు. ఇక్కడి మనుషులూ కొత్త కాదు. ఎలాంటి గాయాన్నైనా మాన్పే శక్తి కాలానికి ఉంది. అలాగే

నా ఒంట్లో ఇంకా ఓపిక ఉంది. నాకొచ్చిన ఇబ్బందేమీ లేదు. సెలవుల్లో ఎలాగూ వస్తుంటారుగా... కాబట్టి మీరు నా గురించిన దిగులు వదిలేసి, నిశ్చింతగా వెళ్ళిరండి!" అంటూ నమ్మకంగా ధైర్యం చెప్పింది తల్లి.

తల్లి మాటల్లో ఉన్న ధైర్యం చూసి, భువనకు కూడా నమ్మకం కలిగింది. "అమ్మా! నీ మాట విని మేము వెళ్తాం. కానీ, ఏ చిన్న ఇబ్బంది కలిగినా నాకు వెంటనే తెలియజేయాలి. నాన్నకు మొదటిసారి స్ట్రోక్ వచ్చినపుడు మీరు నాకు మాటవరసకు కూడా చెప్పలేదు. మైల్డ్‌గానే కదా అని నిర్లక్ష్యం చేశారు. అటువంటి పొరపాటు, నీ ఆరోగ్యం విషయంలో చేయనని మాట ఇవ్వాలి!" అంది భువన.

"అలాగే" అంటూ నవ్వుతూ చెప్పింది తల్లి.

భువన వాళ్ళు తిరిగి వెళ్ళిపోతున్నారని తెలిసిన చుట్టుపక్కల వాళ్ళు బుగ్గలు నొక్కుకున్నారు.

'ఆఖరిచూపులే చూడలేదు. పెళ్ళికి ముందు మాత్రం అడ్డమైన షరతులూ పెట్టారు' అంటూ వెటకారంతో కూడిన మాటలు, చూపులతో కొందరు...

'అయినా... బిడ్డల్ని కనగలం కానీ, వాళ్ళ బుద్ధుల్ని కనలేముగా' అని మరికొందరి నిష్ఠూరాలు.

'ఆ తల్లీబిడ్డలకు లేని నొప్పి మనకెందుకూ?' అంటూ ఇంకొందరి వ్యాఖ్యానాలు.

ఇవన్నీ దాటుకుంటూ, భువన తల్లిపై నమ్మకంతో ప్రయాణమయింది. ఎంతో ధైర్యంగా వెళ్ళి రమ్మంటూ సంతోషంగా సాగనంపింది తల్లి.

సంవత్సరంలో తిరిగి వచ్చేయాలని భువన, వరుణ్ అనుకున్నారు. కానీ, భువన టాలెంట్, అంకిత భావం చూసి, ఆఫీసు యాజమాన్యం సంవత్సరం తిరక్కుండానే ప్రమోషన్ ప్రకటించింది. మరో రెండేళ్ళ పాటు అక్కడే ఉండేలా ప్రణాళిక మారిపోయింది. అంతలో పాప అక్కడి కళల్లో, క్రీడల్లో రాణించటం మొదలయ్యింది. తిరిగి వెళ్లాలా, వద్దా అనే సందిగ్ధత ఏర్పడింది. ఇంతలో మరోప్రాణి భూమి మీదకు రాబోతోందని భువనకు తెలిసింది. కొంతకాలానికి ఆ చిరుప్రాణి భూమి మీద అడుగుపెట్టింది. ఒకరికి విదేశంలో చక్కని పునాది వేసి, తిరిగి స్వదేశం వెళితే, రెండవ వారిని నిర్లక్ష్యం చేసినట్టు అవుతుందనే అనుమానంతో, బాబుకు ఆరేళ్లు వచ్చేదాకా అక్కడే ఆగిపోవాలనే నిర్ణయానికి వచ్చారు.

"ఇదీ కథ. పాఠక విక్రమార్కులారా! కథ సంపూర్ణంగా విన్నారుగా... ఇప్పుడు చెప్పండి. ఈ అంతులేని కథలో తనకు తెలియకుండానే కుటుంబ చట్రంలో ఇరుక్కుపోయి, ఓ వైపు తల్లి, మరో వైపు బిడ్డలున్న తరాజులో ఓ పక్కకు ఒరిగిపోయిన భువనది తప్పా? కూతురి ఇష్టాన్ని గౌరవించిన భువన తండ్రిది తప్పా? వరుణ్‌ని పని నిమిత్తం విదేశానికి పంపిన ఆఫీసు యాజమాన్యానిది తప్పా? భువనకు ధైర్యం చెప్పి సాగనంపిన ఆమె తల్లిది తప్పా? యథావిధిగా ఎదుటివారిలో లొసుగులు ఎప్పుడూ వెతుకుతూపోయే బంధువులది తప్పా? లేక విలువలకే విలువ లేకుండా చేసి, భ్రష్టుపట్టిన, కుళ్ళిపోయిన ఆలోచనలతో, అభివృద్ధి పేరుతో తిరోగమనాన్ని అందిపుచ్చుకున్న మనుషులున్న మొత్తం వ్యవస్థదే తప్పా?

ఈ కథారచన చేసిన భేతాళుడు అడిగిన ప్రశ్నకి సరైన సమాధానం తెలిసి కూడా... మౌనం వీడి పాఠక విక్రమార్కులు సమాధానం చెప్పకపోయారో...

# జీవనవేదం

లక్ష్మీ గాయత్రి
✆ 6302555947

**జన్మదిన సంచిక ‘నేటి యువత’ కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

*దొరికిన దాంతో తృప్తిపడేవాడి జీవితం పువ్వులా ఉంటుంది. ఎంత సాధించినా అసంతృప్తితో వేగిపోయేవాడు... కొత్తదారులు వెతుక్కుంటూనే ఉంటాడు. ఆ దారుల్లో ముళ్లపొదలు రక్కుతూనే ఉంటాయి! ‘ఉన్న దాంతో తృప్తిపడుతూ బతకాలి’ అన్న మాట... తల్లిదండ్రులు పిల్లలకి నేర్పాలి. కాని వాళ్లే అసంతృప్తితో వేగిపోతూ ఉంటే, పిల్లలకి మంచీ చెడూ ఎలా తెలుస్తాయి చెప్పు! ఈనాటి యువతరం అసంతృప్తితో రకరకాల సమస్యల్ని కొని తెచ్చుకుంటోందంటే చాలావరకూ తల్లిదండ్రులే అందుకు కారణం!*

“నాన్నా... రమేష్ నిన్న పొద్దున్ననగా బైటికి వెళ్లి ఇప్పటిదాకా ఇంటికి రాలేదుట. తమ్ముడు బెంగపడుతూ ఫోన్ చేశాడు!” డెబ్బై ఏళ్ల తండ్రి కంగారు పడతాడని, సాధ్యమైనంత నెమ్మదిగా విషయం చెప్పాడు శ్రీపతి.

అయినా కంగారు పడనే పడ్డాడు దశరథరామయ్య. “నిన్న పొద్దున్న వెళ్లినవాడు ఇప్పటికీ రాలేదా? ఎక్కడికి పోయాడ్రా పిచ్చివెధవ? వాణ్ణసలు బతకనివ్వట్లేదురా వాళ్లు... ఇరవై నాలుగ్గంటలూ తిట్టడమే. చచ్చిపోదామని పోయాడో ఏవిటో!” ఇంచుమించు కళ్లనీళ్ల పర్యంతమవుతూ అన్నాడు.

“మొన్న రాత్రి పెద్ద గొడవైందట! మొన్నటి దాకా రమేష్ వాళ్ల కాలేజీలో క్యాంపస్ సెలక్షన్లు జరిగాయి. వాడు నాలుగైదు ఇంటర్వ్యూలకి వెళ్లాడు గాని దేంట్లోనూ సెలక్టవలేదు. వాళ్ల పక్కింట్లోనే ఉండే వినయ్‌కి ఆరు లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చేసిందిట. దాంతో, ‘వినయ్‌ని చూసి సిగ్గు తెచ్చుకో’ అని వాళ్లమ్మా... ‘అసలెందుకు పనికొస్తావురా నువ్వూ?’ అని తమ్ముడూ వాణ్ణి తిట్టారుట. అసలెప్పుడూ ఏ తిట్లూ పట్టించుకోనివాడు మొన్న రాత్రి మాత్రం ఇట్టే రెచ్చిపోయాట్ట. ఎందుకూ పనికిరాకపోతే ఉరేసుకు ఛస్తానన్నాట్ట. నాకు తిండి పెట్టలేకపోతే చెప్పండి ఇంట్లోంచి పోతానని ఎగిరాట్ట. రాత్రి పదకొండు దాకా ఒకళ్లనొకళ్లు తిట్టుకుని పడుకున్నారట. తెల్లారి మామూలుగానే లేచి కాఫీ తాగాడట. వెంటనే బట్టలేసుకుని బైటికి వెళుతూంటే, ‘ఇంత పొద్దున్నే ఏ రాచకార్యం వెలగబెట్టాలి?’ అని తమ్ముడు తిట్టాడుట. దానికి జవాబు చెప్పకుండా నిశ్శబ్దంగా బైటికి వెళ్లిపోయిన కుర్రాడు ఇప్పటిదాకా ఇంటికి రాలేదు. రాత్రి దాకా చూసి ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి అడిగితే, అందరూ మా దగ్గరకి రాలేదని చెప్పేశారట. ఏ రాత్రికైనా వస్తాడేమోనని చూసి చూసి, ఇప్పుడే నాకు ఫోన్ చేశాడు!”



అంటూ ఒక్క క్షణం ఆగి, “నాన్నా, రమేష్‌కి నీ దగ్గర చనువెక్కువ. నువ్వంటే వాడికి చాలా ఇష్టం. అంచేత ఇక్కడికి వస్తాడేమోనని తమ్ముడి ఆశ!” అన్నాడు

ఆ మాటకి దశరథరామయ్య కళ్లల్లోకి నీళ్లు వచ్చేశాయి. “వెర్రికుంక... వాడు రావాలే గాని కడుపులో పెట్టుకోనుట్రా! వాడికి మొదటినుంచీ ఆ ఇంజనీరింగు చదువులు ఇష్టంలేదు. నాలాగ వ్యవసాయం చేస్తాననేవాడు. ఉన్న ఒక్క బిడ్డనీ గొప్ప ఇంజనీరుగా చూడాలని వాళ్ల నాన్న పంతం. తన అశక్తతకీ పెద్దవాళ్ల ఒత్తిడికీ మధ్య వాడు నలిగిపోయాడ్రా...” దశరథరామయ్య మాట్లాడుతూ ఉండగానే, ఆయన సెల్ మోగింది. చూస్తే రమేష్!

గబుక్కున ఫోన్ లిఫ్ట్ చేశాడు పెద్దాయన. “ఒరే నాయనా, ఎక్కడున్నావురా?” అని అడుగుతూంటే ఆయన గొంతులో దుఃఖం సుడి తిరిగింది.

“ఏడుస్తున్నావా? నాకు తెలుసు తాతా, నువ్వొక్కడివే నాకోసం నిజంగా ఏడుస్తావు. అందుకే నీకే ఫోన్ చేశాను. నేనెక్కడున్నానో మాత్రం చెప్పను. నువ్వు మా నాన్నకి చెప్తావు. వాళ్లు పరిగెత్తుకుంటూ వచ్చి తీసుకుపోతారు. నేనంటే పంచప్రాణాలు గదా పాపం...'' రమేష్ గొంతులో వెటకారం పెద్దాయనకి స్పష్టంగా తెలిసింది. ఆయన సందేహించలేదు. ''ఒరేయ్, నీకు నిజంగా నా మీద నమ్మకం ఉంటే వెంటనే నా దగ్గరకి రా! నువ్వు నా దగ్గరున్నట్టు మీ నాన్నకి తెలిసినా మరేమీ ఫర్వాలేదు. నిన్ను నా దగ్గర్నుంచి ఎవ్వరూ తీసుకువెళ్లలేరు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు!'' అన్నాడు.

“నువ్వు సరే తాతా, కాని పెదనాన్న ఊరుకోవద్దూ...”

“పెదనాన్నని కూడా కల్పించుకోనివ్వను! నాదీ పూచీ! వెంటనే రా!”

“సరే... వస్తున్నా!” రమేష్ ఫోన్ పెట్టేసిన పదినిమిషాల్లో దశరథరామయ్య ఎదుట నిలబడ్డాడు.

”ఈ వీధి మొదట్లోంచే ఫోన్ చేశాను తాతా...” అని నవ్వుతూ తాతను అల్లుకుపోయాడు.

మనవడి నవ్వులో జీవం లేదని గమనించిన తాత మనసు ద్రవించిపోయింది. ఆప్యాయంగా మనవణ్ణి గుండెకు హత్తుకుంటూ, “ఓరి పిచ్చినాగన్నా, అమ్మానాన్నలన్నాక తిడతారు... పెద్దవాళ్ల చీవాట్లు దీవెనలతో సమానం! వాళ్ల తిట్లు నీకు కొత్త కూడా కాదు. ఎప్పుడూ పట్టించుకోనివాడివి ఇప్పుడెందుకిలా వెర్రెత్తిపోయావు?” అంటూ ప్రశ్నించాడు.

“బాగా అడిగావు తాతా... రా చెప్తా...'' అంటూ తాత చెయ్యి పట్టుకుని లోపలి గదిలోకి లాక్కెళ్లాడు రమేష్. తలుపులు గడియ వేసేసి, తాతని మంచం మీద కూర్చోబెట్టి, తను పక్కనే కూర్చున్నాడు.

“నీకు మొత్తం అంతా చెప్తా తాతా. నాకింకెవ్వరూ లేరు చెప్పుకోడానికి! నువ్వు మాత్రం ఎవ్వరికీ చెప్పకూడదు!'' అన్నాడు.

“చెప్పన్రా... నా గుండెల్లోనే దాచుకుంటా!” దశరథరామయ్య ఛాతీ మీద చెయ్యి వేసుకున్నాడు.

“సరే, విను. నాకు చిన్నప్పటినుంచీ చదువంటే విసుగే కదా. ఎలాగో అత్తెసరు మార్కుల్తో పాసవుతున్నా. మంచిమార్కులు తెచ్చుకోవడం లేదని అమ్మా నాన్నా రోజూ తిట్లే! ఆఖరికి నా పుట్టినరోజునాడు కూడా ‘ఈవేళ నీ పుట్టినరోజురా నాన్నా!’ అని నన్ను పట్టుకుని వలవలా ఏడ్చెయ్యడం... ‘బాగా చదువుకోరా అంటే వినవు’ అని ఓ పుటుకుమాట జోడించడం. చదువు బుర్రకెక్కితే ప్రతివాడూ చదువుకుంటాడు తాతా. చదవడం లేదూ అంటే వాడికి చేతగావడం లేదన్నమాట. చదువురాని ప్రతివాడూ పనికిమాలినవాడేనా?”

దశరథరామయ్య మాట్లాడలేదు. మౌనంగా మనవడి బుగ్గ తట్టాడు.

“సరే... ఇంట్లోవాళ్ల సంగతి వదిలెయ్యి. బిటెక్ సెకెండియర్‌లో ఫ్రెండయింది లీల! మూడేళ్లపాటు కలిసున్నాం. లవ్ అన్నమాట. తనూ నాలాంటి అత్తెసరు పార్టీయే! వాళ్ల నాన్న తిడితే నాతో చెప్పేది, మా నాన్న తిడితే నేను తనతో చెప్పేవాణ్ణి. ఇంకెంతకాలం... క్యాంపస్‌లో ఎంత తక్కువ ప్యాకేజీకైనా సరే ఓ ఉద్యోగం తెచ్చుకుని, చిలకాగోరింకల్లా హైదరాబాద్ ఎగిరిపోదామని ప్లానేసుకున్నాం. నా ఇంటర్వ్యూలన్నీ పోయాయి. తను భలే మాటకారి తాతా... ఎలా మాట్లాడిందో, ఏం జవాబులు చెప్పిందో... నాలుగున్నర లక్షల ప్యాకేజీ మీద ఉద్యోగం తెచ్చేసుకుంది. నాకూ ఏదైనా వస్తుందని నిన్నటిదాకా చూసింది. నిన్ననే ఆఖరికంపెనీ వాళ్లు కూడా వెళ్లిపోయారు. మరింక ఏ ఆశా లేదు. అంతే... నాకు గుడ్‌బై చెప్పేసి, ఆరు లక్షల ప్యాకేజీ తెచ్చుకున్న వినయ్‌తో చెట్టాపట్టాలేసుకుని వెళ్లిపోయింది. నేను వెంటబడితే ఏమందో తెలుసా? ‘ఎందుకు పనికొస్తావురా నువ్వూ... కనీసం నెలకి ఇరవై వేల ఉద్యోగం కూడా సంపాదించలేకపోయావు! ఇంక నీ బతుక్కి పెళ్లేమిటి... ఏం పెట్టి పెళ్లాన్ని పోషిస్తావ్? నీ ఖర్మ.. ఎలా అఘోరిస్తావో అఘోరించు! నీకోసం నా బతుకు బలి పెట్టుకునేంత త్యాగమూర్తిని కాను. వినయ్, నేనూ కలిస్తే నెలకి ఈజీగా లక్ష పైబడి తెచ్చుకుంటాం. హాయిగా బతుకుతాం! గుడ్‌బై!’ అనేసి వెళ్లిపోయింది!” ఆ మాటలు చెబుతూ తన కళ్లలో తిరిగిన నీళ్లని గట్టిగా తుడిచేసుకున్నాడు రమేష్.

"ప్రేమించిన పిల్ల చేత ఛీ కొట్టించుకుని, ఫ్రెండ్సంతా జాలి చూపులు చూస్తుంటే భరించలేక, ఊరంతా తిరిగి మట్టికొట్టుకుపోయి ఇంటికొచ్చాను తాతా! రాగానే స్నానం చేసి, కాస్త తేలికపడ్డాను. అంతా మర్చిపోయి నా బతుకు నేను బతకాలని నిశ్చయించుకున్నాను. వేడిగా కాఫీ తాగాలనిపించింది. 'అమ్మా! ఓ కప్పు కాఫీ ఇస్తావా?' అన్నానంతే. ఇద్దరూ మొదలెట్టారు. ఊరంతా బలాదూరు తిరిగి ఇంటికొచ్చి కాఫీ... టిఫిన్ అని హోటల్లో మాదిరి ఆర్డర్లిస్తానట. నన్ను కన్న పాపానికి వాళ్లు నాకవన్నీ సప్లై చేస్తున్నారట. ఇంకా ఏవేవో అన్నారు. అంతే... నాకు ఒళ్లు మండిపోయింది. పరాయిపిల్ల ఛీ అందంటే ఏమో... అన్నా అక్కా ఆదరించలేదంటే కూడా ఏమో... కాని స్వయానా అమ్మానాన్నా అలా తీసి పారేస్తుంటే, భరించలేకపోయాను తాతా! బాగా చదువుకుని గొప్పగా ఉంటేనే గౌరవిస్తారా? నాకు చదువు రాకపోతే అది నా తప్పా? ప్రేమించిన పిల్లా తిట్టి, కన్నవాళ్లూ తిట్టి.. ఇంక నన్ను ప్రేమగా చూసుకునేదెవరు తాతా? నీలా ఆప్యాయంగా మాట్లాడేదెవరూ?"

దశరథరామయ్యకి నోట మాట రాలేదు. ఇది కేవలం తన మనవడి ఆక్రోశం కాదు... బతుకు వైకుంఠపాళీలో నిచ్చెన మెట్లు ఎక్కలేని సగటు కుర్రవాళ్ల హృదయఘోష!

మనవడికి తన జవాబు నోటితో చెప్పలేదాయన. చేత్తో చేసి చూపించాడు. రమేష్ వచ్చిన గంటలోనే చిన్నకొడుక్కి ఫోన్ చేసి, మనవడు తన దగ్గర క్షేమంగా ఉన్నాడనీ, వాడికోసం ఎవరూ రావడానికి వీల్లేదనీ, ఇకనుంచి వాడి బాధ్యతంతా తనదేననీ ఖచ్చితంగా చెప్పేశాడు. అయినా లక్ష్మీపతి వినలేదు. తక్షణం భార్యతో సహా పరిగెత్తుకు వచ్చేశాడు.

"నువ్వు వాణ్ణి వెనకేసుకు రాకు నాన్నా. మాకున్నది ఒక్క బిడ్డ. వాడు గొప్పగా ఉండాలని కోరుకోవడం తప్పా? వేలకివేలు వాడి కోసం ఖర్చుపెడుతున్నవాళ్లం... నాలుగు తిట్లు తిట్టినంతమాత్రాన శత్రువులమైపోయామా?" ఆవేశంగా అన్నాడు లక్ష్మీపతి.

"ఒరేయ్ నాయనా... నాకిద్దరు బిడ్డలు. ఇద్దరూ నాతో బాటు మట్టిలోకి దిగుతారనుకున్నాను. 'అలా పనికిరాదు వాళ్లని చదివించండి' అంది మీ అమ్మ... సరేనని స్కూలుకి పంపించాను. పెద్దోడికి చదువు రాలేదు. 'నాన్నా! పుస్తకం నాకొద్దు, మట్టి పిసుకుతా' అన్నాడు. 'నీ ఇష్టంరా అబ్బాయ్!' అన్నాను. నువ్వు బాగా చదువుకున్నావు... 'నాకు మట్టిబతుకొద్దు, పట్నంలో బంగారపు కాసులు సంపాదించుకుంటా' అన్నావు... 'మంచిదయ్యా' అన్నాను! పాండవులు వనవాసంలో ఉన్నప్పుడు వాళ్లు భిక్షాటన చేసి తెచ్చినదాన్ని కుంతి, రెండు భాగాలు చేసి, ఒక భాగం మొత్తం భీముడికి పెట్టేదట. రెండోభాగాన్ని మళ్లీ ఐదు భాగాలు చేసి తనకీ మిగిలిన నలుగురికీ పంచేదట. కన్నంత మాత్రాన సరిపోదురా, ఏ బిడ్డని ఎలా చూడాలో, ఎలా పెంచాలో తెలిసినవాళ్లే సిసలైన తల్లిదండ్రులు! మంచిచెడ్డలు ఆలోచించే వివేకాన్నిచ్చి మనల్ని స్వేచ్ఛగా ఈ భూమ్మీద వదిలేశాడా పరమాత్ముడు. మనం కూడా బిడ్డకి ఆ స్వేచ్ఛ ఇచ్చి, తన అభీష్టం మేరకు ఎదగనిచ్చినప్పుడే బిడ్డ బాగా ఎదుగుతాడు. మంచిచెడ్డలు నేర్పడం వరకే తల్లిదండ్రుల వంతు. అలాగాకుండా మీ కోరికలు తీరడం లేదని వాళ్లని నానా దుర్భాషలూ ఆడుతూ ఉంటే వాళ్లకి బతుకు మీదే ఆశ చచ్చిపోతుంది. పిల్లల్ని స్వేచ్ఛగా ఆనందంగా బతకనివ్వండ్రా నాయనా! వాళ్లకి బతుకు మీద ఆశ కల్పించండి. పెద్ద పెద్ద కార్లూ, భవనాల్లోనే లేదు బతుకు... సామాన్యమైన జీవితంలో కూడా ఉంది. ఆ సంగతి ముందు మీరు తెలుసుకోండి!"

తండ్రి మాటలకి లక్ష్మీపతి నోరెత్తలేకపోయాడు. మొత్తానికి రమేష్ భవిష్యత్తు తాత దగ్గర పునాది వేసుకుంది. తమ పొలం జోలికి వెళ్లకుండా వేరేగా రెండెకరాలు కౌలుకి తీసుకుని మనవడికి అప్పజెప్పాడు దశరథరామయ్య. వ్యవసాయంలో

ఉండే లోతుపాతులన్నీ స్వయంగా వివరించాడు. ఆధునిక వ్యవసాయపద్ధతుల్ని నేర్చుకోమన్నాడు. ఆడుతూ పాడుతూ పనిచేసుకుంటూ, తనకున్న కంప్యూటర్ విజ్ఞానాన్ని వ్యవసాయానికి ఉపయోగించుకుంటూ ఇట్టే ఎదిగొచ్చాడు రమేష్. నాలుగేళ్లు తిరిగేసరికి తల్లికి ఒక జత బంగారుగాజులు చేయించి తీసుకువెళ్లి ఇచ్చాడు.

“అమ్మా, తాత స్నేహితుడు రాజయ్య మనవరాలు మహాలక్ష్మి నాకు నచ్చింది. వాళ్లది చాలా మంచి కుటుంబమని తాత చెప్పాడు. నువ్వూ నాన్నా వచ్చి ఒకసారి తనని చూస్తే నిశ్చితార్థం చేసుకోవచ్చునని మీకు చెప్పమన్నాడు!''

నిబ్బరంగా చెబుతున్న కొడుకు మాటలు విని ఆశ్చర్యపోయారు లక్ష్మీపతీ, భార్యా. నాలుగేళ్ల కిందటి పలాయనవాదం ఇప్పుడు రమేష్‌లో లేదు. అతని మాటల్లో ఆత్మవిశ్వాసం, నిబ్బరం ఉట్టిపడుతున్నాయి. జీవితాన్ని పరిపూర్ణంగా ఆస్వాదిస్తున్న తృప్తి కళ్లల్లో మెరుస్తోంది.

పల్లెకి తిరిగొచ్చిన రమేష్, మళ్లీ తాతని గదిలోకి లాక్కెళ్లి రహస్యంగా చెప్పాడు. “ఫ్రెండ్స్‌ని కలిశాను తాతా! ఒక చేదువార్త తెలిసింది. లీల వినయ్‌ని పెళ్లి చేసుకుందని చెప్పాను గదా... వినయ్‌కి మరింత హెచ్చు ప్యాకేజీతో కొత్త ఉద్యోగం వచ్చిందట. దాంతో బాటు కొత్త స్నేహాలు కూడా కలిశాయట. నిత్యం గొడవలేనట. లీల ఒకసారి ఆత్మహత్యకి కూడా ప్రయత్నించిందట. చివరికి ఇద్దరూ డైవోర్స్ తీసుకున్నారట! ఏంటి తాతా ఇదంతా!”

“అసంతృప్తిరా బాబూ... దొరికిన దాంతో తృప్తిపడేవాడి జీవితం పువ్వులా ఉంటుంది. ఎంత సాధించినా అసంతృప్తితో వేగిపోయేవాడు కొత్తదారులు వెతుక్కుంటూనే ఉంటాడు. ఆ దారుల్లో ముళ్లపొదలు రక్కుతూనే ఉంటాయి! ‘ఉన్నదాంతో తృప్తిపడుతూ బతకాలి!’ అన్న మాట... తల్లిదండ్రులు పిల్లలకి నేర్పాలి. కాని వాళ్లే అసంతృప్తితో వేగిపోతూ ఉంటే, మరి పిల్లలకి మంచీచెడూ ఎలా తెలుస్తాయి చెప్పు! ఈనాటి యువతరం అసంతృప్తితో రకరకాల సమస్యల్ని కొని తెచ్చుకుంటోందంటే చాలావరకూ తల్లిదండ్రులే అందుకు కారణం!”

దశరథరామయ్య మాటల్లో జీవనవేదం ధ్వనించింది రమేష్‌కి. “నేను నీ మనవణ్ణి కావడం నా అదృష్టం తాతా!” అంటూ ఆ వృద్ధుణ్ణి మనసారా కౌగలించుకున్నాడు!

# జీవితం నిత్యనూతనం

రాజా మోహన్ ఇవటూరి
✆ 9866100175

**జన్మదిన సంచిక 'నేటి యువత' కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> ***ప్రతివారం ఒకసారి మాచేత గిన్నెలు కడిగించి ఉంటే, నీ మాటలు ఇంకా బాగా అర్థమయ్యేవి. మీ స్వంత పనిలా... అయిదు నిముషాల ముందే బడిలో దింపే బదులు, మమ్మల్నే తయారవ్వమని మాకు వదిలేస్తే ఇతరుల సమయం పైన గౌరవం కలిగి ఉండేది. చిన్నప్పుడంతా మీరే మా పనులన్నీ చేసేసి, చదువు తప్ప వేరే లోకం లేదని మా బుర్రల్లో ఊదేసి, తర్వాత మారమంటే అనుభవం లేకుండా ఎలా మారతాం?"***

"మళ్ళీ తిన్న కంచాలు ఇక్కడే వదిలేసావు సునీల్! చూడు మిగిలిపోయిన కూరలు, ఆవకాయ పిండి గట్టి పడిపోయి కంచాలకి అతుక్కుపోయాయి. చెంచాలు కూడా ఆరిపోయిన అన్నం, నెయ్యి కలిసి వేరే రంగుకి వచ్చేసాయి. తిన్న వెంటనే పళ్ళాలు నీళ్లతో తడిపి, తూములో పెట్టమని ఎన్ని సార్లు చెప్పాలా!" అన్నాను బాధతో.

కంప్యూటర్లో దీక్షగా పనిచేస్తున్న సునీల్ పని ఆపి, కరుకైన చూపుతో పళ్ళాలని, గ్లాసులనీ తీసుకువెళ్లి సింకులో పడేసి వచ్చాడు.

"తిన్నాక వెంటనే సింకులో వేసే ముందు ఒకసారి అంట్లని నీళ్లతో తొలిచేస్తే కడగటం ఎంతో సులువుగా ఉంటుంది. ఇప్పుడు ఈ అట్లు కట్టేసిన గిన్నెలని కడగాలంటే ఎంత కష్టమో తెలుసా?"

"నాన్నా! నువ్వే కదా చెప్పావు, చదువు మీద తప్ప ఇంకెక్కడా దృష్టి పెట్టద్దని?" అన్నాడు సునీల్.

నేను ఉలిక్కిపడి, "నేను నీకు చెప్పిన సందర్భం వేరు. మన కుటుంబాలకి బతుకుతెరువు కోసం చదువు చాలా ముఖ్యం. కానీ చదువుతో పాటు, ప్రవర్తన కూడా ముఖ్యం!" అన్నాను.

"ప్రవర్తన సంగతి తర్వాత చూసుకుంటా. వాళ్ళు ఆ పని చేసినందుకే కదా జీతాలిస్తున్నావు? ఇప్పుడు పనిమనిషి కోసం, బట్టలు ఉతికే వాళ్ళ కోసం, డ్రైవర్లకోసం నన్ను విసిగించకండి" అని చెప్పి పనిలో మునిగిపోయాడు సునీల్.



నిరాశతో నిట్టూర్చాను. అమీర్ ఖాన్ సినిమా చూసినప్పటి నుంచి, ఊరికే కోపం తెచ్చుకోకుండా కొడుకుని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాను. కానీ ఈ ప్రవర్తన నాకు కొరుకుడు పడటంలేదు.

ఇంతలోనే బైట నుంచి హార్న్ వినపడింది. వాడిమిత్రుడు బండిమీద వాడికోసం ఎదురుచూస్తున్నాడు. వెంటనే లోపలకి వెళ్ళి, అతను వచ్చిన విషయం చెప్పాను. సునీల్ విన్నాడు. కానీ కంప్యూటర్లోనే పని చేస్తూ నా వైపు చూడలేదు.

'చెప్పాను కదా' అని నేను నా గదిలోకి వెళ్లాను. మరో అయిదు నిముషాల తర్వాత మళ్ళీ హార్న్ మోగింది. ఇక చికాకెత్తి, "నువ్వు ఒక్కడివీ చేసుకునే పని ఎంతైనా ఆలస్యం చేసుకో. వేరే వారు ఎదురు చూస్తున్నపుడు ఇలా నిర్లక్ష్యం చెయ్యటం తప్పు!" అన్నాను.

సునీల్ విసురుగా కంప్యూటర్ మూసేసి "నేను ఎంత ముఖ్యమైన పని చేస్తున్నానో తెలుసా? ఇప్పటివరకూ ఎవ్వరూ సాధించని ప్రాజెక్ట్ పూర్తిచేద్దామని తలమునకలవుతుంటే మీకు ఆ విషయం పట్టదు. ఆ కోన్ కిస్కా గాడి టైమే మీకు ముఖ్యం!" అని లేచి వెళ్ళాడు.

అంత ముఖ్యమైన పని కాలేజీకి వెళ్లే ముందే ఎందుకు చెయ్యాలి అనబోయి ఊరుకున్నాను.

"అయిదు నిముషాలు లేటైతే ఎందుకురా గింజుకుపోతావు? నీ మూలాన అడ్డమైన నీతులూ వినవలసి వచ్చింది!" అని స్నేహితుడిని కసురుకోవటం వినపడింది.

"నేను వచ్చానని, నీకు తెలుసో లేదో కూడా అర్థం కాక హార్న్ కొట్టానురా" అని మిత్రుడు సంజాయిషీ చెప్తున్నాడు.

ఈలోపలే, "వాడు ఎంత తెలివైనవాడో, ఎంత కష్టపడుతున్నాడో తెలుసా? ఎందుకు వాడిని అదేపనిగా చికాకు పెడతావు?" అంటూ దాడి మొదలెట్టింది పేరులో మాత్రమే శాంతం ఉన్న శాంత.

"నాన్నా. వాడు చేస్తున్న ప్రాజెక్ట్ పూర్తయితే ఇప్పటి వరకూ ఎవరూ ప్రయత్నం చేయని ప్రత్యేకమైన ప్రోడక్ట్ తయారవుతుంది. వాడి పనికి అంతరాయం కలిగించకండి!" అంది నా కూతురు.

"వాడి తెలివితేటల మీద నాకేమీ అనుమానం లేదు. కానీ మంచి ప్రవర్తన కూడా పెంచుకోవాలి కదా!"

"ముందు చదువులో నెగ్గుకు రానివ్వండి. ప్రవర్తన తర్వాత నేర్చుకోవచ్చు."

'ప్రవర్తన నేర్చుకుంటే వస్తుందా? ఒక అలవాటుగా మార్చుకోవాలి' అనబోయి ఊరుకున్నాను. గెలవలేని యుద్ధం ఎప్పుడూ చెయ్యొద్దన్నాడు ఒక మహానుభావుడు.

కానీ కొడుకు ప్రవర్తన విషయంలో ఆందోళన ఉంది. కొంతవరకూ మేము కూడా ఈ పరిస్థితికి సాయం చేసాం. ఎప్పుడో నిద్ర లేస్తాడు. ఎప్పుడో తింటాడు. ఎప్పుడో పడుకుంటాడు. వాడి వెనకే నానా కష్టాలు పడి, అన్నీ ఏర్పాటు చేస్తేనే రోజు గడుస్తోంది. ఇతరుల కష్టంపైన గానీ, వారి సమయంపైన గానీ... వాడికి ఏమాత్రం గౌరవం లేదు.

చదువు తప్ప ఆధారం లేదు కనుక, పిల్లలకి చదువు మీదికే దృష్టి మళ్ళించాము. వాళ్ళు చదువుకునే చోటికే అన్నీ వస్తాయి. వాళ్ళు తినేసి వదిలేసిన పళ్ళాలు ఎవరో తీసుకుపోతారు. చదువు తప్ప వేరే విషయంలో వాళ్ళు తలదూర్చినపుడు 'ఇవన్నీ మేం చూసుకుంటాం. నువ్వు చదువుకో' అనే చెప్పాం. ఇప్పుడు మారమంటే ఎలా?

రెండ్రోజుల క్రితమే వాడి అక్కకి మెడిసిన్ సీట్ వచ్చిందని పార్టీకి వెళ్లాం. రెండుగంటల్లో పూర్తి చేసుకుంటామనే హామీతో వాడు కూడా వచ్చాడు. అక్కడ చాలా రద్దీగా ఉంది. మా వంతు కోసం ఎదురుచూస్తూ బైట కూర్చున్నాం. వీడు ఖాళీగా ఉండలేక అసహనంగా ఉన్నాడు. 'కాసేపు పండగ మూడ్‌లో ఉన్న అక్కతో మాటాడుకోవచ్చు కదా!' అంటే ముఖం తిప్పుకున్నాడు.

ఇంతలో వెయిటర్ వచ్చి అయిదు నిముషాల్లో ఒక బల్ల ఖాళీ అవుతోందని చెప్పి వెళ్ళాడు. సరిగ్గా మేము లోపలకి వెళ్లే సమయానికి అతను వచ్చి, "ఇంకొక్క పది నిముషాలు ఆగండి సార్!" అన్నాడు.

ఆ దెబ్బకి సునీల్ కోపంతో ఊగిపోయి, "మేమంతా చవటల్లా కనిపిస్తున్నామా? ఒకసారి రావచ్చని చెప్పి మళ్ళీ మాట మార్చటమేమిటి?" అని కేకలు పెట్టాడు.

“అదికాదు సార్…” అని అతను ఏదో చెప్పబోయాడు. కానీ సునీల్ అతని మాటలు వినకుండా అరుస్తుంటే అందరూ మూగటం మొదలుపెట్టారు.

నేను సర్ది చెప్పేలోపు మేనేజర్ హడావుడిగా వచ్చి, బల్ల ఖాళీ అయ్యిందని మమ్మల్ని లోపలికి తీసుకెళ్లారు.

“ఒరేయ్! మామూలు మూడ్‌కి వచ్చెయ్. మనం సెలెబ్రేట్ చేసుకోవటానికి వచ్చాము” అన్నాను.

కానీ ఉన్నంతసేపు సునీల్ కోపంగానే ఉన్నాడు. వెళ్లే ముందు వాడు “మీరు వెళ్ళండి. ఇప్పుడే వస్తా” అని ఆగాడు.

హోటల్ ఉద్యోగి ప్రవర్తన గురించి ఫీడ్ బ్యాక్ రాసి ‘ఒకటి’ రేటింగ్ ఇచ్చాడని, తర్వాత మేనేజర్ దగ్గరికి వెళ్లి వెయిటర్‌ని తిట్టించాడని, వాడు కారు దగ్గరికి వచ్చి చెప్పాక తెలిసింది. నన్ను టిప్పు కూడా ఇవ్వనివ్వలేదు.

అసలు విషయం నాకు తెలుసు. విపరీతమైన కోపంతో మాట వినని సునీల్‌తో చెప్పలేక ఆ వెయిటర్ నాకు జరిగింది వివరించాడు. మేము కూర్చోవాల్సిన ఆ బల్ల మీద తిన్నవాళ్ళు బిల్ ఇవ్వమని ముందు చెప్పేసి వెయిటర్ మాకు చెప్పిన తర్వాత ఐస్‌క్రీం కావాలని అడిగారట. వాళ్ళని కాదనలేని పరిస్థితిలో మమ్మల్ని మరికొంత సేపు ఆగమని చెప్పవలసివచ్చింది. ఇందులో వెయిటర్ తప్పేముంది? కానీ ఆ విషయం వినే పరిస్థితిలో మావాడు లేడు.

వాడు ఫిర్యాదు చేసాడని తెలిసాక, నేను మళ్ళీ లోపలకి వెళ్లి, వెయిటర్ తప్పేమీ లేదని మేనేజరుతో చెప్పి ఇంటికి వచ్చాను.

చిన్న ఉద్యోగాలు చేసుకునే ఆ నిస్సహాయులు… వేరే దారి లేక ఈ పని చేస్తున్నా, ఎంతో నిబద్ధతతో పని చేస్తున్నారు కనుకే సిస్టం నడుస్తోంది. ‘అటువంటి వారికి మరింత నిస్పృహ కలిగేలా ప్రవర్తిస్తే ఎలా?’ అని నేను తర్వాత చెప్పబోతే, ‘నా టైం వేస్ట్ అయిపోతే ఫరవాలేదా?’ అని అడిగాడు.

వీడికి ఎన్ని రకాలుగా వివరించినా మార్పు రావటంలేదని, కొడుకులో మార్పు తీసుకురమ్మని దేవుడికి గట్టిగా దణ్ణం పెట్టుకున్నాను. దేవుడు ఈ సమస్య ఎలా పరిష్కరిస్తాడో నాకు ఊహకి అందకపోయినా ఆయననే వేడుకున్నాను.

రోజులు గడుస్తున్నాయి. సునీల్ చదువుతున్నాడు. వాడు చదువుకునే గదిలో పొగలు వస్తున్నాయి. కానీ మిగతా విషయాలలో మార్పు లేదు. నేనంటే ద్వేషం మాత్రం బాగా పెంచుకున్నాడు.

వాడు అనుకున్నట్టే అమెరికాలో మంచి యూనివర్సిటీలో ప్రవేశం దొరికింది. మా ఆనందానికి హద్దులు లేవు.

“నేను చేసిన ప్రత్యేకమైన ప్రాజెక్ట్ ఆ ప్రొఫెసర్‌కి నచ్చింది. ఒక ఇంటర్నేషనల్ జర్నల్‌లో నా పేపర్ పబ్లిష్ అయింది. ఇవన్నీ నాన్నకి లెక్కలేదులే! నేను పనిమనిషిని పక్కకి తోసి, గిన్నెలు కడిగిస్తేనే నాకు గౌరవం!” అని ఇలాంటి మాటలే వెటకారంగా నాకు వినపడేలా, ప్రతి ఒక్కడితో మాటాడి సునీల్ విమానం ఎక్కేశాడు.

ఎప్పటికైనా వాడిలో మార్పు వస్తుందని ఆశపడుతున్న నాకు నిరాశే మిగిలింది.

వెళ్లిన తర్వాత సునీల్ ఫోన్ చేసినా, నాతో ముక్తసరిగా మాటాడేవాడు. చదువుకోసం ఇచ్చిన వీసా పరిమితుల వలన స్వదేశానికి రావటం కుదరలేదు. ఉద్యోగం వచ్చాక, సరైన వీసా లభించటం వలన భారతదేశానికి వస్తూ ఫోన్ చేశాడు.

ఎప్పటిలాగే వాడి అమ్మ, అక్కతో మాటాడుతుంటే... నేను అపరాధ భావంతో పక్కనుంచి వింటున్నాను. కోపం కొంచెం తగ్గిందేమో నాకోసం ప్రత్యేకంగా అడిగాడు.

"నాన్నా... నేను వస్తున్నా. అక్కడ ఐదేళ్లు పని చేసి, మన దేశంలోనే స్థిరపడే ప్రణాళిక ఒకటి ఆలోచిస్తున్నా. నీ సాయం కావాలి!" అన్నాడు.

వాడి తల్లి బలవంతపెడితే తప్ప మాటాడని వాడు, తనంతట తానే మాటాడినందుకు పైగా నా సాయం కావాలని అడగటం నాకు ఆశ్చర్యం కలిగించాయి.

ఆరోజు వచ్చింది. అందరం విమానాశ్రయానికి వెళ్లి స్వాగతం పలికాం. అందరినీ పలకరించి చివరికి నా దగ్గరికి వచ్చి "వచ్చేసాను నాన్నా..." అన్నాడు. నేనెప్పుడూ వెనకే కదా!

దారిలో మాట్లాడిన కాస్తా అమ్మతో, అక్కతో... అక్కడ జీవితం ఎలా ఉంటుందో విశేషాలు చెప్పాడు.

నెమ్మదిగా ఇల్లు చేరాం. ఇంటి దగ్గర వాహనం నుంచి దిగుతూ "థాంక్స్ అండి" అని చెప్తూ డ్రైవర్‌కి బిల్లుతో పాటు వంద రూపాయలు ఇచ్చాడు. "మీ డ్రైవింగ్ చాలా సౌకర్యంగా ఉంది. ఎక్కడా కుదుపు లేదు" అని అభినందించాడు.

'నేను చూస్తున్నది నిజమేనా?' అని ఆశ్చర్యపోయాను.

తర్వాత అలాంటి విచిత్రాలు చాలా జరిగాయి. తాగిన కప్పులూ, తిన్న కంచాలు వాడే స్వయంగా సింకు దగ్గరికి తీసుకెళ్లి అంట్లగిన్నెలని, రిన్స్ చేసి సింకులో వదిలాడు. హోటల్‌కి వెళ్ళినపుడు వెయిటర్ పొరబాటున అడిగిన దానికి బదులు వేరే ఐటమ్ తీసుకొస్తే "మీరలా పొరబాటు పడకూడదు. ఒక యాప్ ఉంది. ఇందులో సులువుగా గుర్తుంచుకోవచ్చు." అంటూ అతని ఫోన్లో ఒక యాప్ లోడ్ చేసి, ఎలా వాడుకోవాలో చెప్పాడు. నాకు దిమ్మ తిరిగేలా ఆ వెయిటర్‌కి ఇరవైశాతం బిల్లు టిప్ ఇచ్చాడు. 'ఇదంతా ఎలా సాధ్యం? దేవుడు వీడిలో మార్పు ఎలా తీసుకువచ్చాడు?' అనుకున్నాను.

వాడు స్థిమితపడ్డాక, "ఒరేయ్ నిన్ను చూస్తుంటే నాకెంతో గర్వంగా ఉందిరా" అన్నాను.

వాడు నవ్వేసి, "మీరెందుకు ఎక్కువ సంతోషపడ్డారో నాకు తెలుసు నాన్నా." అన్నాడు.

నేనూ నవ్వేసాను.

"అనుభవం అన్నీ నేర్పింది నాన్నా" అన్నాడు సునీల్.

"నేను అక్కడికి వెళ్ళాక, అన్నీ తెలిసాయి. అక్కడ పనిమనుషులకి చాలా డబ్బులు ఇవ్వాలి. అందుకని నా గిన్నెలు నేనే కడుక్కుంటుంటే, నా బట్టలు నేనే ఉతుక్కుంటుంటే అందులో బాధ తెలిసింది. మీరు చెప్పిన మాటలకి అర్థం తెలిసింది. యూనివర్సిటీ ఇచ్చే డబ్బులు చదువుకి మాత్రమే సరిపోతాయి కనుక వేరే పనులు చేసి సంపాదించుకోవలసి వచ్చింది. పెట్రోల్ బంకుల్లోను, లైబ్రరీలోనూ, హోటల్ లోనూ పని చేసాను. అప్పుడు మీరు ఎప్పుడూ చెప్పే వేరేకోణం అర్థమయింది. ప్రతిపనీ ఖచ్చితమైన టైమ్‌లో, పనిచేసే ఆ వాతావరణంలో ఇతరుల సమయం ఎంత విలువైనదో కూడా తెలిసింది. చదువు, పనిలో నైపుణ్యంతో పాటు, ప్రవర్తన కూడా ముఖ్యమనే జ్ఞానం కలిగింది."

“మరి నేను ఎన్నోసార్లు చెప్పినా నీకు ఎందుకు అర్థం కాలేదు?”

సునీల్ నవ్వాడు. “నాన్నా. ఈ కాలం యువత అన్నీ వారి అనుభవంతో నేర్చుకుంటున్నారు. నువ్వు తప్పేమీ చెయ్యలేదు. కానీ తరానికి తరానికి మార్పుని గుర్తించలేదు. నాకు చెప్పటానికి బదులు ప్రతివారం ఒకసారి మాచేత గిన్నెలు కడిగించి ఉంటే నీ మాటలు ఇంకా బాగా అర్థమయ్యేవి. మీ స్వంతపనిలా... అయిదు నిముషాల ముందే బడిలో దింపే బదులు, మమ్మల్నే తయారవ్వమని మాకు వదిలేస్తే ఇతరుల సమయం పైన గౌరవం కలిగి ఉండేది. చిన్నప్పుడంతా మీరే మా పనులన్నీ చేసేసి, చదువు తప్ప వేరే లోకం లేదని మా బుర్రల్లో ఊదేసి, తర్వాత మారమంటే అనుభవం లేకుండా ఎలా మారతాం?” అన్నాడు.

“నిజమే. నా తరంలో పెద్దలు ఏమి చెప్తే అదే వేదంగా నేర్చుకున్నాం. అప్పటికి అది కరెక్టు. ఇప్పుడు పనికిరాదు. ఈ కాలం యువత అన్నీ అనుభవంతోనే నేర్చుకుంటున్నారు.”

జీవితం నిత్యనూతనం!

# తెలి తెలి

డా. ఎం. కోటేశ్వర రావు
✆ 8555881512

**జన్మదిన సంచిక 'నేటి యువత' కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

*సైనికుల త్యాగం గురించి వాట్సప్‌లో పోటీలు పడి పోస్ట్‌లు పెట్టి చేతులు దులుపుకుంటే ఘనకార్యం చేసినట్టు కాదు. దానివల్ల సైనికులకి ఒరిగేదేమీ ఉండదు!"*

*"రైళ్ళల్లో, బరువైన పెద్ద బ్యాగులు, ట్రంకు పెట్టెలతో, రిజర్వేషన్ లేక, వందల కిలోమీటర్లు ప్రయాణిస్తూ మన కళ్ళ ముందు అవస్థ పడుతుంటే... మీలో ఒక్కరైనా మీ బెర్త్ ఇచ్చారా? కనీసం మీ బెర్త్ పైన కూర్చోటానికి చోటిచ్చారా? బరువైన వారి లగేజీ దించుకోవటంలో ఎప్పుడైనా సహాయం చేశారా?"*

"అమ్మా... కాలేజ్‌కి బయలుదేరుతున్నాను!" వీధిలోంచి గట్టిగా అరిచి చెప్పి, బైక్ స్టార్ట్ చేశాడు రాకేష్. గడప దాటేముందే తల్లికి చెప్పి బయలుదేరినా, బైక్ స్టార్ట్ చేసే ముందు అలా అరిచి చెప్పటం రాకేష్‌కి అలవాటు. తన మీద కొడుక్కి ఉన్న ప్రేమకి పొంగి పోవటం అతని తల్లికి అలవాటు! రాకేష్ అలా అరిచి చెప్పేది... తన కోసం కాదు అనే నిజం ఆ తల్లికి తెలీదు.

రాకేష్ అరుపు ఎక్కడ వినిపించాలో అక్కడ వినిపించింది. అంతకు ముందే రాకేష్ మొబైల్‌లోంచి అక్కడికి సందేశం వెళ్ళిపోయింది. ఆ అరుపు లాంఛనం మాత్రమే.

రాకేష్ బైక్ స్టార్ట్ చేసి వెళ్ళగానే, ఆ ఇంటి పక్కన చిన్న షట్టర్‌లో, బట్టలు ఇస్త్రీ చేసే తాతారావు ముసి ముసిగా నవ్వుకుంటూ, రాకేష్ ఇంటికి ఎదురుగా ఉన్న ఇంటివైపు చూశాడు. కల్పన స్కూటీ తీసుకొని, గేట్ బయటికొచ్చింది. స్కూటీ స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయింది. తాతారావు ఆ దృశ్యాన్ని ఆరునెలలుగా చూస్తున్నాడు.


సాయంత్రం ఆరు గంటలు. "వదినగారూ... కల్పన ఇంకా ఇంటికి రాలేదండి. కాలేజీనుంచి వచ్చేటప్పుడు, సూపర్ బజార్‌కి వెళ్ళి కొన్ని సరుకులు తీసుకురావాలి. ఫోన్ చేస్తే కవరేజ్ ఏరియాలో లేదని వస్తోంది. మీ రాకేష్‌కి కాల్ చేసి, కల్పనతో మాట్లాడిస్తారా?" కల్పన తల్లి సుబ్బలక్ష్మి వచ్చి అడిగింది.

రాకేష్ తల్లి సుగుణ కొడుక్కి కాల్ చేసింది. ఫోన్ కలవలేదు. "వీడిది కూడా అవుట్ ఆఫ్ కవరేజ్ వస్తోంది వదినగారూ!

బహుశా అక్కడ వర్షం పడుతోందేమో. మిస్డ్ కాల్స్ చూసుకొని ఇద్దరిలో ఎవరో ఒకరు చేస్తారులెండి. మీరు కూర్చోండి. కాఫీ తెస్తాను.”

కాఫీ తాగటం పూర్తయ్యింది. సుబ్బలక్ష్మి, సుగుణ కబుర్లు మొదలు పెట్టారు. పైకి మాట్లాడుకుంటున్నా, ఇద్దరికీ లోలోపల ఏదో ఆందోళన! గంట గడిచింది. ఇద్దరికీ ఫోన్లు రాలేదు. సుబ్బలక్ష్మి కల్పనకి, సుగుణ రాకేష్‌కి మళ్ళీ కాల్ చేశారు. రెండు ఫోన్లూ 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా!' అనే వచ్చాయి. ఇద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. ఇద్దరిలో అంతకంతకూ భయం, ఆందోళన ఎక్కువయ్యింది. ఆ పిల్లలు ఎప్పుడూ అంత ఆలస్యంగా ఇంటికి రాలేదు. ఆలస్యమైతే ముందే సమాచారం ఇస్తారు.

కల్పన తండ్రి మూర్తి, రాకేష్ తండ్రి నారాయణ ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకొని చాలా కంగారు పడ్డారు. సుబ్బలక్ష్మి దంపతులు కల్పన ఫ్రెండ్స్‌కి, సుగుణ దంపతులు రాకేష్ ఫ్రెండ్స్‌కి ఫోన్లు చేయటం మొదలు పెట్టారు. అందరినుండి ఒకటే సమాధానం “ఈరోజు కల్పన అసలు కాలేజీకి రాలేదు ఆంటీ” “రాకేష్ ఈరోజు కాలేజీకి రాలేదు అంకుల్”.




ఆ రెండు జంటలకి కాళ్ళూ చేతులు ఆడలేదు. చెమటలు పట్టేశాయి. ఏం చెయ్యాలో తోచలేదు. విషయం తెలిసి, చుట్టుపక్కల వాళ్ళు గుమిగూడారు. “కంగారు పడకండి. చూస్తుంటే ఇదేదో ప్రేమ వ్యవహారంలా ఉంది. ఇద్దరూ కాలేజీకి వెళ్ళలేదు, ఇద్దరి ఫోన్లు కలవటం లేదు... ఈ ఆధారాలు చాలు. వాళ్ళే వస్తారులెండి” పక్కింటి పుల్లారావు తేలిగ్గా అన్నాడు.

ఆ మాట విని ఆ రెండు జంటల మొహాలు మాడిపోయాయి.

“లేదండీ. మా అబ్బాయి అలాంటి వాడు కాదు. వాడి దృష్టి అంతా చదువు మీదే ఉంటుంది” రాకేష్ తండ్రి నారాయణ అన్నాడు.

“మా అమ్మాయి అని చెప్పటం కాదు కానీ, కల్పన నిప్పు అండి! ఇంటి దగ్గర వంచిన తల కాలేజీలో, కాలేజీలో వంచిన తల ఇంటికి వచ్చాకే ఎత్తుతుంది. మా అమ్మాయికి అలాంటి ఆలోచనలే రావు!” కల్పన తండ్రి మూర్తి.

“ఇది మరీ బావుంది. ‘అందరూ శ్రీమహావైష్ణవులే అయితే, చేపల పులుసు ఏమైంది?’ అన్నట్టుంది మీ వరస! మన పిల్లలు మనకి ముద్దుగా అనిపించినా, ఇద్దరూ ఇరవై ఏళ్ళు వచ్చినవాళ్ళే! ఇంక సినిమాల ప్రభావం, సెల్‌ఫోన్ల ప్రభావం వేరే చెప్పాలా? ఇదేదో ఇద్దరూ కూడబలుక్కుని చేసిన పనిలా అనిపిస్తోంది” ఎదురింటి వెంకాయమ్మ దీర్ఘం తీసింది.

“రోజూ ఎన్ని జరగటం లేదు? టీవీలో, పేపర్లో చూట్టం లేదా? కంగారు పడకండి. కాసేపటికి దండలు ఏస్కుని దిగుతారు. ఆరతిచ్చి కడుపులో దాసుకోవలసిందే!” వెనకింటి వనజ అంది.

ఆ మాటలన్నీ ఆ రెండు జంటల పైన బాగా పని చేశాయి. ఒక్కసారిగా వాళ్ళు ఒకర్నొకరు శత్రువుల్లా చూసుకోవటం మొదలు పెట్టారు. “మీవాడే ఏదో మాయ చేశాడు”, “మీ అమ్మాయే మావాణ్ణి వల్లో వేసుకుని ఉంటుంది” అనే వారి మనసులోని భావాలను కళ్ళతో చూపించుకున్నారు.

“తలోమాటా మాట్లాడి, ఆ తల్లితండ్రుల్ని బాధ పెట్టకండి. పిల్లల పైన వాళ్లకున్న నమ్మకం కూడా నిజమే కావొచ్చు. ఇది ప్రేమ వ్యవహారమని ఫిక్స్ అయిపోకండి. ఇంకేదైనా కారణం అయ్యుండొచ్చు కదా” అదే వీధిలో ఉండే విశ్రాంత సైనికుడు రాజేశం మందలింపుగా అన్నాడు.

అతని మాటలు అక్కడ గుమిగూడిన వారికి నచ్చలేదు. మూతి విరుచుకుంటూ చూశారు అతని వైపు!

“ఏమీ అనుకోకపోతే ఒక మాట సెప్పమంటారా?” గుంపులోంచి ముందు కొచ్చి అడిగాడు... బట్టలు ఇస్త్రీ చేసే తాతారావు.

అందరూ అతని వైపు చూశారు ఆసక్తిగా! ఏదో నిజం బయట పడబోతుందన్న ఆత్రుత జనంలో! అదేదో చెప్పమన్నట్టు అతనివైపు చూశాయి రెండు జంటలూ.

“రాకేష్‌బాబు రోజూ కాలేజీ కెళ్ళే సమయంలో, బండి స్టాట్ చేసే ముందు ‘అమ్మా ఎల్లొత్తాను’ అని గట్టిగా సెప్తారు కదండె. అది ఆళ్ళమ్మ గారికి సెప్పటం కాదండె... కల్పనమ్మ గారికి సెప్పటం! ఆయ్... రాకేష్‌బాబు బండి స్టాట్ సేసుకొని ఎల్లాక, సరిగ్గా మూడు నిమిసాల్లో కల్పనమ్మ గారు కూటీ తీసుకొని బయటికొచ్చేదండి. ఆరునెల్ల నుంచి సూత్తున్నానండే ఈ వరస!” తాతారావు.

“ఉన్న మాటంటే ఉలుకెక్కువని... మనం సెప్తే, ఆ మిలట్రీ ఆయన కొట్టి పారేశాడు. ఆళ్ళమ్మానాన్నలేమో పిల్లలు బంగారం, నిప్పు అన్నారు. అసలు బండారం తాతారావు బయట పెట్టాడు కదా. ఇప్పుడేమంటారు మరి?” గుంపులోంచి ఒకావిడ.

"ఇంక అనేదేం ఉంటాది? ఆల్లిద్దరూ ఏ గుళ్ళోనో, రిజిట్టర్ ఆపీసులోనో పెళ్లి సేసుకొని వొచ్చాక, ఒప్పుకొని కలుపుకుంటారా? ఇడదీసుకుంటారా? అది ఆలోసించుకోవాలి రెండు కుటుంబాలు!" గుంపులోని మరో గొంతు.

కల్పన, రాకేష్‌ల తల్లితండ్రుల్లో ఆవేదన, ఆందోళన, అవమానం, భయం ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి చేశాయి. అంతలో సుబ్బలక్ష్మి ఫోన్ రింగ్ అయ్యింది. ఆ ఫోన్ ఎత్తక ముందే నారాయణ ఫోన్ కూడా రింగ్ అయ్యింది. రెండు ఫోన్లు ఒకేసారి రింగ్ అవ్వటంతో అందరిలో ఉత్కంఠ!

నారాయణ, సుబ్బలక్ష్మి భయం భయంగా ఫోన్ ఎత్తారు. అవతలి మాటలు విని వణికిపోయారు. కొత్త భయానికి లోనయ్యారు. మరో ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయిలు కూడా ఇంటికి రాలేదు. వాళ్ళు కల్పన, రాకేష్‌ల క్లాస్మేట్స్. వాళ్ళు కూడా ఈరోజు కాలేజీకి వెళ్లలేదు. వాళ్ళ గురించి తెలుసుకోటానికి వాళ్ళ తల్లితండ్రులు చేసిన ఫోన్లు అవి.

"ఇప్పటికైనా నామాట విని ముందు పోలీస్ కంప్లయింట్ ఇవ్వండి. ఇదేదో మిస్టరీలా ఉంది. కిడ్నాప్ అయ్యారేమో అని అనుమానంగా ఉంది!" రెండు జంటలను ఉద్దేశించి అన్నాడు మాజీ సైనికుడు రాజేశం. "పచ్చకామెర్లోళ్లకి లోకమంతా పచ్చగా కనిపించినట్టు, ఈ మిలట్రీవోళ్ళకి, పోలీసోళ్ళకి అన్నీ కిడ్నాపులు, మడ్డర్లలాగే అనిపిత్తాయి. ముగ్గురమ్మాయిలు, ముగ్గురబ్బాయిలు లేసిపోతే కిడ్నాపులు అంటారేటండి బాబు? అనవసరంగా ఆళ్ళ అమ్మాబాబులకి కొత్త బయాలు ఎట్టకండి. ఆళ్ళకేం అవ్వదు. సుబ్బరంగా ఒకరికొకరు తోడున్నారు. పెళ్లిసేసుకొని ఆళ్లే చేమంగా వత్తారు" గుంపులోంచి మరో అభిప్రాయం.

అందరూ ఆ అభిప్రాయాన్ని బలపరిచారు.

కల్పన తల్లితండ్రులకి, రాకేష్ తల్లితండ్రులకి ఏం చేయాలో పాలుపోలేదు. జనం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలు, రాజేశం అనుమానాలు అన్నీ సబబుగానే అనిపించాయి వాళ్ళకి! వాళ్ళున్న మానసిక ఒత్తిడిలో సొంతంగా ఆలోచించలేక పోతున్నారు. కిడ్నాప్ అనే అనుమానం ఆ నలుగుర్నీ విపరీతమైన భయాందోళనకి గురి చేసింది.

అప్పటికే రాత్రి తొమ్మిది దాటిపోయింది. నలుగురూ కలిసి దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కి వెళ్ళారు. రాజేశం, మరికొందరు తోడుగా వెళ్ళారు. అంతకు ముందు తమ పిల్లలు కూడా ఇంటికి రాలేదని ఫోన్ చేసిన తల్లితండ్రుల్ని కూడా స్టేషన్‌కి వచ్చారు. రాత్రి పదిగంటలకి అందరూ పోలీస్ స్టేషన్‌కి చేరుకొని ఫిర్యాదు ఇచ్చారు.

ఫిర్యాదు తీసుకున్న ఎస్.ఐ. నాగేశ్వరరావు చాలాసేపు ఆలోచించాడు. అప్పటికప్పుడు కల్పన, రాజేష్‌లతో పాటు ఎం.టెక్. చదువుతున్న వాళ్ళ స్నేహితులు అందరితో ఫోన్లో మాట్లాడాడు. కాలేజ్ ప్రిన్సిపల్‌తో, ప్రొఫెసర్లతో మాట్లాడాడు. మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకొచ్చాయి. మిస్ అయిన ముగ్గురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలు... దాదాపు ఆరు నెలల నుంచి క్లాసులకి సరిగా హాజరు కావటం లేదు. ఎక్కువగా దుమ్మా కొడుతున్నారు. అది కూడా ఆరుగురూ ఒకేసారి.

రోజూ క్లాసులు మధ్యాహ్నం ఒంటిగంటకి అయిపోతాయి. కానీ సిలబస్ పూర్తికాని సబ్జెక్ట్స్‌లో స్పెషల్ క్లాసులని, ట్యూషన్స్ అని, ప్రాజెక్ట్ వర్క్ అని రకరకాల కారణాలతో, ఆ ఆరుగురూ రోజూ సాయంత్రం ఆరుగంటలకి ఇంటికి చేరుతున్నారు. రోజుకి ఐదు గంటలు ఎక్కడో గడుపుతున్నారు. ఆదివారాలు, రెండో శనివారాలు, పండుగ సెలవుల్లో కూడా కాలేజీకి వెళ్తున్నట్టు చెప్పి ఇంట్లోంచి వెళ్లిపోతున్నారు. రోజుకి ఎనిమిది గంటలు ఏం చేస్తున్నారో తెలీదు. ఎం.టెక్ చదివే పెద్దపిల్లలు

అవ్వటం, పెద్దచదువులు, ఫైనలియర్ కావటంతో, ఇంట్లో ఎవరికీ అనుమానం రాలేదు. అలా ఆరునెలలనుండి జరుగుతున్నట్టు విచారణలో తెలిసింది.

ఎస్.ఐ. నాగేశ్వరరావు ప్రాథమికంగా ఒక అంచనాకి వచ్చాడు. ఏం జరిగి ఉంటుందో, మూడు ఆప్షన్లు అతని మెదడులో మెదిలాయి. మొదటిది... ప్రేమ వ్యవహారంలో, ఒకరినొకరు ప్రభావితం చేసుకొని, మూడు జంటలు ప్రేమపెళ్ళిళ్ళు చేసుకొని అజ్ఞాతంలోకి వెళ్ళి ఉండవచ్చు. రెండు... తరచుగా దూరంగా వెళ్ళి, ఏదైనా రహస్యప్రదేశంలో ఆ ప్రేమజంటలు సన్నిహితంగా మెలుగుతూ ఉండవచ్చు. మత్తు పదార్థాలకు అలవాటుపడి ఉండొచ్చు. మూడు... చాలా కాలంగా ఆ మూడు జంటల్ని గమనిస్తున్న రౌడీ మూకలు, స్టూడెంట్స్‌ని అనుసరించి, రహస్య ప్రదేశంలో వారిమీద దాడి చేసి ఉండవచ్చు. భయపెట్టి, అమ్మాయిలపై అత్యాచారం చేసి ఉండొచ్చు. అందులో భాగంగా ఆ ఆరుగురికి హాని కూడా తలపెట్టి ఉండొచ్చు.

“మేము ఈక్షణమే ఇన్వెస్టిగేషన్ మొదలు పెడతాం! పిల్లల ఫోన్స్ ఆధారంగా మాకున్న సాంకేతికతను ఉపయోగించి, వాళ్ళు ఎక్కడ ఉన్నారో తెలుసుకుంటాం. మీరు వెళ్ళవచ్చు.” ఎస్.ఐ. నాగేశ్వరరావు ఫిర్యాదుదారులతో అన్నాడు.

“సర్... అసలు ఏం జరిగి ఉంటుంది? మాకు చాల భయంగా ఉంది!” కల్పన తండ్రి కన్నీళ్లతో అడిగాడు. “మీరంతా చదువుకున్నవాళ్ళు. ఏం జరిగిందో మీరు కూడా ఊహించగలరు. ఇప్పటికైతే ప్రేమవ్యవహారమే అనుకుంటున్నాను. వాళ్ళకి ఏమీ కాకూడదని, క్షేమంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.”

“సర్... మాకు చాల ఆందోళనగా ఉంది. మీ సెర్చ్ ఆపరేషన్‌లో మేము కూడా మీతోపాటు రావొచ్చా? మాతోపాటు మా ఊరి వాళ్ళు కూడా కొందరు సహాయం చేస్తారు!” రాకేష్ తండ్రి నారాయణ అభ్యర్థించాడు.

ఎస్.ఐ. ఒక నిమిషం ఆలోచించి అన్నాడు. “సరే, లొకేషన్ తెలియగానే మీకు తెలియచేస్తాం. మీరు ఇంటికి వెళ్లండి!”

“లేదు సర్. పిల్లల ఆచూకీ తెలిసే వరకు మాకు నిద్రాహారాలు ఉండవు. మీ ఫోన్ కోసమే ఎదురుచూస్తూ ఉండాలి. దానికంటే, ఇక్కడే ఉంటాం సర్” కల్పన తల్లిదండ్రులు అన్నారు.

ఎస్.ఐ ఎంతగా నచ్చచెప్పినా, ఆ ఆరుగురు తల్లిదండ్రులు ఇంటికి వెళ్లటానికి ఇష్టపడలేదు. ఎస్.ఐ. తన సొంత ఖర్చుతో అందరికీ భోజనాలు ఏర్పాటు చేశాడు.

ఆరుగురు తల్లిదండ్రులు దీనంగా స్టేషన్లో కూర్చుని ఉండటం ఎస్.ఐ. నాగేశ్వరరావుకి బాధ కలిగించింది. ఒక్కనిమిషం కూడా వృథా చెయ్యకుండా విచారణ వేగవంతం చేశాడు. హెడ్‌క్వార్టర్‌లోని సాంకేతిక బృందానికి, ఆరుగురు స్టూడెంట్స్ ఫోన్ నెంబర్లు పంపాడు. ఎస్.పి. సహాయంతో, పిల్లలను వెతకటానికి ఆరు ప్రత్యేకబృందాలను పంపించాడు.

రాత్రి పదకొండు గంటలకి సాంకేతికబృందం నుండి పిల్లల ఫోన్ లొకేషన్ ట్రేస్ అయినట్టు సమాచారం వచ్చింది. 19 కిలోమీటర్ల దూరంలో, అటవీప్రాంతంలో ఫోన్లు ఉన్నట్టు గుర్తించారు. హుటాహుటిన ఎస్.ఐ. తన సిబ్బందితో స్పాట్‌కి బయలు దేరాడు. సాంకేతిక బృందంలోని సిబ్బంది సిగ్నల్స్‌ని అనుసరిస్తూ, దారి చెప్తుంటే, వాహనాలు ముందుకి కదులుతున్నాయి. ఆరుగురు తల్లిదండ్రులు, గ్రామస్థులు వారి వాహనాలలో అనుసరించారు.

చీకటితెరలను చీల్చుకుంటూ వాహనాలు ముందుకెళుతున్నాయి. అటవీప్రాంతం మొదలయ్యింది. కొంత దూరం వెళ్ళాక ఫోన్ సిగ్నల్ రోడ్డుపై నుంచి అడవిలోకి చూపించింది. అక్కడ వాహనాలు వెళ్ళేటంత రోడ్డు లేదు. చిన్న కాలిబాట

కనిపించింది. అక్కడ ఒక బడ్డీకొట్టు ఉంది. లోపల లైట్ వెలుగు. ఎస్.ఐ. బండి దిగి, బడ్డీకొట్టు డోర్ కొట్టాడు. నలభై ఏళ్ళ వయసున్న వ్యక్తి డోర్ తీసి, అందరి వైపు భయంగా చూశాడు. ఎస్.ఐ పిల్లల ఫోటోలు చూపించి, "వీళ్ళని ఎప్పుడైనా చూశావా?" అని అడిగాడు.

"చూసానండి. పెతిరోజు మూడు బైకుల మీద జంటలుగా వత్తారండి. ఇదిగో ఈ కాలిబాటలోంచి అడవిలోకి ఎల్తారండి. పొద్దుగూకే ఏలకి మళ్లీ అడివిలోంచి వత్తారండి. నా దగ్గర శానాసార్లు పుచ్చకాయ ముక్కలు కొని తిన్నారండి" తనకి తెలిసిన సమాచారం చెప్పాడు బడ్డీకొట్టు వ్యక్తి.

వాహనాలు అన్నీ, ఆ కాలిబాటలో అడవిలోకి దారితీశాయి ఫోన్ సిగ్నల్స్‌ని అనుసరిస్తూ. అడవిలో ఆరు కిలోమీటర్లు, అస్తవ్యస్తంగా ఉన్న దారిలో ప్రయాణించాక, ఫోన్ సిగ్నల్స్ కొన్ని అడుగుల దూరంలో ఉన్నట్టు గుర్తించారు.

ఎస్.ఐలో ఉత్కంఠత పెరిగింది. చీకట్లో కళ్ళు చిట్లించి చూస్తున్నాడు. కొన్ని అడుగుల దూరంలో, ఎదురుగా ఒక పాడుపడ్డ భవనం కనిపించింది. లోపల లైట్లు వెలుగుతున్నాయి. అంత దట్టమైన అడవిలో, అంత దూరంలో ఒక భవనం... అందులో లైట్లు వెలగటం... ఎస్.ఐకి ఆశ్చర్యం కలిగించింది. ఫోన్ సిగ్నల్స్ ఆ భవనంలోంచి వస్తున్నట్టు గుర్తించి వాహనాలు అక్కడ ఆపారు.

ఆరుగురు తల్లిదండ్రులు భయంతో వణుకుతూ, తడబడుతూ, ఒకరి చెయ్యి ఒకరు పట్టుకొని పోలీస్ బృందాన్ని అనుసరించారు. భవనం బయట ఉన్న మూడు బైకులను తల్లితండ్రులు గుర్తించారు. భవనం తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల ఎలాంటి అలికిడి లేదు. ఆ నిశ్శబ్దం తల్లిదండ్రుల్లో మరింత భయాన్ని పెంచింది.

అందరూ లోపలికి అడుగు పెట్టారు. ఛార్జింగ్ లైట్లు వెలుగుతున్నాయి. హాల్ మధ్యలో పెద్ద స్టాండ్. దానిపైన పొడవుగా, సన్నగా, ఉన్న ఒక పెద్ద స్టీల్ పైప్. హాల్ పక్కనున్న గదిలోకి చూసిన ఎస్.ఐ బిగుసుకుపోయాడు. అక్కడ... ఆరుగురు పిల్లలు నేలమీద పడి ఉన్నారు అస్తవ్యస్తంగా. ఎలాంటి కదలికలు లేవు.

ఒక్కసారిగా ఆరుగురు తల్లిదండ్రులు భోరుమని ఏడవటం మొదలు పెట్టారు. ఆ రాత్రివేళ, ఆ అడవిలో వారి ఏడ్పులు ప్రతిధ్వనించాయి, అరణ్యరోదనలా. అడవికే జాలిగొలిపేలా ఉన్నాయి ఆ రోదనలు. పోలీసులు వారిని ఆ గదిలోకి రాకుండా అపారు.

ఎస్.ఐ పిల్లలందర్నీ పరీక్షగా చూశాడు. నాడి చూశాడు. ముక్కు దగ్గర చెయ్యి పెట్టి చూశాడు.

"ఆగండి. అందరూ ప్రాణాలతో ఉన్నారు. భయపడకండి." అరిచినట్టుగా అన్నాడు ఎస్.ఐ.

ఒక్కసారిగా ఏడుపులు ఆగిపోయాయి.

★★★

కార్పొరేట్ హాస్పిటల్. ఉదయం తొమ్మిదిగంటలు. పిల్లలు అందరూ కోలుకున్నారు. మీడియా వాళ్ళు హాస్పిటల్ ఆవరణలో మోహరించారు. రాత్రికి రాత్రే మీడియాకి వార్త లీక్ అయ్యింది. పేపర్లలో వార్తలు వచ్చాయి. టీవీల్లో ఫ్లాష్‌న్యూస్‌లు

వస్తున్నాయి. 'ఎంటెక్ విద్యార్థుల అదృశ్యం... ప్రేమవ్యవహారమే కారణమా? యువత ఎటు పోతుంది? పిల్లల తొందరపాటు – తల్లిదండ్రులకు కడుపు కోత' వంటి శీర్షికలతో మీడియా హోరెత్తి పోయింది.

బయటకు వచ్చిన పిల్లల్ని మీడియా చుట్టుముట్టింది. ప్రశ్నలవర్షం కురిపించింది. ఆరుగురు విద్యార్థులు అక్కడికక్కడే మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

"మీలాంటి యువత, ఒక గొప్ప ఇంజనీరింగ్ విద్య చదువుతున్న వాళ్ళు, బాధ్యత లేకుండా, కాలేజ్ ఎగ్గొట్టి, ఆడామగా కలిసి, అడవిలో రహస్యంగా షికార్లు చెయ్యటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?"

"మీకు ఏ మాత్రం బాధ్యత లేదా? రక్తాన్ని, మాంసాన్ని ధారపోసి చదివిస్తున్న మీ పేరెంట్స్ పైన మీకు జాలిలేదా?"

"మీలాంటి యువత నిర్వీర్యమై, ఆవారాగా తిరుగుతుంటే సమాజం ఏమవ్వాలి? మీకు దేశంపట్ల బాధ్యత లేదా?"

"అసలు మీరు అడవిలోకి ఎందుకు వెళ్ళారు? ఏకాంతం కోసమేనా? సన్నిహితంగా గడపటం కోసమేనా? మాదక ద్రవ్యాల కోసమా?"

ఈటెల్లాంటి ప్రశ్నలు దూసుకు వస్తుంటే కొన్ని క్షణాలు మౌనంగా, నేల చూపులు చూస్తూ ఉండిపోయారు ఆరుగురు విద్యార్థులు.

ప్రశ్నలన్నీ అయిన తర్వాత విద్యార్థులు ఒకొక్కరుగా నోరు తెరిచారు.

"మా చదువుకి సార్థకత కోసం, మాతృదేశం ఋణం తీర్చుకోటానికి అడవిబాట పట్టాం. అన్నల్లా కాదు... దేశసరిహద్దుల్లో ప్రాణత్యాగాలకు సిద్ధమై ఉన్న సైనిక అన్నలకు అండగా... తమ్ముళ్ళుగా."

"పెహల్గాం సంఘటన మమ్మల్ని కలచివేసింది. శత్రుదేశాన్ని కట్టడి చేయటానికి ప్రాణాలర్పించిన వీర సైనికులని చూసి చలించిపోయాం."

"శత్రుస్థావరాలను గుర్తించటానికి, శత్రువులను సమర్థవంతంగా తుదముట్టించటానికి, మా ఇంజనీరింగ్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సరికొత్త క్షిపణిని తయారుచేశాం. క్షిపణి తయారీలో తేడా వస్తే జరిగే పేలుడు, ఎంత ప్రమాదకరంగా ఉంటుందో తెలుసు కాబట్టి, మా పనికి అడవిని ఎంచుకున్నాం!"

"మేం చేసే పని చెప్తే మాకు మద్దతు రాకపోగా, మమ్మల్ని పిచ్చివాళ్ళుగా చూస్తారు. లేదా భయపడి మా ప్రయత్నాన్ని అడ్డుకుంటారు. అందుకే కన్నవాళ్ళకి కూడా నిజం చెప్పలేదు."

"మా ఒంటిమీద ఉన్న బంగారం, మా పాకెట్ మనీతో పాటు, కొన్ని జాతీయ యువజన సంఘాలనుండి విరాళాలు సేకరించి ఈ యజ్ఞాన్ని ప్రారంభించాం."

"మా క్షిపణి బ్లూ ప్రింట్‌ను, పనితీరును కేంద్ర రక్షణశాఖకు అందచేశాం. మొదట్లో పట్టించుకోకపోయినా, మా పనితీరు చూసి, క్షిపణి సామర్థ్యాన్ని అంచనా వేసి, వారు మమ్మల్ని ప్రోత్సహించారు."

"యువతరం అంటే మొబైల్ ఫోన్లకి బానిసలు, ప్రేమకు దాసులు, అమ్మాయిల వెంట ఆకతాయిగా తిరిగే వాళ్ళు అనే మీ అభిప్రాయాన్ని దయచేసి అందరికీ రుద్దకండి!"

"స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్, శివరాం రాజ్ గురు, మంగళ్ పాండే, ఖుదీరామ్ బోస్, రామ్ ప్రసాద్ బిస్మిల్, బాజిరౌతు, ఝాన్సీలక్ష్మీబాయి... అందరూ పాతికేళ్ళు నిండని మా యువతరమే!"

"క్రికెట్‌లో దేశానికి కీర్తిని గడించిన సచిన్ టెండూల్కర్, వీరేంద్ర శెహవాగ్ ఆటలో అడుగుపెట్టేనాటికి ఇరవయ్యేళ్ళు నిండని మా యువతరమే!"

"దేశంపట్ల మీకు బాధ్యత లేదా? అని మమ్మల్ని అడిగేవారిని మేము ఒక ప్రశ్న అడుగుతున్నాము. అసలు దేశం కోసం మీరేం చేస్తున్నారో ఆత్మ పరిశీలన చేసుకోండి."

"సింధూర్ లాంటి సందర్భాలలో, సైనికుల త్యాగం గురించి వాట్సప్‌లో పోటీలు పడి పోస్ట్‌లు పెట్టి చేతులు దులుపుకుంటే ఘనకార్యం చేసినట్టు కాదు. దానివల్ల సైనికులకి ఒరిగేదేమీ ఉండదు!"

"రైళ్ళల్లో, బరువైన పెద్ద బ్యాగులు, ట్రంకు పెట్టెలతో, రిజర్వేషన్ లేక, వందల కిలోమీటర్లు ప్రయాణిస్తూ మన కళ్ళ ముందు అవస్థ పడుతుంటే... మీలో ఒక్కరైనా మీ బెర్త్ ఇచ్చారా? కనీసం మీ బెర్త్ పైన కూర్చోటానికి చోటిచ్చారా? బరువైన వారి లగేజీ దించకోవటంలో ఎప్పుడైనా సహాయం చేశారా?"

"సైనికుల జీతానికి ఆదాయపు పన్ను మినహాయించాలనే వాదనకు మీ మద్దతు తెలిపారా? సైనిక దినోత్సవాన్ని ఎప్పుడైనా నిర్వహించారా? వీరమరణం పొందిన సైనికుల కుటుంబసభ్యులకు ఒక పూట భోజనం పెట్టారా? కలిసి పరామర్శించారా?"

"యువత గురించి చులకనగా మాట్లాడే ముందు... పెద్దరికం ఏం చేస్తుందో గుర్తు చేసుకోవాలి. మాలాంటి వారికి మీ మద్దతు, ప్రోత్సాహం, మీ అనుభవంతో దిశానిర్దేశం కోరుకుంటున్నాం."

"సరైన మార్గదర్శకాలు, రక్షణవ్యవస్థ లేకుండా మేము చేసే పని, మా ప్రాణాలకు ప్రమాదమని మాకు తెలుసు. దేశసరిహద్దుల్లో నిరంతరం ప్రమాదంతో పోరాడే సైనికులకు, ఉడుతాభక్తిగా సాయపడటానికి మమ్మల్ని మేము బలిచేసుకోటానికి సిద్ధమయ్యాం. నిన్నటితో మా క్షిపణి తయారీ పూర్తి అయ్యింది. కేంద్ర సాంకేతిక బృందం ఈరోజు ఇక్కడికి రాబోతుంది. ఆ హడావిడిలో వేగంగా పనిచేస్తుంటే, పక్కగదిలో ఉన్న కొన్ని రసాయనాలు కలిసి పోయి, విషవాయువులు ఏర్పడ్డాయి. మేము స్పృహ కోల్పోయాం!"

ఒక్కసారిగా అక్కడ సూది పడితే వినిపించే నిశ్శబ్దం. మీడియావారు అందరూ నిశ్చేష్టులయ్యారు. లేచి చప్పట్లు కొట్టారు.

"ఇంతకీ మీ క్షిపణి పేరు?" ఒక రిపోర్టర్ అడిగాడు.

"3G 3B"

"అంటే?"

"దేశ రక్షణలో మా యువతరం ప్రాతినిధ్యం ప్రతిబింబించేలా... ఆ పేరు పెట్టాం. '3G 3B' అంటే 3 గర్ల్స్, 3 బాయ్స్!"

# నాగిరెడ్డన్న

వారణాశి భానుమూర్తి రావు

*'ఏందంటే నాగిరెడ్డన్న వాళ్ళ బాయిలో దూకి సచ్చి పోయినాడంట. ఎవరో రాళ్లతో కొట్టి సంపేసినారంట!'*

*పల్లిలో ఎక్కడ సూసినా జనాలు ఇదే మాట్లడుకొంటా ఉండారు.*

*"నీ మొగుడే సంపేసి నాడంటనే ఎంకట లక్ష్మి... పల్లిలో అందరు అనుకొంటా ఉండారు!"*

*అంది పక్కింటి అత్తమ్మ. అమ్మకు, నాయనకు ఒళ్ళంతా కంపరం మెత్తింది.*

*గడగడమని వణికిపోతున్నారు. వాళ్లను చూసి నాకు ఒక్కటే గుక్కిళ్లు తిప్పుకోకుండా ఏడుపు!'*

మా రాచపల్లిలో మా రైతులకు ఆరు గాలం శ్రమించినా ఫలితం అంతంత మాటే! వర్షాలు బాగా పడితే, సెనిక్కాయల పంట సేతి కొస్తే, ఏదో కొన్ని దుడ్లు సేతి కొస్తాయి. లేదంటే ఆ సంవత్సరము దరిద్రమే!

'జూన్, జులై నెలల్లో తొలకరిజల్లులు కురిస్తే దుక్కి, దున్ని మెల్లగా గింజల్ని నాటితే, నవంబర్ డిశెంబర్ నెలలో పంట సేతి కొస్తుంది' అని మా నాయన అనేవాడు. ఆ ఇంగ్లీసు నెలలు నాకర్దమయ్యేది గాదు. తెలుగు నెలలు అయ్యవార్లు నేర్పించినా ఒక రాగాన అర్థం అయ్యేది గాదు.

అర్థం కాలేదంటే 'మొద్దు ముండా కొడకా' అని మా సారు తిట్టేవాడు.

సైత్రము, వైశాకము, జేట్టము, ఆసాఢము, శ్రావణము, బాత్రపదము, ఆస్వయుజము, కాత్తికము, మార్గశిరము, పుస్యము, మాగము, పాల్గునము అని తప్పులు సెప్పేవాణ్ణి. 'క్రమం తప్పకుండా సెప్పినావు గాని సామీ, తప్పులు సెబుతున్నావు' అనే వాడు మా సార్.

ఎన్నిసార్లు మా సార్ నేర్పించినా నా నోరు తిరిగితే గదా? 'పెద్ద క్లాసులకు పోతే సరిగా సెబుతావులే' అనేవాడు మా సారు.

మా నాయన్ని నేర్పించమని అడిగినా ఒక్క రోజు! ఆయన కొస్తే గదా నాకు నేర్పించేదానికి! అయన నోరు ఇప్పితే అన్ని బూతులే! ఆయప్ప సదివింది ఐదవ తరగతే!

'పెద్ద బాలసిక్ష అంతా గట్టం కొట్టినా, పదహార్లు సార్లు తిరగేసి చదివినా!' అని బొంకాలు పోతాడు మా నాయన.

మా పల్లిలో జనవరి సంకురాత్రి పండగ రోజు నుండి మళ్ళీ వానలు పడే దాకా ఏమి పనులుండవు జనాలకి! ఊరకే రచ్చబండ కాడ కూర్చొని, బీడీలు తాగుతూ లోకాభిరామాయాణం మాట్లాడుకొంటా ఉంటారు. పొద్దుపోక కొందరు పేకాట ఆడతా ఉంటారు. అదేందో ఇడిసిపెట్టే ఆకుల ఆట అనేవాళ్ళు! పొద్దు పోలేదని ఆ ఆట వ్యసనం కింద అయిపోయి, స్యానా మంది దుడ్లు పోగొట్టుకున్నారు. ఆస్తులు గూడా అమ్మేసుకోని పిలేటికి, తిరపతికి పోయి, పేకాట ఆడేవాళ్ళు. ఇంట్లో ఆడోల్లు ఒక్కటే ఏడుపు!



మా అమ్మ, మా నాయనకు ముందుగానే స్ట్రాంగ్ వార్నింగు ఇచ్చింది... పిల్లోడి బతుకు నాశనం సెయ్యొద్దు అని! పేకాట, తాగుడు సెయ్యనని నా మీద పెమానం సేయించుకోనింది మా యమ్మ. మా నాయన్నీ ఎట్లనో ఒకట్ల పేకాట ఆడించాలని స్యానామంది పిలిసేవారు. కానీ మాయమ్మకిచ్చిన పెమానానికి భయపడేవాడు మా నాయన!

నేను ఆ ఆట ఎట్లా ఆడతారో అని అక్కడకు బోయి, తొంగి తొంగి చూసేవాడ్ని. 'రేయ్ సామి, రారా ఆడదాము... మీ నాయన్ని పిలుసుకొని రా!' అనేవాళ్ళు.

నాకు బయమెత్తుకొని ఒక్కటే పరుగు!

నేను కొంచెం పెద్దయినాక తిరుపతి ఎంకన్న మీద పెమాణికమో ఏమో... నాకు ఆ ఆట ఆడేదానికి రానేలేదు. మా ఆస్తులన్నీ తగలబెట్టనే లేదు.

ఒక్కరోజు నేను, మా నాయన ఇంట్లో కూసోని ఉంటే, నాగిరెడ్డన్న రొప్పుకొంటూ వచ్చినాడు. ఆయప్ప ఒక్కటే గస పోతా ఉన్నాడు.

"ఏమయ్యిది నాగిరెడ్డి? ఎందుకలా గస పోసుకొంటా ఉండావు? ఇందా... నీళ్లు తాగు?" అని కుండలో నీళ్లు తెచ్చి ఇచ్చినాడు మా నాయన.

"ఏమి లేదన్న. మా అమ్మికి బొత్తిగా ఒళ్ళు బాగాలేదు. ఒక్కటే జ్వరము. బేదులు, వాంతులు. మహల్లో సర్దార్ ఖాన్ ఆసుపత్రికి తీసుకోని పోవల్ల. లేకుంటే అమ్మి నాకు దక్కదన్నా" అని మా నాయన చేతులు పట్టుకొని ఏడ్సినాడు నాగిరెడ్డి.

"నేనేమి సేయాల నాగిరెడ్డి. బండి ఎద్దులు రడీగా ఉండాయి. నేను తోడు వస్తాను. పదా మాలుకి" అన్నడు మా నాయన.

"నా ఎద్దల బండి ఉందన్నా! నాకు అర్జెంటుగా ముప్పై రూపాయలు గావాల! అమ్మిని ఆసుపత్రికి తీసుకోని బోవల్ల. ఇంట్లో దుడ్లు లేవు. దుడ్లు నీకు రేపు బుధవారం సంతలో కూరగాయలు అమ్మి నీకు ఇచ్చేస్తా! ఈ సహాయం సెయ్యన్నా! నీ కాళ్ళు పట్టుకొంటాను. అమ్మి పరిస్థితి స్యానా గోరంగా ఉంది." అన్నడు నాగిరెడ్డన్న ఏడుస్తూ!

మా నాయనకి దుక్కం ఆగింది గాదు. ఎంటనే ఇంట్లోకి పోయి ట్రంకు పెట్టలో ఉన్న ముప్పై రూపాయలు తెచ్చి ఇచ్చినాడు.

నాగిరెడ్డన్న దుడ్లు తీసుకొని ఒక్కటే పరుగు!

"పాపం... ఆ అమ్మికి ఎట్లా ఉందాదో ఏమో!" అని మా నాయన గుడ్ల నీరు తుడుసుకొన్నాడు.

ఈ కథంతా జరిగినప్పుడు మాయమ్మ ఇంట్లో లేదు. అప్పుడే సేన్లోకి బోయి పశువుల మేత కోసం పచ్చిగడ్డి మోపు, నెత్తిన బెట్టుకొని వచ్చింది.

నేను జరిగిన కథంతా మా యమ్మకు పూస గ్రుచ్చినట్లు సెప్పినా!

మా యమ్మ గంగమ్మ తల్లి పూనకం వచ్చినట్లు ఒక్క ఎగురు ఎగిరింది.

"ఏమయ్యా... నువ్వు తెలిసి తెలిసి నాగిరెడ్డికి అప్పు ఇచ్చినావు. అతను ఎలాంటివాడో నీకు తెలీదా?" అని ముక్కు సీమిడి కొంగుతో తీసుకోని ఏడ్చేదానికి రెడీ అయింది.

"పాపం నాగిరెడ్డన్న వాళ్ల అమ్మికి బాగాలేదు. సహాయం సేస్తే తప్పేమి? రేపు మహాల సంతలో అప్పు తిరిగి ఇచ్చేస్తా నన్యాడు" అన్నాడు మా నాయన.

"నాగిరెడ్డన్న కథ నీకు తెలియంది గాదు. తిరుగుబోతు, తాగుబోతు! పేకాటలో ఆస్తులన్నీ తగలబెడుతున్నాడంట !" అన్నింది మాయమ్మ .

"అదంతా యేమిలేదు గాని... బుధవారం సంతలో ఇస్తాడ్లే!" అన్నాడు మా నాయన.

ఆ రాత్రంతా మా నాయనకు, మా అమ్మకు నిద్ర పట్టనేలేదు.

★★★

బుధవారం మహల్ సంతలో నాగిరెడ్డన్న కోసం ఎంత వెతికినా కనబడనే లేదు.

ఒక నెల, రెండు నెలలు అన్న జాడే లేదు. మా నాయనకు కనబడకుండా తప్పించుకొని తిరుగతా ఉండాడు.

మా నాయన కాళ్లకు బలపం కట్టుకొని తిరగతా ఉండాడు.

"మహాల్ క్రాస్‌రోడ్‌లు ఇసిపెట్టే ఆకులు ఆడతా ఉండాడన్న! అక్కడకి బోతే మీకు దొరుకుతాడు!" అన్న్యాడు మా సాకలి ఎంకట్రాముడు .

పరుగెత్తుకొని మా నాయనా, నేను ఎల్లినాము. అక్కడ నాగిరెడ్డన్న పేకాట ఆడతా ఉండాడు.

"ఏమయ్యా... పెద్దమనిషి! అప్పు తీసుకోని ఎగ్గొడతావా? అమ్మి పేరు సెప్పి పేకాట ఆడతా ఉండావా? నా దుడ్డు నాకిస్తావా... లేకుంటే ఊర్లో పంచాయితీ పెట్టించమంటావా?" మా నాయన కోపంగా అరచినాడు నాగిరెడ్డన్నను.

"అన్న... కోపం చేసుకోకు! రేపు సాయంకాలం నీ అప్పు తీర్చేస్తా! ఇక్కడ గలాటా సెయ్యకు. నా మానం బోతుంది. నీ అప్పు ఎగ్గొట్టనులే అన్నా!" అని మా నాయన రెండు సేతులు పట్టుకొన్యాడు నాగిరెడ్డన్న.

పది రోజులయినా నాగిరెడ్డి పత్తా లేదు.

ఒకరోజు సాయంకాలం వాళ్ళ మడిలోని బావి కాడ, కపిలతో నీళ్లు చేదుతున్న నాగిరెడ్డన్నను కలిసినాడు మా నాయన.

ఏమి గలాటా అయ్యిందో... రకతం వచ్చేటట్లు కొట్టుకున్నారు అంట... మా నాయన, నాగిరెడ్డన్న.

ఇంటికి వచ్చిన మా నాయన్ను చూసే సరికి మాయమ్మ, నేను ఒక్కటే ఏడుపు! రక్తం కారే సేతులు, ఎర్రగా వాసిన సెంపలు. ఇద్దరూ బాగా కొట్టుకొన్నట్లు ఉండారు.

అమ్మ ఏదో ఆకు పసర్లు, పసుపు తెచ్చి రుద్దుతోంది.

అమ్మ ఒక్కటే శాపనార్థాలు.

"వద్దంటే ఇస్తివే. మనకే ఎందుకీ అవస్థ బగమంతుడా!" అని పాట పాడుతున్నట్లుగా ఏడుస్తోంది.

తెలవారుతూనే ఒక భయంకర వార్త ఇనాల్సి వచ్చింది మాకు.

'ఏందంటే నాగిరెడ్డన్న వాళ్ళ బాయిలో దూకి సచ్చిపోయినాడంట. ఎవరో రాళ్లతో కొట్టి సంపేసినారంట!'

పల్లిలో ఎక్కడ సూసినా జనాలు ఇదే మాట్లడుకొంటా ఉండారు

"నీ మొగుడే సంపేసి నాడంటనే ఎంకట లక్ష్మి... పల్లిలో అందరు అనుకొంటా ఉండారు!" అంది పక్కింటి అత్తమ్మ .

అమ్మకు, నాయనకు ఒళ్ళంతా కంపరం మెత్తింది. గడగడమని వణికి పోతున్నారు. వాళ్లను చూసి నాకు ఒక్కటే గుక్కిళ్లు తిప్పుకోకుండా ఏడుపు!

"మా ఆయనకు ఏమీ తెలీదత్తా... నిన్న కొట్టుకొన్నారు అంట ఆ బావి కాడా!" అంది మాయమ్మ ఏడుస్తా.

"ఏమోనమ్మ... ముప్పయి రూపాయలు బాకీ ఉండాడని, నీ మొగుడు నాగిరెడ్డిని సంపేశాడని అందరు అనుకొంటా ఉండారు. కలకడ నుండి పోలీసోళ్ళు వచ్చేదాకా ఏమి తెలీదంటా!" అంది అత్తమ్మ.

పోలీసోళ్ళు అనగానే మా నాయన తెలివితప్పి కింద పడిపాయ. మా యమ్మ ఏడ్సుకొంటా ముగాన నీళ్లు సల్లే.

నేను ఏడ్సుకొంటా, "నాయనా లెయ్యి... మనకేమి కాదులే" అన్యాను.

మా నాయన నన్ను హత్తుకొంటూ సిన్నపిల్లోడిలా ఏడ్సినాడు.

నాలుగైదు రోజులయినా మేము ఇల్లే ఇడిసి బయటకు రాలా.

పోలీసోళ్ళు వచ్చి మమ్మల్ని కలకడ పోలీసు టేషన్‌కి తీసుకెళ్తారేమో అని బయ్యం.

సాకలి ఎంకట్రాముడు ఏట్లో గుడ్డలు ఉతకడానికి ఇంటికి వచ్చాడు.

"గుడ్డలున్నాయా అమ్మా?" అని కింద కూసోని అన్నాడు.

అమ్మ పెద్ద మాసిపోయిన గుడ్డల మూట ముందర తెచ్చి పెట్టింది.

"ఒక్కటి... రెండు... మూడు..." సాకలి ఎంకట్రాముడు లెక్క ఏసుకొంటున్నాడు గుడ్డల్ని.

అమ్మ ఉండబట్టలేక నాగిరెడ్డన్న ఇసయం అడిగింది.

ఎంకట్రాముడు నవ్వేసి "నాగిరెడ్డన్న సావా లేదు, గీవా లేదమ్మా ! అప్పులు ఎక్కువ చేసి అట్లా పుకారు పుట్టిచ్చాడంటా... ఎక్కడో మదనపల్లి తాగి తందానా లాడతా ఉండాడంట!"

అమ్మయ్య... అని ఊపిరి పీల్సుకోని సచ్చినాము మేము.

అంతే... నాగిరెడ్డన్న ఊర్లోకి వచ్చినా మేము అప్పు అడగానే లేదు.

నాగిరెడ్డన్న అప్పు బాకీ ఇస్తానని సెప్పలేదు. దర్జాగా సిల్కుజుబ్బా ఏసుకొని తిరుగుతున్నాడు నాగిరెడ్డన్న.

మా ముప్పై రూపాయలు మావి కావు అని అనుకొన్న్యాము... అంతే!

# సమయపాలన

కె.వి. లక్ష్మణరావు
✆ 9014659041

కథామంజరి బాల కథ

***సమయమంతా, వృథా చేశారు. సమయం విలువ తెలిసి రావాలనే, సమావేశం ఏర్పాటు చేశాను. శ్రమపడితే ఆహారం సంపాదించ వచ్చు. కానీ గడచిపోయిన క్షణం, ఎంత కష్టపడినా తిరిగి సంపాదించలేము. ఇప్పుడు చెప్పండి. సమయాన్ని వృథా చేసింది, మీరా? నేనా?"***

అడవిలో అత్యవసర సమావేశం జరుగుతోంది.

సమావేశానికి రాకపోతే మృగరాజు ఊరుకోరన్న భయంతో, ఏనుగు నుండి ఎలుక వరకూ అన్ని జీవులూ అక్కడకు వచ్చాయి. వాటి కెదురుగా బండ మీద సింహం కూర్చుని ఉంది.

"అందరూ వచ్చారు. అత్యవసరంగా రమ్మనడానికి కారణం చెప్పండి మృగరాజా!" మంత్రి కుందేలు, సింహంతో అంది.

కానీ సింహం, కుందేలుకు బదులీయలేదు.

అరగంట దాటింది.

ఉలుకూ పలుకు లేకుండా, సింహం అలాగే ఉండే సరికి, అక్కడున్న జీవులు, ఒక్కసారిగా అసహనానికి గురయ్యాయి.

"ప్చ్! ఇంటివద్ద ఎన్నో పనులున్నాయి. అన్నింటినీ వదిలేసి వచ్చాను. సమయం, వృథా!" కుందేలు, జింకతో నెమ్మదిగా అంది.

"నేనూ అంతే. పనులన్నీ వదిలేసి వచ్చాను" అంటూ జింక కూడా బదులిచ్చింది.

"గున్నఏనుగును ఒంటరిగా వదిలేసి వచ్చాను. అక్కడది ఏమల్లరి చేస్తోందో?" ఏనుగు, ఎలుగుబంటితో, మెల్లగా అంది.

"నాదీ, అదే పరిస్థితి!" ఎలుగు కూడా బదులిచ్చింది.

అలా... అన్ని జీవులూ, 'వాటి విలువైన సమయాన్ని, సింహం హరించిందనుకుంటూ' గుసగుసలాడుకోసాగాయి.

ఆ నోట, ఈ నోట నుండి, ఆ మాటలు సింహం చెవిన పడ్డాయి.



"మీ సమయాన్ని నేను, వృథా చేశానా?" గట్టిగా అరుస్తూ సింహం లేచింది.

అడవి జీవులన్నీ, ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి.

"వేసవిలో నీటికరువు ఏర్పడటం సహజం. కానీ అప్పుడప్పుడూ వర్షాలు పడటం నిజం. అటువంటి వర్షాలు పడక ముందే, నీరు వృథాగా పోనీయకుండా, నీటికుంటలు తవ్వాలి. ఆ నీటిని ఒడిసిపట్టాలి! అవునా? కాదా?"

"అవును, మృగరాజా!" జంతువులన్నీ, సింహం కేసి భయంగా చూస్తూ జవాబిచ్చాయి.

"నీటికుంటలు తవ్వమని, ఒక్కరోజు శ్రమదానం చేయమని పిలిస్తే, నిన్న మీరంతా ఏమిచేశారు?"

"కుంటలు తవ్వాం కదా మృగరాజా!" ఎలుగు కొంచెం భయంతోనే బదులిచ్చింది.

"నాలుగు కుంటలు కూడా తవ్వలేదు. ఎలుగు ఏనుగు, జింక కుందేలు... ఇలా జతలు జతలుగా, కబుర్లు చెప్పుకున్నారు. పనిని పక్కన పెట్టారు. సమయమంతా, వృథా చేశారు. సమయం విలువ తెలిసిరావాలనే, సమావేశం ఏర్పాటు చేశాను. శ్రమపడితే ఆహారం సంపాదించవచ్చు. కానీ గడచిపోయిన క్షణం, ఎంత కష్టపడినా తిరిగి సంపాదించలేము. ఇప్పుడు చెప్పండి. సమయాన్ని వృథా చేసింది, మీరా? నేనా?" సింహం అడిగేసరికి, 'తప్పు మాదే' అంటూ, జీవులన్నీ ఒప్పుకున్నాయి.

"మా తప్పును సవరించుకుంటాము. ఈ రోజు శ్రమదానం చేస్తాము" అంటూ ఏనుగు ముందుకొచ్చింది.

"ఏనుగు నిర్ణయమే, మా నిర్ణయం!" అంటూ, ఎలుగు, కుందేలు... అన్ని జీవులూ ముందుకొచ్చాయి.

జీవుల్లో వచ్చిన మార్పుకు, మృగరాజు చాలా సంతోషించింది.

# కాకి ఆనందం

పైడిమర్రి రామకృష్ణ
✆ 92475 64699

కథామంజరి బాల కథ

***మిత్రమా! మన ఆకారం మనకు అద్దంలో అందంగానే కనబడుతుంది, అదే ఆకారం ఇతరులకు అందమనిపించడం కొంత కష్టమే! అలాగే మనం చేసే పనులు మనకు బాగానే అనిపిస్తాయి. కానీ, ఆ పనులు ఇతరులకు కూడా బాగనిపించాలన్నది మరవకూడదు!"***

అనగనగా ఒక అడవిలో ఒక కాకి ఉండేది. అది ఒకసారి పక్క అడవిలో ఉండే తన చెల్లెల్ని చూడటానికి వెళ్లింది. అక్కడ ఒక చెరువు కనిపించి దాహం తీర్చుకుంది. చెరువు ఒడ్డున, ఒక నెమలి పురివిప్పి ఆనందంగా నాట్యం చేస్తూ కనిపించింది. చెరువులోని బాతు, తాబేలు, మొసలి... నెమలి నాట్యాన్ని చూసి సంతోషపడ్డాయి. దాహం తీర్చుకోవడానికి వచ్చిన ఇతర జంతువులు కూడా నెమలి నాట్యాన్ని మెచ్చుకున్నాయి!

నెమలి ఆనందించింది.

కాకి, "మిత్రమా! నేను పక్క అడవినుంచి మా చెల్లెల్ని చూడటానికి ఈ అడవికి వచ్చాను. నువ్వు ఎందుకు ఇలా చెరువు దగ్గరికి వచ్చి నాట్యం చేస్తున్నావు?" అని అడిగింది.

ఆ మాటకు నెమలి, "నాకు ఇలా పురివిప్పి నాట్యం చేయటం ఆనందం కలిగిస్తుంది. నా నాట్యం చూసి ఇతరులు కూడా సంతోషపడతారు. అందుకే నేను ప్రతి రోజూ సాయంత్రం చెరువు దగ్గరికి వచ్చి, నా ప్రతిబింబాన్ని చెరువులో చూసుకుంటూ నాట్యం చేస్తాను!" అంది నెమలి.

కాకి కూడా తన ఆనందం కోసం తన అడవికి వెళ్లాక పాడుతూ, నాట్యం చేయాలనుకుంది. అడవిలో ఇతర జీవుల మెప్పు పొందాలనుకుంది.

కాకి తన అడవికి చేరాక, చెరువు దగ్గరికి వెళ్లింది. చెరువులో తన ప్రతిబింబాన్ని చూసుకొని మురిసిపోయింది. కీచుగొంతుతో పెద్దగా అరుస్తూ, ఎగరసాగింది. అలా చేయడంలో కాకి ఆనందం పొందింది. అది ఇతరులకు ఇబ్బంది కలిగించింది.

చెరువులో ఉన్న బాతు, తాబేలు, మొసలి బయటికి వచ్చాయి.

"నీకు పిచ్చి గాని పట్టిందా? ఏంటా ఎగురుడు? ఏంటా అరుపులు?" అంది బాతు.



“మిత్రమా! మీరు నా పాటని విని, నాట్యాన్ని చూసి సంతోషపడండి! మీ సంతోషం కోసమే నేను ఇలా నాట్యం చేస్తున్నాను!” అంది కాకి.

“నీది నాట్యంలా లేదు! పిచ్చి పట్టి ఎగురుతున్నట్లుగా ఉంది!” అంది తాబేలు.

“నా ఆటా, పాటా మీ సంతోషం కోసమే!” అంది కాకి.

“ఒరేయ్.. నీ ఆటా, పాటా నీ ఇంట్లో చేసుకో! ఇలా చెరువు దగ్గరకు వచ్చి మమ్మల్ని ఇబ్బంది పెట్టకు! ముందు ఇక్కడ నుంచి నడు!” అంది కోపంగా మొసలి.

ఇదంతా చెట్టు నుంచి చూస్తుంది కోతి. చెట్టు దిగి కాకిని చేరుకుని, “మిత్రమా! మన ఆకారం మనకు అద్దంలో అందంగానే కనబడుతుంది, అదే ఆకారం ఇతరులకు అందమనిపించడం కొంత కష్టమే! అలాగే మనం చేసే పనులు మనకు బాగానే అనిపిస్తాయి. కానీ, ఆ పనులు ఇతరులకు కూడా బాగనిపించాలన్నది మరవకూడదు!” అంది కోతి.

కాకి ఆలోచించటం మొదలు పెట్టింది.

“మిత్రమా! రంగురంగుల పురి విప్పి నెమలి నాట్యం చేస్తే... దాని శరీర నిర్మాణం నాట్యానికి సహకరించి మనకు సంతోషం కలిగిస్తుంది! అది దాని ప్రత్యేకత. మన ప్రత్యేకతలు మనకున్నాయి. ఇతరులను అనుకరించటం వలన మన విలువ పోగొట్టుకుంటాం!” అంది కోతి.

కాకికి తన తప్పు తెలిసింది. తన ఆనందం కోసం ఇతరులను ఇబ్బంది పెట్టకూడదని తెలుసుకున్న కాకి మరెన్నడూ పాడుతూ, నాట్యం చేయలేదు!

# నీరెండ నీడ

## వడలి రాధాకృష్ణ

**విశిష్ట అతిథి కథ**

***తాము పనిచేస్తున్న పట్టణంలోని ఉద్యోగాలతో పోల్చితే వీరికొచ్చే ఆదాయం నామమాత్రం. కానీ వీళ్ళకు తాము చేస్తున్న పనుల పట్ల విసుగు గాని, అసంతృప్తి గాని చెందడం లేదు. అన్నిటా తీయని తలపులతో మమేకమైపోయి ఉన్నారు. నాలుగురోజుల వరుసగా ఆఫీసుకు వెళ్ళగానే సెలవు ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురుచూసే తమకు... ఎప్పుడు తెల్లవారుతుందా, పొద్దుపొడుస్తుందా... ఎప్పుడు పనిలోకి వెళ్దామా అని ఆత్రుత పడే ఈ పల్లెజీవులకు చాలా తేడా ఉందనిపిస్తోంది.***

బెంగళూరు నుండి శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరిన సమయంలో ఏమీలేదు. తీరా రైలు బయలుదేరిన రెండుగంటల తరువాత వర్షం మొదలైపోయింది. అలా అక్కడ ప్రారంభమైన చిన్నవర్షం ఇక్కడ స్టేషన్లో దిగేసరికి పెద్దదయి, కుండపోతగా మారిపోయింది.

ఇక్కడినుండి ఎంతో దూరం ప్రయాణం చేస్తేనే గాని అడవివరం రాదు. ఇప్పుడు ఎలాగో అర్థం కావడం లేదు. ఆయన కాదన్నా ఇలా ఒంటరిగా బయలుదేరి వచ్చేయడం... అంజనకు ఏమీ తోచటంలేదు. కాసింత కంగారుగా అనిపిస్తోంది. అయినా చిన్నగా నవ్వుకుంది.

విషయం పునరావృతం కావడం అంటే ఇదేనేమో. అప్పట్లో తమ పెళ్లి జరిగింది కూడా అడవివరంలోనే. సరిగ్గా తమ పెళ్లిరోజు కూడా ఇలానే విపరీతమైన కుంభవృష్టిగా కురిసింది.

అంజనకు ఆశ్చర్యంగా ఉంది. ఇన్నాళ్లకు మరల ఆ చిన్న ఊరును చూడటానికి వెళుతోంది. అదే తమ అత్తారి ఊరుకు వెళ్లే అవకాశం వచ్చింది. మాధవరావు ఓ పట్టాన బయలుదేరే మనిషి కాదు. అందునా అడవివరం అయితే మరీను. అస్సలు రావడానికి ఒప్పుకోడు.

గతంలో ఒకటి రెండుసార్లు వెళ్దామని చెప్పి చూసింది. అదే మీ పుట్టి పెరిగిన ఊరును చూపించమని కోరింది. మాట దాటవేశాడు కానీ వెళ్దామన్న మాట అతగాడి నోట రాలేదు. అంజన మిన్నకుండిపోవడం తప్ప ఏమి చేయలేక పోయింది.

మొత్తానికి ఆయన గారి బాల్య స్నేహితుడు చంద్రరావు కూతురు పెళ్లి పుణ్యమా అంటూ ఇప్పుడు అడవివరానికి వస్తోంది.

“ఆఫీసులో ఇన్స్పెక్షన్ ఉంది. అక్కడ చంద్రరావు చాలా మంచి మనిషి. పైగా నా చిన్ననాటి స్నేహితుడు. అతగాడి కూతురు పెళ్లికి వెళ్లి తీరాల్సిందే. నాకు ఆఫీసులో ఇక్కడ కదిలే పరిస్థితి లేదు. కనీసం నువ్వైనా వెళ్లి పేరు అప్పగించి వస్తావని…”

తన పెళ్లి జరిగిన ఊరును చూసి రావడం తనకూ ఇష్టమే. పైగా ఎక్కడో హైదరాబాదులో పుట్టి పెరిగిన తనకు ఈ అడవివరం వాతావరణం కొంత ఇష్టం కూడా.



ఇక తమ పెళ్లి అప్పట్లో అడవివరంలో జరిగిన సందర్భాన్ని తలుచుకొని ఎంతగానో పొంగిపోతుంది అంజన.

స్టేషన్లో దిగిన తరువాత రిసీవ్ చేసుకుందుకు ఎవరైనా వస్తారేమోనని ఎదురు చూసింది. ఆ జాడ ఏమీ కనిపించడం లేదు. అదే విషయాన్ని బెంగుళూరులోని భర్తకు ఫోన్ చేసి చెప్పింది.

“చెబితే వినకపోతివి. ఆ అడవివరం నిజంగా ఓ ఆడవి. సదుపాయాలు ఏమీలేని ఫక్తు పల్లెటూరు. పైగా ఇప్పుడు వాతావరణం అనుకూలించడం లేదు. నీ మాట అటుంచి నాకు ఇక్కడ టెన్షన్ అమాంతం పెరిగిపోతోంది.”

చెప్పాలంటే ఒక విధమైన ఇష్టంతో ఇక్కడకు బయలుదేరింది తాను. కష్టమైనా వెళ్లి తీరుతుందంతే!

వర్షంలో తడుస్తూ బురదరోడ్డు మీద నడుచుకుంటూ అలా బస్టాండుకు చేరుకోవడం తనకు కొత్త అనుభవం. అదృష్టం బాగుంది అడవివరం వెళ్లే బస్సు సరిగ్గా అప్పుడే బయలుదేరుతోంది.

'హమ్మయ్య' అనుకుంటూ సీట్లో కూలబడింది. హైదరాబాదులోని తాను అప్పట్లో మాధవరావుతో ప్రేమలో పడటం... తమ పెళ్లి విషయం పెద్దల దృష్టికి తీసుకెళ్లినప్పుడు మొదట్లో వారు అంగీకరించకపోవడం జరిగింది. తరువాత పరిస్థితులను అర్థం చేసుకుని అటువైపు వారు ఇటువైపు వారు వివాహం చేయడానికి సమ్మతించినా, ఆ కాలంలోని పల్లెటూరు కట్టుబాట్ల రీత్యా ఊరిలోని మోతుబరులు పెళ్ళికి సమ్మతించలేదు.

ఊరిలోని కట్టుబాట్లంటూ, తమ ఆచారాలంటూ అడవివరంలో వాటికి అనుగుణంగా నడుచుకుని తీరాల్సిందే అంటూ ఖచ్చితమైన తీర్మానాలు చేసేశారు.

కొడుక్కి ఇచ్చిన మాట ప్రకారం వరదయ్య అంజన, మాధవల వివాహాన్ని అడవివరంలో నిరాడంబరంగా జరిపించేసాడు. దానితో వరదయ్య కుటుంబాన్ని శాశ్వతంగా ఊరు నుండి వెలి వేశారు.

తన దిగువ మధ్యతరగతి జీవితాన్ని అంతవరకు అతి కష్టం మీద నెట్టుకుంటూ వచ్చిన వరదయ్య ఈ హఠాత్ పరిణామంతో ఊరును ఖాళీ చేసి కొడుకు చెంతకు చేరక తప్పింది కాదు.

కొన్నాళ్ల తర్వాత కొడుకు ఉద్యోగం చేసుకుంటూ స్థిరపడిన బెంగుళూరులోని కాలం చేశాడు. అమ్మానాన్నలు కాలం చేసిన తర్వాత, పుట్టిన ఊరు మీద మమకారం స్థానంలో ఓ విధమైన ఏహ్యాభావన మాధవరావులో పెరిగిపోయింది. అడవివరం మీదా, అక్కడ ఉన్న ఆచారాల మీద నమ్మకం క్రమంగా సన్నగిల్లసాగింది.

విషయాన్ని మననం చేసుకుంటున్న అంజన అంతరంగం కుదుటపడుతున్నట్లు ఉంది. పేదరికాన్ని తట్టుకుంటూనే కష్టపడి చదువుకొని పైకి వచ్చిన మాధవరావు... జీవితంలో స్థిరపడిన తరువాత చంద్రరావులాంటి కొంతమంది మిత్రులు తమ ప్రేమ వ్యవహారాన్ని సమర్థింపగలగడం ద్వారా కొంతవరకు సాంత్వన లభిస్తోంది ఇప్పుడు.

ఆ కారణంగానే భర్త రాకపోయినా, ధైర్యం చేసి ప్రయాణం అవుతోంది తాను. పది కిలోమీటర్ల బస్సు ప్రయాణం సాగిందో లేదో ఠక్కున ఆగిపోయింది. ఇక కదలలేనని అది మొరాయిస్తోంది. ఆగడానికి కారణం తెలియడం లేదు.

రాత్రికే చంద్రరావు ఇంట వివాహం కావడంతో కొంత కలత చెందడం అంజన వంతు అవుతోంది. గత నలభై ఎనిమిది గంటలుగా కురుస్తున్న కుండపోత వర్షం పుణ్యమా అంటూ రోడ్డుమీద చప్టా పూర్తిగా నీటిలో మునిగిపోయింది. దానిమీద నుండి వర్షం నీరు పాయలై పారుతోంది. చూస్తుంటే ఆ ప్రవాహం చాలా ఉధృతంగా ఉంది. కొంతమంది బస్సులో ప్రయాణిస్తున్న వారు స్థానికులు కావడంతో, అలవాటైన విషయాన్ని పెద్దగా లెక్క చేయడం లేదు.

కానీ అంజన పరిస్థితి అలాగ లేదు. భర్తకు విషయాన్ని తెలియజేస్తూనే ఉంది.

"చంద్రరావు గారితో ఫోన్ చేసి మాట్లాడాను. మనిషిని పంపుతానన్నారు."

"నేనూ చేస్తూనే ఉన్నాను. నెంబర్ దొరకడం లేదు." భార్య అసౌకర్యం అక్కడ మాధవరావు లోని బాధను పెంచుతూనే ఉంది. కొందరైతే తమ సరుకుల్ని, బ్యాగులను తలకెత్తుకుని మొండిగా దాటేస్తున్నారు. వారందరితోనూ ధైర్యాన్ని కూడగట్టుకుని అంజన కూడా ఒకటవ్వక తప్పలేదు.

"రండి మేడమ్! మా మాధవ కూడా పెళ్లికి వచ్చి ఉంటే ఎంతో బాగుండేది!!" వర్షం నీటికావల వచ్చిన మనిషి అభిమానంగా ఆమెను పలకరిస్తున్నాడు.

"తాను కూడా రావాల్సింది! మీకు తెలియందేముంది సెలవు ప్రాబ్లం!!" అవును. మాధవ్ కూడా వచ్చి ఉంటే ఎంతో బాగుండేది.

తనకు ప్రత్యేకంగా విడిదిని ఏర్పాటు చేశారు. పెళ్లి హడావుడి వర్షం అయినా బాగా ఉంది. అటు మగ పెళ్ళివారు, పెళ్లిసందడిలో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. పెళ్లికూతురు అందంగా అచ్చం కుందనపు బొమ్మలాగా ఉండి చూపరులను ఆకట్టుకుంటోంది! పెళ్ళికొడుకు కూడా మంచి హ్యాండ్సమ్‌గా ఉన్నాడు. ఈడూ జోడూ చక్కగా ఉంది.

"ఈ అమ్మాయి మన వరదయ్య కోడలట! ఆ మాధవరావుకి బెంగుళూరులో ఉద్యోగమట. తిండికి ఠికాణా లేకపోయినా వరదయ్య కొడుకుని బాగానే ప్రయోజకుడ్ని చేశాడు."

"పెళ్లికి వాడూ తరలిరావచ్చును. కానీ అప్పట్లో ఊరు వెలివేసింది కదా! అందుకని ముఖం చెల్లి ఉండదు." పెళ్లిలోని అమ్మలక్కల మాటలు అంజన చెవిని పడుతూనే ఉన్నాయి. తనకు కోపం రావడం లేదు. ఇష్టపడి పెళ్లి చేసుకున్నాడన్న నెపంతో తమను ఊరి నుండి వెలివేయడం నవ్వు తెప్పిస్తోంది. దానికి సరియైన అర్థం తెలియని మూర్ఖనైజాలు కొన్ని కానవస్తున్నాయి అక్కడ.

అయినా తమని వీళ్లు వెలివేయడం ఏమిటంట! మాధవరావు తాను ఇష్టపడ్డారు. మనసుల్ని ఇచ్చిపుచ్చుకున్నారు. తరువాత తమ తమ కుటుంబాలను ఒప్పించుకుని వారి అంగీకారంతోనే వివాహం చేసుకున్నారు. కానీ కొంత పరిచయమైన ప్రాంతాన్ని ... ఈ పల్లె సౌకుమార్యాన్ని ... ప్రకృతి సౌందర్యాన్ని పరికించి చూస్తుంటే వారి ఉద్దేశాలు ఇప్పుడు చాలా చిన్నవిగా అనిపిస్తున్నాయి.

అందుకోసం తాము విచారించడం చాలా అవివేకంగా ఉంది. ఊరును చూస్తూ ఉంటే మనసులో వర్షం కురిసినట్లయి హాయిగా ఉంది. విడిది ఇచ్చిన ఇంటి యజమాని వీరబ్రహ్మంగారిని చూస్తూ ఉంటే తెలియని పారవశ్యంతో మమేకమవుతోంది. ఇందాకటి నుండి ఆ పెద్దమనిషిని గమనిస్తూనే ఉంది. తను తన వ్యవసాయం తప్ప వేరే విషయాలు ఏమీ పట్టవులాగా ఉంది. చల్లిన విత్తనాల గురించి, వాడిన ఎరువుల గురించి, పెట్టుబడి రాబడుల గురించి భార్యతో అదేపనిగా ఏకరువు పెడుతున్నాడు.

ఆవిడ కూడా భర్త ఉద్దేశాలకు వత్తాసు తానవుతోంది. అన్యోన్యతకు ప్రతిరూపంగా ఉన్న ఆ ముసలిదంపతుల తీరు అంజనను ఎంతగానో ప్రభావితం చేస్తోంది.

పెళ్లిసందడులు అక్కడ కొనసాగుతూన్నా, పల్లెప్రజల జీవనసరళిని అలా ఆకళింపు చేసుకుంటూనే ఉంది. ఉదయాన్నే నాలుగు గంటలకే నిద్రలేస్తున్నారు. లేవగానే ఆవిడ పాలేరుల చేత పశువుల కొట్టాన్ని శుభ్రం చేయిస్తోంది. పాలు పితికించి, డైరీకి పంపిన తర్వాత గాని ఇంటిపనుల్లో పడటం లేదు.

వీరబ్రహ్మం అయితే ఆ వర్షపు చిరుజల్లులలోని చలిని కూడా లెక్కచేయకుండా ఇంటి పంచన స్నానం చేస్తున్నాడు. తర్వాత గొడుగు వేసుకుని పంటచేనును పరామర్శించడానికి వెళ్ళాడు. వెళ్లిన మనిషి కాఫీసమయానికి ఇంటికి చేరుకున్నాడు. తర్వాత కాఫీ, టిఫిన్ అయ్యేదాకా ఇంట్లోనే ఉండి, మరోమారు కాఫీ తాగిన తర్వాత పొలం వైపుకు వెళ్ళిపోయాడు. వర్ధనమ్మ అయితే అదే పనిగా ఇంటి పనుల్లో పడిపోయి ఉంది. మధ్య మధ్యలో తనను పలకరించి ఏమైనా కావాలా అంటూ కనుక్కుని వెళుతోంది.

వారి ధోరణులను చూసిన అంజన ఎంతగానో పొంగిపోతోంది. తన మనసులోని అప్పటి వెలివేత ధోరణులన్నీ ఒక్కసారిగా మటుమాయమయ్యాయి. తాము పనిచేస్తున్న పట్టణంలోని ఉద్యోగాలతో పోల్చితే వీరికొచ్చే ఆదాయం నామమాత్రం. కానీ వీళ్ళకు తాము చేస్తున్న పనుల పట్ల విసుగు గాని, అసంతృప్తి గాని చెందడం లేదు. అన్నిటా తీయని తలపులతో మమేకమైపోయి ఉన్నారు. నాలుగురోజుల వరుసగా ఆఫీసుకు వెళ్ళగానే సెలవు ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురుచూసే తమకు... ఎప్పుడు తెల్లవారుతుందా, పొద్దుపొడుస్తుందా... ఎప్పుడు పనిలోకి వెళ్దామా అని ఆత్రుత పడే ఈ పల్లెజీవులకు చాలా తేడా ఉందనిపిస్తోంది. బయట ఉండి ఉండి కురుస్తూన్న వర్షం కారణంగా ఊరు అంతా నీటితో దిగ్బంధమైనట్లు అనిపిస్తోంది.

పల్లె ప్రపంచం యొక్క పరిమళం ద్విగుణీకృక్రితమవుతున్నట్లుగా చంద్రబాబు చేసిన కూతురు పెళ్లి ఏర్పాట్లు చాలా ఘనంగా ఉన్నాయి. పెళ్లికూతురు పుత్తడి బొమ్మలాగా ముచ్చట గొలుపుతోంది. పెళ్ళికొడుకు అయితే సరేసరి. పెద్దగా చదువుకోలేదట. వ్యవసాయం చేసుకుంటూ గొప్పగా గౌరవంగా బతుకుతున్న అతగాడి మొహంలోని ఆత్మసంతృప్తి, సంతోషాలు ముచ్చట గొల్పుతున్నాయి.

పెళ్లి క్రతువు ముగిసిన తరువాత, తెచ్చిన బహుమతిని చదివించేసి, పెళ్లిభోజనం చేసి విడిదికి వచ్చిన తర్వాత అంజనకు కంటిమీద కునుకు కరువు అయిపోయింది. నిద్రపట్టకపోయినా చలిగా ఉండడంతో కిటికీ తలుపులు మూయబోయింది. వర్షం క్రమంగా తగ్గుముఖం పడుతుంది. కిటికీలోంచి కనిపించిన ఆ దృశ్యాన్ని చూసిన అంజన ఒక్కసారిగా చకితురాలయిపోయింది.

పెరట్లో నులకమంచం మీద వీరబ్రహ్మంగారు పడుకుని ఉన్నారు. పాతకాలపు ట్రాన్సిస్టర్ పక్కన పెట్టుకున్నాడేమో ఆ రేడియోలోనే ఘంటసాలవారి ఆపాత మధురగీతాలు వీనులవిందు చేస్తున్నాయి.

వర్ధనమ్మ గారు కూడా పక్కనే కూర్చుని, మొగుడితో ముచ్చట్లు ఆడుతోంది.

మంచు, మసకవెన్నెలా కలగలిసిపోయాయి. ఇలాయి కర్ర లాంతరు వెలుతురులో సృష్టిని సుస్పష్టంగా దృశ్యమానం చేస్తున్నాయి. ఆ తేజోమయ సందర్భాన్ని చూసిన అంజన ఒక్కసారిగా పొంగిపోతోంది.

పది సంవత్సరాల క్రితం అదృష్టవశాత్తు తమ వివాహం కూడా ఈ ఊరిలోనే జరిగింది. ఇప్పటిలాగానే ఆ రోజున జోరున కురిసిన కుంభవృష్టిలో జరిగిన పెళ్లిలో మాధవ్ చేత మూడుముళ్ళు వేయించుకుంది. కానీ కారణం ఏదైనా అప్పటినుండి అరుదైన ఇలాంటి పల్లె అనుభూతుల్ని అనుభవించే అవకాశం తమకు రాలేదు. చెప్పాలంటే ఇన్ని సంవత్సరాల తమ

వైవాహిక జీవితంలో తాను మాధవ్, ఉద్యోగం తాలూకు పరుగులు ఉరుకులే తప్ప, ఇంతటి తీరిక క్షణాలను ఆనందంగా అనుభవించినట్లు తనకు గుర్తు లేదు.

మనిషి సంతోషంగా ఉండటానికీ, డబ్బుకు ఏమాత్రం సంబంధం లేదనిపిస్తోంది ఆమెకు.

★★★

“పెళ్లికని పంపించేసి నాలుగు రోజులపాటు ఈ ఊరు గాని ఊరిలో నిన్ను ఉంచేసి ఇబ్బంది పెట్టాను కదూ!” అంజనను దగ్గరకు తీసుకుంటూ అనబోయాడు.

ఇక్కడ అడవివరంలో చిక్కుకుపోవడం, మాధవ్ తనకోసం బయలుదేరి రావడం అంజనకు అలవికాని ఆనందాన్ని ఇస్తోంది. ఇక చంద్రరావు కుటుంబ సభ్యులకైతే సరే సరి!

చాలా ఏళ్లు తర్వాత వచ్చాడేమో పుట్టిన ఊరు మాధవరావును పులకింతకు గురిచేస్తోంది. అప్పటి మనుషుల నైజాలు ఇప్పుడు అప్రస్తుతాలుగా అనిపిస్తున్నాయి. అవన్నీ అర్థంలేని విషయాలుగా అనిపించేసరికి మాధవ మనసు తేలిక పడుతోంది.

“పట్టణంలో ఉదయం లేవడం మొదలు ఉద్యోగం అంటూ ఉరుకులు పరుగులతో చెరోవైపు వెళ్ళిపోయే మనం తీరిగ్గా కూర్చుని మాట్లాడుకుని ఎన్నాళ్ళయింది!”

“ఆదివారమనగానే తెలిసిన వాళ్ళింట్లో బర్త్‌డే ఫంక్షన్‌లూ, మ్యారేజ్ సెలబ్రేషన్లూ తప్ప ఏనాడైనా వర్షం కురుస్తున్న సాయంత్రాలని హాయిగా ఎంజాయ్ చేసామా చెప్పు!” అప్పుడే మరల వర్షం తుప్పరలను చూస్తూ తన్మయత్వంతో అంటున్నాడు.

“నిజానికి మొదట్లో ఈ అడవివరాన్ని కాదనుకున్నవాడ్ని... తర్వాత ఇలా పల్లె మధురిమలను చూసిన తర్వాత ఏదో యాంత్రికంగా బతుకుతున్నామనిస్తోంది... మన మూలాలకు సంబంధించిన వేళ్ళు ఎక్కడున్నాయో తెలిసాక, నైజాలను త్రోసి రాజని ప్రతిసారీ ఇక్కడికొచ్చి ఉండాలనిపిస్తోంది డియర్!” భార్య వైపు లాలనగా చూస్తూ అంటున్నాడు.

“అందుకే మీకూ... మీ ఊరి వర్షానికి థాంక్స్ చెప్తున్నాను” తమకం నిండిన మనసుతో మాధవ్ చేతిని తన చెక్కిలికి ఆన్చుకుంటూ పలుకుతోంది అంజన.

# తల్లి మనసు

**కె రామలక్ష్మి**

**కథా మార్గదర్శి కథ**

***"నేను బొద్దుగా బాగుండేవాడ్ని బాబుగారూ. ముష్టి అడిగితే నన్ను ఎవరూ అంతగా పట్టించుకునేవారు కాదు. 'పో పోరా' అంటూ కసిరేసేవారు. అమ్మకి ఈ ఆలోచన మా పక్కింటిది చెప్పింది. ఆ రోజు, అప్పుడే కదలబోతున్న బస్సు కిందకి జాగ్రత్తగా తోసేసింది. నే పడ్డానేగాని నా చెయ్యింకా దాని చేతిలోనే ఉండిపోయింది. అంచేత బతికిపోయాను. ఆ దినం అమ్మ చాలా సంపాదించింది.***

"నేను బొద్దుగా బాగుండేవాడ్ని బాబుగారూ. ముష్టి అడిగితే నన్ను ఎవరూ అంతగా పట్టించుకునేవారు కాదు. 'పో పోరా' అంటూ కసిరేసేవారు. అమ్మకి ఈ ఆలోచన మా పక్కింటిది చెప్పింది. ఆ రోజు, అప్పుడే కదలబోతున్న బస్సు కిందకి జాగ్రత్తగా తోసేసింది. నే పడ్డానేగాని నా చెయ్యింకా దాని చేతిలోనే ఉండిపోయింది. అంచేత బతికిపోయాను. ఆ దినం అమ్మ చాలా సంపాదించింది.

సోషియాలజీ డిపార్ట్మెంటులో అబ్బాయిలూ అమ్మాయిలూ కూడా చాలా గ్లామరస్‌గా ఉంటారు. ఏదైనా కొత్తదనం ప్రవేశించిందంటే అది ముందు వీళ్లలోనే అని చెప్పుకోవచ్చు. చూడ్డానికి అందంగా, నాజూకుగా ఉంటూ, సరదాగా, సగానికి పైగా టైము కేంటీనులో గడుపుతూ, కబుర్లు చెప్పుకునే ఈ కుర్రాళ్ళ హృదయాలుమటుకు నవనీతంలాంటివి. ఏదైనా చాకిరీ చేయవలసి వస్తే, కలక్షన్లకి తిరగవలసి వస్తే, నడుం కట్టి ముందుకు ఉరికేది వీళ్ళే. అప్పుడే అనిపిస్తుంది, వేసే వేషాలకీ, చేసే పనులకీ మనం ముడి వేయకూడదని.

ఈ కుర్ర గ్రూపులో నలుగురు అబ్బాయిలూ, నలుగురు అమ్మాయిలూ ఉన్నారు. ఎప్పుడూ కలిసే తిరుగుతూ ఉంటారు. "ఏమిటి, క్లాసుల్లేవా?"అని కర్మ చాలక ఏ ప్రొఫెసరైనా అడిగితే, "ప్రోజెక్టు పనిమీద తిరుగుతున్నాం" అంటారు నవ్వుకుంటూ. "వెల్, వెల్" అంటూ ఆ ప్రొఫెసర్ తలాడించక తప్పదు.

రోజూ వాళ్ళు పదకొండు గంటలప్పుడు కేంటీను కేసి గుంపుగా నడుస్తూ వెళ్ళే వేళ; ఓ ఏడెనిమిదేళ్ళ కుర్రాడు అడుక్కుందుకు సొట్టకాలు కుంటుకుంటూ వచ్చే వేళ.

రోజూ తోచినంత వాడికి ఇస్తూనే ఉండేవారు. ఆ కుర్రనాగమ్మ ముఖం వారి దయకు చింకిచేటంత అయ్యేది. ఎంత ఆతృతగా పరుగెత్తి వచ్చేవాడో, తిరిగి వెళ్ళేటప్పుడు అంత నిదానంగానూ వెళ్ళేవాడు.

ఈ సంగతి గుంపులో సరళ కనిపెట్టింది. "లుక్, వాడెందుకంత ఇదిగా వెడతాడు" అంది కుమార్‌తో.

కుమార్ ఒకసారి తన గిరజాల జుట్టు ఝుడిపించి "నాకూ అర్ధం కాదు" అన్నాడు... అందమైన తన కంటద్దాలని తీసి తుడుస్తూ. దాంతో అంతా చర్చలో పడ్డారు.

"దీనికంత గొడవెందుకు, వాడినే అడిగితే తేలిపోతుందిగా" అంది ఆదిలక్ష్మి. ఆదిలక్ష్మి ఆ గ్రూపులోకి ఎలా చేరిందో మనకి ఆశ్చర్యంగా ఉంటుంది. తెల్లని చీరా, తెల్లని రవికా, కొరడాలా అల్లిన జడతో చాలా సింపుల్‌గా గంభీరంగా ఉంటుంది. రంగురంగుల సీతాకోకచిలుకల మధ్య ఇంకా రూపాంతరం చెందని గొంగళిపురుగులా ఉంటుంది వారి మధ్య ఆదిలక్ష్మి. కాంటీన్నుండి తిరిగి వస్తుంటే, దూరంగా చెట్టుకింద నిలబడి ఉన్నాడు ముష్టి కుర్రాడు. "వాడిని పిలుద్దాం" అంది సరళ.



జుట్టు ఎగరేసుకుంటూ మెరుపులా పరుగెత్తింది మోతీ వాడికోసం. వాడి చెయ్యి పట్టుకొని నెమ్మదిగా నడిపించుకు వచ్చింది.

“ఎందాకండీ” అంటూ హడలిపోతున్నాడు కుర్రాడు. ఎక్కువ డబ్బులిచ్చేశామని చెప్పి, తిరిగి లాక్కుంటారేమోనని వాడి భయం.

“రా నీతో మాట్లాడాలి” అని, మొత్తానికి లాక్కొచ్చింది. అంతా ఆ కుర్రాడితో కలిసి, నిండుగా పూసి, సువాసనలు వెదజల్లుతున్న గుల్మొహర్ చెట్టుకింద కూర్చున్నారు.

ఆదిలక్ష్మి వాడి భయం పోగొట్టి అడిగింది “ఏం ఇంకా అలా నిలబడి పోయావు” అని. వాడిని అలా జాలిగా అడిగేసరికి దుఃఖం ముంచుకొచ్చింది. భోరున ఏడ్వడం మొదలుబెట్టాడు.

“చెప్పు పరవాలేదు” అని బ్రతిమాలారు.

“మా అమ్మ వచ్చేదాకా నేను ఇక్కడే ఉండాలి” అన్నాడు వెక్కుతూ.

“ఎందుకు? డబ్బులిచ్చాంగా, ఏదైనా కొనుక్కొని తినకూడదూ?” అంది సరళ.

వాడు మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు.

“మై గాడ్, వీడుత్త ‘క్రై బేబీలా” ఉన్నాడు” అంది మోతీ.

“మీరుండండి, నేను టేకిల్ చేస్తాను” అంటూ ఆదిలక్ష్మి వాడిని సముదాయించింది.

“మీ అమ్మ అన్నం తెస్తుందా?” అడిగింది. తల అడ్డంగా ఊపాడు.

“మరెందుకు?” అనడిగింది సరళ.

“నేను ముష్టి ఎత్తిన డబ్బులన్నీ తీసుకుందుకు వస్తుంది” అన్నాడు. అంతా ఈ సమాధానం విని బిక్క మొహాలు వేశారు.

“ఇంటికి తీసుకువెళ్లి అన్నం వండి పెడుతుందేమో” అంది అనుమానంగానే సరళ.

“ముందిది చెప్పు, పొద్దున్నే ఏం తిన్నావు?” అడిగాడు కుమార్.

“ఏం తినలేదు. కడుపు నిండుగా ఉంటే ముష్టి ఎత్తలేవు. నిన్ను చూసి ఎవరూ జాలిపడరు” అంటుంది మా అమ్మ. “అందుకే ఏం పెట్టదు” అన్నాడు.

“మై గాడ్” అంటూ చివాలున లేచి, కుమార్ అక్కడ తోటమాలిని పిలిచాడు. “ఖాదర్, అర్జెంట్‌గా వెళ్ళి ఒక టీ, బన్ తీసుకురా” అని వాడి చేతిలో డబ్బులు పడేశాడు.

“మీరుండేదెక్కడ?” అడిగింది ఆదిలక్ష్మి.

“పెరంబూరు చివర. పొద్దున్న బస్సులో ఈ బీచి రోడ్డులో దింపేస్తుంది. మధ్యాహ్నం చేసి తను కూడా వస్తుంది” అన్నాడు వాడు.

ఖాదర్ బన్నూ, టీ తెచ్చిచ్చాడు. కుర్రాడు మొదటిసారే సగం బన్నూ కొరికాడు ఆత్రంగా.

“నీ పేరేంటీ?”

“వీరమణి” అన్నాడు నోటినిండా పెట్టుకొనే. బన్నుతిని టీ తాగాడు. వాడి కళ్ళు కొంచెం మనిషి కళ్లలా కనిపించాయి ఇప్పుడు. వేటగాడు తరుముతున్న జంతువులా లేదు.

“మీ అమ్మ నీకు తిండి పెట్టనప్పుడు నీవు సంపాదించిన దాంట్లో ఎందుకు తినవు?” కోప్పడుతున్నట్టు అడిగాడు కుమార్.

“తింటే చంపేస్తుంది” అన్నాడు భయంగా వీరమణి.

“ఎలా తెలుస్తుంది?” అడిగింది సరళ.

“తెలుస్తుందండీ, నా కాలు చూడండి” అని చూపెట్టాడు. కుడికాలు మోకాలు దాకానే ఉంది. అందుకే వాడు కుంటుతూ నడుస్తాడు.

“ఏమైంది నీ కాలుకి?”

“బస్సు కిందకి తోసేసింది” అన్నాడు తొణక్కుండా.

“ఎవరు? మీ అమ్మా?” నమ్మలేనట్టు అడిగింది ఆదిలక్ష్మి.

“అవునమ్మాయిగారూ, కాలు లేకపోతే డబ్బులు ఎక్కువ సంపాదించొచ్చని తోసేసింది” అన్నాడు.

“రామ, రామ, తల్లా అది” అంది సరళ.

“నేను బొద్దుగా బాగుండేవాడ్ని బాబుగారూ. ముష్టి అడిగితే నన్ను ఎవరూ అంతగా పట్టించుకునేవారు కాదు. ‘పో పోరా’ అంటూ కసిరేసేవారు. అమ్మకి ఈ ఆలోచన మా పక్కింటిది చెప్పింది. ఆ రోజు, అప్పుడే కదలబోతున్న బస్సు కిందకి జాగ్రత్తగా తోసేసింది. నే పడ్డానేగాని నా చెయ్యింకా దాని చేతిలోనే ఉండిపోయింది. అంచేత బతికిపోయాను. ఆ దినం అమ్మ చాలా సంపాదించింది. ఆస్పత్రిలో నా కాలు తీసేశారు. అప్పట్నుంచీ అదనుకున్నట్టు జాలిపడి డబ్బు ఎక్కువే వేస్తున్నారు బాబుగారూ” అన్నాడు తన కాలెలా పోయిందో చెప్తూ.

“అందుకే అంత నిజాయితీగా డబ్బు తల్లికి అందిస్తున్నాడు” అంది సరళ.

“చూడు, ఈరోజు నుంచి ఎక్కువ తిరక్కు. మేం మధ్యాన్నం నీకు డబ్బులు వెయ్యం. అన్నం పెట్టిస్తాం” అన్నాడు మోహన్.

వీరమణి మొహం వికసించినంతసేపు పట్టలేదు ముడుచుకుపోడానికి. “మా అమ్మ డబ్బులివ్వకపోతే నన్ను చంపేస్తుంది” అన్నాడు

“పరవాలేదు, మేం చూసుకుంటాంగా” అని భరోసా ఇచ్చాడు మోహన్.

అంతా వీరమణిని వదిలి క్లాసులకని కదిలారు. అందరి మనసుల్లోనూ అనుకోకుండా వీరమణి తల్లిని చూడాలన్న కోరిక మెదిలింది.

వీరమణి ఆదిలక్ష్మి బృందానికి దరిదాపు పెంపుడుకొడుకే అయ్యాడు. వాడి బతుకు ఎలా బాగుపర్చాలన్నదే ధ్యాస అయిపోయిందా బృందానికి. ఒకటికి రెండు చొక్కాలు తెచ్చారు. వాడి జుట్టు సాఫీగా కత్తిరిచారు. వాడిని ఒక చక్కని అబ్బాయిగా చూడాలని తహతహలాడారు అంతా.

కాని వీళ్ళు దగ్గరౌతున్నకొద్దీ వీరమణి వీళ్ళను తప్పించుకు తిరగడం ప్రారంభించాడు. వీళ్ళంటే వాడికి భయం పట్టుకుంది.

"ఏం, ఏమైంది నీకు? మేమంటే నీకు భయం ఎందుకు?" అడిగారొకసారి.

"మా అమ్మ చంపేస్తోంది బాబూ, నన్నొదిలేయండి" అంటూ బావురుమన్నాడు. ఏడుస్తూనే చొక్కా ఎత్తి, వీపు చూపించాడు. కమిలిపోయి ఉంది.

"డబ్బు అంతా తినేస్తున్నానని తన్నేస్తుంది బాబూ" అన్నాడు.

"నువ్వు ధైర్యంగా ఉండు. నీకు కాలు కూడా పెట్టిస్తాం మేము" అంది ఆదిలక్ష్మి.

వాడి మొహంలో ఆనందం తాండవించింది. కానీ అంతలోనే భయం అలముకుంది.

"నన్నింక బతికుండనీయదు బాబూ, నాకు కాలొద్దు" అన్నాడు వీరమణి.

"నీ మొహం, నీకు మేం కాలు పెట్టిస్తే మొట్టమొదట ఆనందించేది మీ అమ్మే! చూస్తుండు" అని ధైర్యం చెప్పారు.

అనుకున్నట్టుగానే జెనరల్ ఆస్పత్రిలో సంప్రదించి అంతా కలిసి కావలసినంత డబ్బు పోగుచేసి వీరమణికో కాలు సిద్ధం చేయించారు.

అది ఫిట్ చేసే రోజున మోతీ వాళ్ళ అన్నను బతిమాలి కారు తీసుకొచ్చింది. వాడికి కాలు పెట్టినందుకు ఆదిలక్ష్మి బృందం అంతా ఎంత ఆనందించారో చెప్పలేం.

వాడు నెమ్మదిగా లేచి రెండు కాళ్లతో నడుస్తుంటే వారి కంట నీరు తిరిగింది. "ఎంత మంచి పని చేశాం" అని వారి మనసుల్లో తృప్తి ఏర్పడింది.

వీరమణి నెమ్మదిగా నడుస్తూ తన కాలు చూసి మురిసిపోతున్నాడు. కాలు వచ్చిన సంతోషంలో వాడికి ఆకలి దప్పులు కూడా తెలియడంలేదు.

కాని ఏం లాభం?

మర్నాడు క్లాస్ కేన్సిలై పదిన్నరకే ఆదిలక్ష్మి గేంగు బయటకి వచ్చేసింది. కాంపౌండులో ఉన్న గుల్మొహర్ చెట్టు వేపు అంతా ఒకసారే చూశారు. ఎప్పుడూ వీరమణి అక్కడే కూర్చొని ఉంటాడు కాని, ఈ పూట వాడక్కడ లేడు. మోహన్ వెళ్ళి ఖాదర్‌ని అడిగాడు. ఖాదర్ మొహం దించుకున్నాడు.

"అటు పరుగెట్టాడు సార్" అంటూ బీచ్ కేసి చూపెట్టాడు. ఆతృతగా అంతా రోడ్డు దాటి బీచ్ కేసి పడిచారు. వీరమణికంటే వాడి కంచుకంఠం ముందు వినిపించింది వాళ్ళకి.

"అమ్మా నా కాలు... నా కాలు" అని అరుస్తూ, కుంటుతూ తల్లి వెనకాల పరుగెడుతున్నాడు వాడు.

"వెధవా నీకో కాలొకటి, నాలుగు డబ్బులు రాకుండా! నీకో కాలు కావాలేం... కాలు; ఇంద తీసుకో" అని వెక్కిరిస్తూ సముద్రం కేసి పరుగెడుతోందామె.

ఇసకలో కుంటలేక ఏడుస్తూ "నా కాలు, నా కాలు" అంటూ కూలబడ్డాడు వీరమణి. జబ్బ సత్తువ కొద్దీ ఆ కాలు సముద్రంలోకి విసిరేసిందా తల్లి.

తల కింద కొట్టుకుంటూ "నా కాలు, నా కాలు" అని దిక్కులు పిక్కటిల్లేలా

ఏడుస్తున్నాడు వీరమణి. ఆ దృశ్యం చూసి బొమ్మల్లా నిలబడిపోయారు ఆదిలక్ష్మి బృందం. "ఛీ ఏం మనిషి" అంది ఆదిలక్ష్మి.

ఒక్క మాటకూడా మాట్లాడకుండా వెనక్కి తిరిగారు. "వాట్ ఉదయాన్నే బీచికి వెళ్ళి వస్తున్నారా? టట్... టట్" అంటూ నవ్వేరు ఎదురొచ్చిన ప్రొఫెసర్ అబ్రహం గారు.

జరిగినదంతా చెప్పి "మేమిది నమ్మలేం" అన్నారు. ప్రొఫెసర్ గారు బాధగా నవ్వేరు.

"నమ్మక ఏం చేస్తారు? అది బతుకు లెక్కల పద్ధతి. మనం మార్చలేం" అన్నారు.

"ఎంత ఇదైనా ఆమె తల్లి కాదా సర్? తల్లి మనసు వెన్న అంటారు కదా? తన బిడ్డల కొరకు ప్రాణాన్నైనా ఇస్తుందంటారు కదా? అవన్నీ కథలేనా?" అడిగింది మోతీ.

"యెస్ మై డియర్, అవన్నీ మిథ్స్. పుక్కిటిపురాణాలు. బ్రతుకు పోరాటంలో తల్లీ లేదు, తోడూ లేదు. ఎవరి స్వార్ధం వారిది" అన్నారు. దళసరి కళ్ళద్దాల వెనక ప్రొఫెసర్‌గారి కళ్ళలో కూడా పల్చగా నీటిపొర కమ్ముకుంటోంది.

ఇది జరిగాక వీరమణి మళ్ళీ బీచిరోడ్డుకి రాలేదు. మోహన్ ఇక ఉండబట్టలేక ఖాదర్ని అడిగాడు "వీరమణిని చూశావా?" అని.

"వాళ్ళమ్మ వాడ్ని సెంట్రల్ దగ్గర వదిలి పెడుతుంది సాబ్" అన్నాడు హోస్‌తో చెట్లకు నీళ్ళు పోస్తూనే.

ఆదిలక్ష్మి బృందం మటుకు క్లాస్‌రూమ్ లోనుంచి బయటకు రాగానే ఆ గుల్మొహర్ చెట్టు కిందకోసారి చూడ్డంమటుకు మానలేదు.

# తెలుగు సాహిత్యము
## శతకములు

మోచర్ల అనంత పద్మనాభరావు

(క్రిందటి సంచిక తరువాయి భాగం)

*ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండుఁ*
*జూడఁ జూడ రుచుల జాడ వేఱు*
*పురుషులందు పుణ్య పురుషులు వేఱయా*
*విశ్వదాభిరామ వినర వేమ||*

ఎంతటి చక్కని సారూప్యము. ఉప్పూ, కర్పూరం చూడడానికి ఒక్కలాగే ఉన్నా, గుణములలో తేడా ఉన్నట్లు, పుణ్యపురుషులు సామాన్యులుగానే ఉంటారు. కాని వారి లక్షణములు, విశిష్టతను బట్టి పుణ్యపురుషులుగా గుర్తించబడతారు. రూపమును చూసి నిర్ధారణకు రాకూడదని భావము.

*తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు*
*పుట్టనేమివాఁడు గిట్టనేమి*
*పుట్టలోనఁ జెదలు పుట్టదా గిట్టదా*
*విశ్వదాభిరామ వినర వేమ||*

పిల్లల కోసమే జీవితమన్నట్లు సర్వం త్యాగం చేసి అహర్నిశలు వారి బాగోగులకు, ఉన్నతికి పాటుపడిన తల్లిదండ్రులను, జీవితపు చరమదశలో నున్నప్పుడు కంటికి రెప్పలా చూసుకోవాల్సిన పిల్లలు, వారిని వృద్ధాశ్రమాల పాలు చేస్తున్న ఈ నాటి సమాజ వ్యవస్థకి ఓ చురక ఈ చిన్న పద్యం. పద్యం చిన్నదే గాని భావం అమూల్యం.

*గంగిగోవు పాలు గరిటెడైనను జాలు*
*కడివెడైన నేమి ఖరముపాలు*
*భక్తిగలుగు కూడు పట్టెడైనను జాలు*
*విశ్వదాభిరామ వినర వేమ||*

ఈ పద్యానికి అర్థం వేరే చెప్పవలసిన అవసరంలేదు. గాడిద పాలు కూడా అమ్ముకునే ఈ రోజుల్లో ఈ పద్యానికున్న విశిష్టతను ప్రశ్నించవలసిన అగత్యమూ లేదు.

పై నుదహరించిన శతకములలోని పద్యాలన్నీ విజ్ఞానపరిమళాలను వెదజల్లే సుగంధ పుష్పాలు.

ఆధునిక, రోదసీ సాంకేతిక విద్యావిధానంలో తెలుగుభాషకే సరైన గుర్తింపు లేనప్పుడు ఇక శతకములను పట్టించుకునే నాధుడెవరు? అవి మరుగున పడి అవసానదశలో నున్నట్లుగానే పరిగణించవచ్చు. శతక ప్రక్రియ పూర్వవైభవ పునరుద్ధరణకు పాటుపడితే గాని, మన భావితరాలవారికి ఈ విజ్ఞాన సంపద నందించలేని వారమౌతాము. చిన్న చిన్న పద్యములలో నిగూఢమైన విజ్ఞానాన్ని పిల్లలకు చిన్న వయసులోనే తెలిసేలా చేయగలిగితే మన భాషకు, మన వారసత్వ సంపదకు సముచిత స్థానాన్ని కల్పించిన ఘనత దక్కుతుంది.